1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 2
పుటలు : 52
రు. 25 లు
ISSN NO: 2582-8738

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఏప్రిల్ 2022

యు.జీ.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



పలు నుడులూ నాడులతో ఒక్కటైన మన దేశాన్ని కాపాడుకొందాం

ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ(21-02-2022)
ప్రభుత్వ మహిళా కళాశాల (గుంటూరు)లో
తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సభ






సమాఖ్య జాతీయ అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షులు డా॥సామల రమేష్‌బాబు,
కళాశాల తెలుగు శాఖ అధిపతి డా॥ కె. సురేష్, సమాఖ్య సమావేశకర్త డా॥ వి. సింగారావు





ప్రసంగిస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా॥ వి.ఆర్. జోత్స్నకుమారి, పాల్గొన్న అధ్యాపకులు డా॥ వి.భవాని,
శ్రీమతి పి. విజయలక్ష్మి, డా॥ డి. ధాత్రీకుమారి, డా॥ ఎస్. దివిజాదేవి, విద్యార్థినులు

అమ్మనుడి కార్యాలయంలో
బౌద్ధబిక్షు 'బోధిహీన్'



శ్రీలంకలోని మూలవాసులైన తెలుగు నాగాప్రజల సేవలో ఉన్న బౌద్ధ బిక్షువు బోధిహీన్ గారు **అమ్మనుడి** కార్యాలయాన్ని ఫిబ్రవరి 26న దర్శించారు. సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబుతో కలసి అనేక విషయాలు చర్చించారు. ఆ సందర్భంగా అమ్మనుడి పత్రికతో పాటు సింహళి నుడి ద్వారా తెలుగును నేర్చుకోవడానికి ఉపకరించే పుస్తకాన్ని(తెలుగువాణి ట్రస్టు ప్రచురణ), మరికొన్ని పుస్తకాలను స్వామికి బహూకరించారు.

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

ఏప్రిల్ 2022

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...



రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. <u>హామీపత్రం తప్పనిసరి:</u> **రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపించి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం ఇబ్బంది అవుతుంది. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

ఉగాది శుభాకాంక్షలు

లోపలి పుటలలో....

కార్టూన్లు	రేఖాచిత్రాలు	ముఖచిత్రం	కంప్యూటర్
సరసి	**చిదంబరేశ్వరరావు**	**హంపి**	**బండారు రఘురాం**

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

TELUGU JAATHI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **91402002038788O**

IFSC Code : UTIB0000556

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.
94404 48244 లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా – 522 211.
ఫోన్ : 94929 80244
ఇ–మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ– పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ–మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. –ప్రచురణకర్త

ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/–లు, ఆపైన– విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

ఇవీ సంగతులు...

స్టెమ్-సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్/మేనేజ్‌మెంట్ కోర్సులు

స్టెమ్ - సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్/మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రాంతీయ భాషల్లో అందించేందుకు యూజీసీ సంస్థ కసరత్తును తీవ్రతరం చేసింది. అన్ని డిగ్రీ- పట్టాస్థాయి, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ- పట్టాస్థాయి కోర్సులను ప్రాంతీయ భాషల్లో అందించాలని యుజిసి కేంద్ర విశ్వవిద్యాలయాలకు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు సూచనలు పంపిస్తూనే ఉంది. ఇటీవలే ఈ విషయమై ఒక నమూనా పత్రాన్ని రూపొందించి, ఆ నమూనా ప్రకారం పాఠ్యాంశాలను ప్రాంతీయ భాషల్లో పూర్తిస్థాయిలో అందించమని తన అధీనంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులకు యూజీసీ సూచన చేసింది. ఐఐటీల్లో ప్రాంతీయ భాషా బోధన అక్కడి విద్యార్థుల భాషావైవిధ్యం వలన పలు సవాళ్ళను ఎదుర్కొంటోంది. బోధన సిబ్బందిలో ఆసక్తి లేమి, పాఠ్య సామగ్రి కొరత వలన ప్రాంతీయ భాషల్లో బోధన ఐఐటీల్లో, ఎన్ఐటీల్లో వెనుకంజలో ఉంది. అక్కడ ఎదురైన సవాళ్ళను గుర్తించి, ఆ నేర్పుతో కేంద్ర-రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ప్రాంతీయ భాష కోర్సులను ప్రవేశపెట్టే దిశగా యూజీసీ ఆలోచనలు చేస్తోంది.

దిల్లీ విశ్వవిద్యాలయ ఉపకులపతి మాట్లాడుతూ హిందీ-ఆంగ్లం మాధ్యమాలు బాగా కొనసాగుతూ, ఇతర ప్రాంతీయ భాషా మాధ్యమాలు కేవలం కొందరు విద్యార్థులకే సహాయకంగా ఉంటాయని అన్నారు. జమ్మూ కేంద్ర విశ్వవిద్యాలయ సిబ్బంది జె.ఎన్.బలియా ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ మాతృభాషల్లో చదువుకుంటే విషయంపై మెరుగైన స్పష్టత ఉంటుందని, ఈ పద్ధతి అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో పాటిస్తున్న పద్ధతే అని అన్నారు.

భారతీయ భాషల్లో సాంకేతిక పదకోశాల రూపకల్పనకు సీఎస్‌టిటి సంస్థను ఆశ్రయించిన ఏఐసీటీఈ

కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (వైజ్ఞానిక మరియు సాంకేతిక పదాల రూపకల్పన సంస్థ- సీఎస్‌టీటీ) ఏఐసీటీఈ వారు సూచించిన బోధన విషయాలకు సంబంధించిన సాంకేతిక, వైజ్ఞానిక పదాలను రూపొందించనుంది. ఈ పనికి గానూ కావాల్సిన ఒప్పంద పత్రాలపై ఇరు సంస్థలు సంతకాలు చేశాయి. ఏఐసీటీఈ వారు ఇప్పటివరకు 218 ఇంజనీరింగ్ పాఠ్య పుస్తకాలను 11 భాషల్లోకి అనువాదం చేసారు. ఈ పని కోసం 3000 మంది ఔత్సాహిక అనువాదకులను, ఇంటర్న్ విద్యార్థులను ఏఐసీటీఈ నియమించింది. అనలిటిక్స్ లాంటి పదాలను, గణితంలోని సూత్రాలను అనువాదం చేయటం కష్టమవుతుందని అనువాదకులు తెలిపారు.

'ఎంబిబియస్ చదువులు మాతృభాషలో ఉండాలి'- ప్రధానమంత్రి

'కుదరదు'; డాక్టర్లు

జన్ ఔషధి దివస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ మార్చ్ 7వ తేదీన 'ఎంబిబియస్ విద్య మాతృభాషల్లో ఉండాలి' అని చెప్పారు. అయితే డాక్టర్లు ఈ ఆకాంక్ష అడియాశ అని, క్షేత్ర స్థాయిలో అసంభవమని, కుదరని పని అని అన్నారు.

మరో పక్క ఈ ఆకాంక్షను సాకారం చేస్తామంటూ హిందీ భాషా సంస్థాన్ వారు ఉత్తరప్రదేశ్‌లో, మధ్యప్రదేశ్‌లో ఎంబిబియస్ విద్య కోసం పాఠ్య సామగ్రిని తయారు చేస్తామని ముందుకు వచ్చారు.


మరి,- తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఒరియా, తదితర రాజ్యాంగం గుర్తించిన మాతృభాషలకు చెందిన వారేమంటారో?!


'గోండి' మాధ్యమంలో పాఠాలు నేర్పుతున్న బడి

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని ధనోరా గ్రామంలో అక్కడి గ్రామసభ కౌన్సిల్ అధ్యక్షుడు దేవ్జీ ఆట్ల తమ గ్రామంలోని బడిలో గోండి భాషలో పాఠాలు చెప్పనారంభించినట్టు మీడియాకు తెలిపారు. ప్రతి జిల్లాలోని వారు తమ తమ ప్రాంతపు మాతృభాషల్లో బడులను మొదలుపెట్టి మాతృభాషా మాధ్యమంలోనే చదువులు నడిపితే పిల్లలకు చదువు మరింత దగ్గరవుతుందని ఆయన అభిప్రాయం. పట్నంలోని పెద్ద బడుల్లో మాతృభాషలో చదువులు లేకపోవడం వలన విదిశ(మధ్యప్రదేశ్) లాంటి దూరప్రాంతాల నుంచి సైతం విద్యార్థులు ఈ గ్రామానికి గోండిలో చదువుకునేందుకు వస్తున్నారని గోండి ఉపాధ్యాయుడు రాజేంద్ర బొసం అన్నారు.

'అన్ని భాషలూ ముఖ్యమేకానీ హిందీ మరింత ముఖ్యం' -ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యానాయుడు

రాజ్యసభ సెక్రెటేరియట్ నిర్వహించిన హిందీ సలాహకార్ సమితి వారి తొమ్మిదవ చర్చాసభలో మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యానాయుడు గారు పై వ్యాఖ్య చేసారని దినపత్రికల్లో వార్తలు వచ్చాయి. ఇది మాతృభాష ఉద్యమకారులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. తక్కిన మాతృభాషలకంటే హిందీ ఎలా ఘనమైనదో తెలియక వారు మధనపడుతున్నారు. అయితే, ప్రభుత్వ కార్యకలాపాలు ఆ ప్రాంతపు భాషలోనే జరగాలనీ, విద్యార్థులకు బోధన వారి వారి మాతృభాషల్లోనే జరగాలని కూడా ఆయన అభిలషించారు. మాతృభాష మాధ్యమంలో చదువుకున్న వారెందరో నేడు పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసారు.


బాధ పడకండి నాన్న! తెలుగును అన్ని రంగాల్లో అభివృద్ధి చెయ్యమన్నారని మీనాన్న బూతుల రంగం ఎంచుకున్నాడు!!


అలవాటు ప్రకారం - స్వామీజీని దగ్గరకి తీసుకుని తలమీద ముద్దులు పెట్టడం లాంటివి చెయ్యకండి సార్!

సంపుటి : 8 సంచిక : 2
అమ్మనుడి
ఏప్రిల్ 2022

సంపాదకీయం

పలు నుడులూ నాడులతో ఒక్కటైన మన దేశాన్ని కాపాడుకొందాం

మన భారత రాజ్యాంగంలో 17వ విభాగమంతా అధికార భాష గురించే వ్రాసివుంది. అందులోని 4 అధ్యాయాల్లోని 9 అధికరణాలూ ఈ ప్రధాన అంశం గురించే మాట్లాడాయి. 'కేంద్రంలో అధికారభాష', 'రాష్ట్రాల్లోని ప్రాంతీయ భాషలు' అని మాత్రమే రాజ్యాంగం అన్నది తప్ప, కేంద్ర అధికారభాషే జాతీయ భాష అని గానీ రాష్ట్రాల్లోని అధికారభాషలు– అంటే 8వ షెడ్యూలులోని 22 భాషలు– జాతీయ భాషలు కావనిగానీ ఎక్కడా చెప్పలేదు. పైగా 'ఏ వ్యక్తి అయినా తనకు గల సమస్యలు, బాధలు, ఇబ్బందుల గురించి సంబంధిత కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వ అధికారి లేక అథారిటీకి పంపుకొను అర్జీ, ఫిర్యాదు లేక వినతి పత్రములు కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించే ఏ భాషలోనైనా ఉండవచ్చు' అని స్పష్టం చేసింది.

కాని, వాస్తవంగా జరుగుతున్నది ఏమిటి? కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, చివరకు మన పార్లమెంటులోని ఉభయసభలు, కోర్టులు, తక్కిన అధికార, అనధికార వ్యవస్థలూ ప్రజల భాషల పట్ల వ్యవహరిస్తున్నతీరు ఏమిటి? విదేశీ వలస ఆంగ్లభాషకున్న విలువ ఏ భాషకైనా ఉందా? హిందీకి తప్ప తక్కిన భాషలవారి గొంతు ఎంతవరకు వినిపిస్తున్నది? వలస భాష అయిన ఇంగ్లీషుతో పాటు హిందీకి తప్ప తక్కిన దేశీయ భాషలకు ఎంతవరకు విలువ ఉంది?

అంటే– రాజ్యాంగం గుర్తించిన 22 భాషలూ జాతీయ భాషలే అనీ, ప్రత్యేకించి జాతీయ భాష అంటూ ఒకటి లేదు అనీ చెప్పినట్లే కదా! అయితే ఇంత భాషావైవిధ్యం ఉన్న మన దేశంలో కేంద్ర అధికార భాషను నిర్ణయించవలసి వచ్చినప్పుడు రాజ్యాంగ నిర్ణయ సభ మెజారిటీ అనే సూత్రం ఆధారంగా హిందీని కేంద్ర అధికార భాషగా నిర్ణయించింది. అదే సూత్రం ఆధారంగా రాష్ట్రాలను కూడా ఏర్పాటు చేసింది. ఇందులో కూడా ఎక్కడికక్కడ మైనారిటీ భాషలకు కూడా తగిన అవకాశాల్ని ఏర్పాటు చేసింది. పెద్ద ఎత్తున కసరత్తు చేసి మొత్తానికి అందరి అంగీకారంతో రూపొందించిన వ్యవస్థ ఏడు దశాబ్దాలకు పైగా నడుస్తూ వచ్చింది. అయితే ఇప్పటివరకు వచ్చిన అనుభవాలను, సాంకేతికత అభివృద్ధి వల్ల వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకొని అన్ని రంగాలలో భాషల స్థితిగతుల్ని తిరిగి మూల్యాంకనం చెయ్యాలి. ప్రజల ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలుగకుండా– పరిపాలనలోను, విద్యారంగంలోను ప్రజల భాషలను సాధికారికం చెయ్యడం దిశగా ఆలోచనలు సాగాలి. భారతదేశానికి ఆంగ్లం వలసభాషేనన్నది వాస్తవం. అయితే దేశంలోని హిందీయేతర భాషా ప్రజలకు, ప్రాంతాలకు హిందీ కూడా వలసభాషే అన్న నిజాన్ని మనం విస్మరించకూడదు.

రాజ్యాంగ నిర్మాణం చేసిన సమయంలో మున్ముందు రానున్న అనేక సమస్యలను ఊహించి పెద్దలు కొన్ని జాగ్రత్తలను తీసుకున్నారు. భాషా రాష్ట్రాల ఏర్పాటు అందులో ముఖ్యమైనది. కాని కేంద్ర చట్టసభల్లో ఇప్పటికీ ఆంగ్లానికీ, హిందీకీ ఉన్న ప్రాతినిధ్యం, పలుకుబడి తక్కిన భాషలకు ఉందా? హిందీ మాట్లాడని ప్రాంతాల ప్రతినిధులు తమ భాషల్లో మాట్లాడగలుగుతున్నారా? అలా మాట్లాడితే, వారికి లభించే గౌరవం ఆదరణ ఏమైనా ఉందా? భాషల మధ్య యంత్రానువాదం, కృత్రిమ మేధాసౌకర్యం పెంపొందుతున్న ఈ రోజుల్లో వాటిని వినియోగించి, ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం ఎందుకు చేయడంలేదు? భారతదేశ ఐక్యతను కాపాడే అంశాలలో ఒకటిగా దీన్ని ఎందుకు పరిగణించరు? మచ్చుకు ఈ అంశాన్ని ప్రస్తావించాం. అన్ని రంగాల్లోనూ పరిస్థితి ఇంతే. రాజ్యాంగం ఏర్పడిన తర్వాత 15 ఏళ్లలో ఆంగ్లాన్ని పక్కన బెట్టి హిందీని పూర్తిస్థాయిలో అధికార భాషగా నిర్ణయించాలన్న ఆశయం ఏమైంది? ఈ దేశం పలు నుడుల, పలు నాడుల ఏకీకృత దేశమనే కఠిన వాస్తవాన్ని గుర్తించకపోవడం, దానికి అనుగుణంగా అన్ని దేశీయ భాషలను సాధికారికం చెయ్యాలనే లక్ష్యం, సంకల్పం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందనీ, పరిపాలకుల ఈ వైఫల్యం వల్లనే ఆంగ్లం ఇంతకాలంగా బలంగా వేళ్లూనుకోగలిగిందనేది వాస్తవం.

ఇప్పుడు మూడు దశాబ్దాలుగా సాగుతున్న ప్రపంచీకరణ ఫలితంగా– ఇప్పుడు పాలన, విద్య, వ్యాపార, ప్రజాజీవన రంగాల్లో ఆంగ్లభాష, సంస్కృతి చొచ్చుకుపోతున్నది. మేధోపరంగా దివాళాతీసిన మన రాజకీయ నేతలు, పార్టీలు– అంటే మన పాలక వర్గాలు ఈ పరిణామాలను ఎదుర్కోగల శక్తిని, చూపును కోల్పోయి వాటికి లొంగిపోయారు. తరతమ భేదాలు తప్ప, మన రాజకీయ పార్టీలన్నిటి పరిస్థితి ఇలాగే ఉంది.

ఇప్పుడు కేంద్రంలో బలంగా కుదురుకొన్న భారతీయ జనతా పార్టీ జాతీయవాద పార్టీగా స్వాభిమానం, స్వదేశీ

ఆశయాలకు కట్టుబడిన పార్టీగా ప్రకటించుకొన్నప్పటికీ తమ ఆశయాదర్శాల సాధనకు కావలసిన సైద్ధాంతిక బలాన్ని, నైతికశక్తినీ వారు కోల్పోయి, గాలివాలున కొట్టుకుపోతున్నారు. ఈ సంగతి ఆ నేతలలో చాలా మందికి తెలుసు. అయినా ముఖాలకు గాంభీర్యాన్ని తొడుక్కొని వారు మాట్లాడుతుంటారు.

ఇప్పుడు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విద్యావిధానం పైకి ఎన్ని ఆశయాదర్శాలను వల్లెవేసినా ఆచరణలో ఇప్పుడు చొచ్చుకువస్తున్న గుత్తాధిపత్య, వలసవాద, దోపిడీ శక్తుల పాత్రను మరింత శక్తిమంతం చేసి, వారికి మొత్తం విద్యావ్యవస్థను అప్పజెప్పే దిశగా సాగుతున్నదన్న విమర్శకు సమాధానం చెప్పలేని విధంగా ఉంది.

విద్యారంగంలో 'భాషాబోధన' అన్నది కీలకాంశం. ప్రపంచంలోని మాతృభాషలను కాపాడుకోవాలని ఇరవై యేళ్లుగా యునెస్కో(ఐరాస) చేస్తున్న బహుముఖ ప్రచారం ఇప్పుడు ప్రపంచంలో అక్కడక్కడా కొంత కదలికను కలిగిస్తున్నది. ఆలోచనను రేకెత్తిస్తున్నది. మొన్న బంగ్లాదేశ్ ఆవిర్భావానికి ప్రజలభాష కీలకమైనట్లే, ఇప్పుడు ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో కూడా భాష పాత్రను విస్మరించకూడదు. తమిళనాడు రాష్ట్రంలో రాజకీయాలను భాషావాదం నడుపుతున్నది. కేంద్రపాలకులను తమకు భయపడేట్లు చేసుకోగల వారి శక్తికి కారణం, భాషావాదమే. ఈ అంశం మన దేశంలోనూ, ప్రపంచంలో పలుదేశాల్లోనూ మున్ముందు భాషారాజకీయ తీవ్రవాదం పెచ్చరిల్లడానికి వలసవాద ఆధిపత్యపోకడుల కారణం కానున్నాయి.

భారతదేశ సమైక్యతను కాపాడుకోవడం నేటి ప్రముఖ అంశం. కొందరికీమాట ఆశ్చర్యం కలిగించవచ్చు. కాని, సైద్ధాంతిక, అవకాశవాద రాజకీయ దుందుడుకుతనం పాలక, ప్రతిపక్షాలు రెండింటి మధ్య దూరాన్ని పెంచుతున్నది. వారు విజ్ఞతతో ప్రవర్తించి దేశాన్ని ప్రమాదంలోకి తోసివెయ్యరని ఆశిద్దాం. కాని– మొత్తం అన్ని రాజకీయపార్టీలూ మరువకూడనిది ఏమిటంటే– భారత ప్రజలు పూర్తి సాధికారతను ఆశిస్తున్నారు. అయితే, తామెక్కడ మోసపోతున్నారో వారికి సరైన అవగాహన కలగడంలేదు. దానికి కారణము మన రాజకీయ పార్టీలు ఎన్నికలను అపహాస్యం చేస్తూ ప్రజలను మోసగిస్తున్న తీరు. ఇది కాలం గడిచేకొద్దీ మరింత ముదురుతున్నది. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా అన్ని వ్యవస్థలను కలుషితం చేశారు. చివరికి భాషలను కూడా తమ అవసరానికి తగ్గట్లు వినియోగించుకొంటున్నారు. ప్రజలు తమ భాషలో తాము సాధికారితను సాధించకుండా, ప్రశ్నించే శక్తిని పోగొడుతున్నారు. ప్రజల అమాయకత్వాన్ని, అవసరాన్నీ ఇందుకు వారు వినియోగించుకొంటూ వారి గొంతులను నొక్కివేస్తున్నారు.

కొత్త విద్యావిధానంలో భారత పాలకులు ఎన్నెన్నో నీతులు వల్లించారు. ఆశయాలను ప్రకటించారు. అవకాశాల కలలను కళ్లకు కట్టినట్లు చెప్పారు. ఇందుకు కీలకమైన మాతృభాషలకు తామే రక్షకులమన్న భ్రమను కల్పిస్తున్నారు. కానీ కీలకమైన చోట్ల మాతృభాషలను పక్కకు నెట్టి, గుత్తాధిపత్య వర్గాల చేతుల్లోకి, ఆంగ్ల వలసవాద ప్రభావంలోకి మరింతగా మనలను నెట్టేందుకే అంతిమంగా అది దారి తీస్తున్నది.

మనిషి పుట్టుకకూ, బతుకుకూ ప్రాణం పోసేది అతని భాషే. అతని ఎదుగుదలకు కీలకమూ అదే. దాన్ని పక్కన పెట్టి పరాయి నాలుకతో బతకమనడం పెద్ద వంచన. విదేశీ వలసవాదాన్ని మోసుకొచ్చిన ఆంగ్లంతో పాటు స్వదేశీ వలస వాద ఆధిపత్యాన్ని మోసుకొస్తున్న పాలకులు పోకడలను మనం ధిక్కరించాలి. ఈ పోకడలు మనకు కంటికి కనిపించవు. దీనికి కారణం వారి మాటల గారడీ భారతదేశాన్ని ఒకే భాషాజాతిగా రూపొందించాలనే వారి కలలు ఎన్నటికీ సాకారం కావు. 'భారతీయభాషల సంస్కృతీకరణ' అనే సిద్ధాంతానికి కాలం చెల్లింది. ఎప్పుడో దానికి నిలుపుదల జరిగింది. వేల ఏళ్ల చరిత్ర కలిగిన ప్రజల నుడులను, నాడులను గౌరవించడమే 'భారత ప్రజలను' సమైక్యపరచుకోవడానికీ, శక్తిమంతం చేసుకోవడానికీ ఏకైకమార్గం.

మన కేంద్రపాలకులు మూడు చర్యలను వెంటనే చేపట్టాలని కోరుతున్నాం. ఇందువల్ల వారిపై ప్రజల్లో ఏర్పడుతున్న అనుమానాలు తొలిగి, వారిపై నమ్మకం కలుగుతుంది. దక్షిణ భారతదేశంలో కూడా వారు బలపడడానికి దారి ఏర్పడుతుంది.

ఆ మూడూ ఇవి :

1. ఎనిమిదవ షెడ్యూల్‌లోని 22 భాషలనూ జాతీయ భాషలుగా గుర్తించాలి.
2. కేంద్ర చట్టసభలలో సభ్యులంతా తమ తమ మాతృభాషలలో మాట్లాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.
3. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలన్నిటిలో ప్రాథమిక విద్యను మాతృభాషలో నేర్పడాన్ని తప్పనిసరి చెయ్యాలి.

ఈ డిమాండ్లను నెరవేర్చడానికి అవసరమైతే తగిన విధంగా భారత రాజ్యాంగాన్ని సవరించాలి.

తేదీ : 22-03-2022

సామల రమేష్‌బాబు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం(21-02-2022) సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల (గుంటూరు) తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన సభలో ఉపాధ్యాయినిలను, విద్యార్థినులను ఉద్దేశించి

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగం



మన అమ్మనుడిలో మన చదువులు ఉండాలి.
మన ఆర్థిక వ్యవస్థ మన చేతుల్లో వెలగాలి.

వేదిక మీద ఉన్న పెద్దలకూ సభలో ఉన్న ఉపాధ్యాయ మిత్రులకూ విద్యార్థినులకూ ఎల్ల నాడుల అమ్మనుడుల పండుగ సందర్భంగా నా శుభాకాంక్షలు.

సమయం చాలా విలువైనది. సమయం పోతే తిరిగిరాదు. ఒక గంట సమయం గడిచిందంటే ఒక గంట పాటు వయసు పైబడినట్లే. అందుకనే సమయాన్ని వృథా చేసుకోకూడదు. మీకు తెలియనిదీ, నా అనుభవంలోకి వచ్చినదీ ఏమంటే, ఈ ప్రపంచాన్ని ఏలగలిగే సామర్థ్యం మీ విద్యార్థులలో కనబడుతోంది. మీ యువజనం ఏదైనా చేయగలరు. మీకు అడ్డంకులు ఉండవు. మీకు ఎలాంటి ప్రాంతీయ, కుల, మత, వర్గ భేదాలు ఉండవు. విద్యార్థులు మాత్రమే చేయగలరు ఏదైనా. గురువులు మార్గదర్శకులుగా ఉంటారు. మార్గదర్శకులు అంటే అనుభవం ఉన్న 'వెలుగు దివిటీలు'. మిమ్మల్ని ముందుకు నడిపించడం కోసం, వారు జీవితంలో గడించిన అనుభవంతో మీ మార్గాన్ని సుగమం చేసి మీ కోసం మీకు ముందుండి నడిచే ప్రయత్నంలో భాగమే ఈ రోజు మనం ఇక్కడ సమావేశం కావడానికి మొదటి ప్రయోజనం. అదే, మన సమాజంలో మన మాతృభాషపట్ల మనం ఎలా నడచుకోవాలనే విషయం గురించి ఈరోజు తెలుసుకుందాం.

మీ అందరికీ తెలుసు ప్రతి మనిషీ మాట్లాడతాడు. కొంతమంది అవయవాలు సరిగా లేక మాట్లాడలేరు.అందరూ ఏదో ఒక భాష మాట్లాడతారు. అంటే పుట్టిన ప్రతి మనిషీ మాట్లాడగలగడం సహజం. ఇది ఎట్లా అంటే పుట్టిన ప్రతి మనిషికీ అవయవాలు అన్నీ ఉన్నాయి కదా కళ్ళూ, కాళ్లూ, చెవులూ, చేతులూ, ముక్కూ,నోరూ, మొదలైనవాటితో పాటు భాష కూడా ఉంటుంది. భాష మనిషికి హృదయంలాంటిది, అంటే భాష లేని మనిషి ఉండదు. కళ్ళు లేని మనిషి ఉండడు, కాళ్లు లేని మనిషి ఉండడు, ఏదైనా ప్రమాదం జరిగితే మాత్రమే అవయవాలు ఉండవు. అలాగే భాష కూడా మనతో పాటే పుట్టినది. అట్లా అని ఎందుకన్నానంటే, భాషను ఎవరైనా కనిపెట్టారా? లేదుగదా! పలానావాడు ఈ భాష కనిపెట్టాడు అని ఎవరైనా చెప్పారా? లేదుగదా! ఇంగ్లీషునో లేదా హిందీనో ఈయన కనిపెట్టాడు అని మనకు ఎవరైనా చెప్పారా? లేదుగదా! అంటే భాషలను ఎవరూ కనిపెట్టలేదు. మనకు ఉన్న అవయవాలవలెనే మనతోనే పుట్టింది.

ఏనాడో రెండు లక్షల సంవత్సరాల క్రితం ఉన్నటువంటి వానరాల నుంచి ఒక ప్రజాతి మానవజాతిగా ఉద్భవించింది. అలా ఆ వానరజాతి నరునిగా పరిణమించే దశలో భాష పుట్టింది. మానవ భాషా వికాసానికి ఒక కారణం ఉంది. అది ఏమిటి అంటే నరజాతిలో జరిగిన ఒక ఉత్పరివర్తనం(మ్యుటేషన్). ఇవాళా రేపు అందరికీ తెలుసు మ్యుటేషన్ అంటే ఏమిటో! నరవానరం ఆధునిక మానవుడిగా వికాసం చెందకముందు అంటే ఇంకా భాష వికాసం పొందకముందు ఆ నరవానరం శరీరంలోని జీవకణాల్లో ఒక జన్యువు, ఎఫ్.పీ.2 (FP 2, ఫోర్క్‌హెడ్ బాక్స్ P2 ప్రోటీన్ భాషా వికాసానికి మూలమైనది). జన్యువు అనేది ఒకటి ఉండేది. ఉన్నట్టుండి అది ఒక మార్పుకు (ఉత్పరివర్తనానికి)లోనైంది. అలా అప్పుడప్పుడు జీవులలో ఉత్పరివర్తనాలు (మ్యుటేషన్లు) జరగటం సాధారణమే. అలా ఎఫ్.పీ.2 జన్యువులో ఆనాడు అంటే సుమారు లక్షఏళ్లక్రితం ఉన్న ఒక జన్యువులో ఉత్పరివర్తనం (మ్యుటేషన్)జరగటం వలన మనకు "భాష" సంక్రమించింది. అంటే దానికిముందు భాష లేదా అంటే ఉంది. అది మానవ భాషలాంటి లక్షణాలు కలిగివున్నది కాదు. మొదట, ఆఫ్రికా ఖండంలో ఆనాడు అలా ఏర్పడిన ఒక చిన్న ఈ భాషా సమూహమే జనాభా పెరుగుదలతో అక్కడినుండి వలసలు పోయి ఆ తర్వాత ఆహారం, రక్షణ సదుపాయాల అవసరాల కొద్దీ ఖండ ఖండాంతరాలకు వ్యాపించింది. కాబట్టి నేటి ఆధునిక మానవులందరికీ ఆనాటి మూలభాషే మన ఉమ్మడి భాష. నేటి మానవ భాషలలో ఉన్న ఉమ్మడి నిర్మాణ లక్షణాలను బట్టి మనందరి మూలభాషా ఒక్కటే అనీ ఈ భాషలన్నీ ఒకే మూలభాష నుండి వచ్చి ఉండాలి అనీ కొందరు మానవశాస్త్రవేత్తలు, భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. ఆ మూలభాషను పునర్నిర్మించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. జరిగిపోయిన లక్ష సంవత్సరాలలో ఈ భాష అనేక

అమ్మనుడి మనం పుట్టకముందే మనలో భాగమవుతుంది. ఇప్పటికే నేర్చిన అమ్మనుడిలో తరగతి గదిలో పాఠాలు నేర్వడం తేలికవుతుంది. అంటే బడిభాషగా ఉండడం అమ్మనుడికే చెల్లుతుంది. అదే సహజం. అది మన ప్రజాస్వామ్యానికీ స్వేచ్ఛకూ సంకేతం.

రకాలుగా అంటే జనాభా పెరగడం వలన ఇతర ప్రాంతాలకు వలసలు పోవటంతో ఈ ప్రపంచం అంతటా వ్యాప్తి చెందినట్లు తెలుస్తోంది. ఆ వలసలు పెరిగిపోవడం వలన మానవ సమూహాల మధ్య భాషా వినిమయం తగ్గిపోవడం వలన ఒకరి భాష మరొకరికి అర్థం కాకుండా పోయింది. ఈ వినిమయం ఎప్పుడైతే తగ్గిపోయిందో వేర్వేరు ప్రాంతాలలోని భాషలు వేర్వేరు భాషలుగా విభజించబడి సుమారు7000 వరకూ తయారయ్యాయి. మనదేశంలో గుర్తింపు పొందిన భాషలు 121. ఈ 121లో 22 భాషల్ని మన రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో గుర్తించారు. మన రాజ్యాంగంలో ఒక అధ్యాయాన్ని షెడ్యూలు అంటారు. ఇలా గుర్తింపు పొందిన భాషలు 22. మన దేశ జనాభాలో సుమారు 97% మంది ఈ 22 భాషలను మాట్లాడేవారే. వీటిల్లో తెలుగు ఒకటి. ఈ తెలుగు భాషను ఒకప్పుడు భారతదేశంలో సుమారు 10-12% పైగా మాట్లాడేవారు. అయితే రానురాను తెలుగు మాట్లాడేవారి శాతం తగ్గుతూ ప్రస్తుతానికి 7 శాతానికి దిగజారింది. దీనికి అనేక కారణాలున్నాయి. వాటిల్లో కొన్ని రాజకీయకారణాలు. వీటివల్ల మనం ఇంగ్లీషును పట్టుకొని వేలాడుతున్నాం. ఒకప్పుడు ఈ దేశం బ్రిటీషువారి వలస దేశం కావడం ఒక ముఖ్యకారణం. మన ఒక్క దేశమేనా ఇలా ఇంగ్లీషును పట్టుకొని వేలాడేది? అంటే, ఇంకా కొన్ని దేశాలు ఉన్నాయి. మన భారత ఉపఖండంలో ఉన్న బ్రిటీషు వలస దేశాలు ఉన్నాయే వాటిని నేడు సార్క్ దేశాలు (సౌత్ఏషియన్ రీజియొనల్ కంట్రీస్, SARC) అంటారు కదా! వీటిలో, భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవులు ఉన్నాయి. అయితే, మరికొన్ని ఇతర దేశాలు కూడా ఒకప్పుడు బ్రిటిష్ వారిపాలనలో ఉన్నాయి. ఇలా 54 దేశాలు ఉండేవి. బ్రిటీషువారు మన మీద దాడిచేసి ఆక్రమించుకోవటం వలన 200 సంవత్సరాలపాటు మనం మన స్వాతంత్ర్యాన్ని కోల్పోయాం. బ్రిటీషువారి పరిపాలనలో మన ఆర్థిక స్థితిగతులతోపాటు మన సంస్కృతికీ, మన భాషలకీ తీరని అన్యాయం జరిగింది. బ్రిటీషువాళ్ల నియంతృత్వం నుంచైతే బైటపడి స్వతంత్రులం అయినా, వారి భాషానియంతృత్వం నుంచి మాత్రం బయటబడలేకపోయాం. మనది ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకొంటున్నా ఇంకా ఆంగ్లభాషలోనే మన చదువులూ, పరిపాలనా, వ్యాపారాలు అన్నీ ఇలా అధికారికంగా జరుగుతున్నై. అది అవసరమా, ఇది ఎంతవరకూ సమంజసమో ఆలోచించండి మీరే. ఈ ప్రపంచంలో అత్యున్నత ఆర్థిక స్థాయిలో ఉన్న దేశాలు ఏవి? ఎవరైనా చెప్పగలరా! అమెరికా, బ్రిటన్‌తోపాటు, ఫిన్లాండ్, జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, దక్షిణకొరియా, జపాను, చైనా మొదలైనవి అన్నీ ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవే .

స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ, GDP) ఉన్నత స్థాయిలో ఉన్న ఈ దేశాలన్నీ వాళ్ల మాతృభాషలోనే పాలన, చదువులూ వ్యాపారాలూ ఇతరేతర వ్యవహారాలూ జరుపుకొంటున్నారు. వీటిలో చాలా దేశాలు మన తెలుగు రాష్ట్రాల జనాభా కన్నా చాలా చిన్నవే. తెలుగు రాష్ట్రాల విస్తీర్ణంకన్నా చిన్నవి. ఇప్పటికీ కూడా మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న జనాభా చాలా దేశాల్లో ఉన్న జనాభా కంటే ఎక్కువ. 12 దేశాలు మాత్రమే మన తెలుగు రాష్ట్రాల కంటే పెద్దవి. అంత పెద్ద జనాభా గల రాష్ట్రాలు గల దేశం మనది. మనం ఆ దేశాల్ని చూసి నేర్చుకోవాలి. ఆ దేశాలు తమ ప్రజలకు వాళ్ళ మాతృభాషలో చదువుకొనే వీలు కలిగించటంవలన అవి ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో ఉన్నయ్. మరి వారిలా అభివృద్ధి సాధించడం మనకు ఎందుకు చేతకావడం లేదు?

ప్రపంచ మేధో సంపత్తి సూచికల(World Intellectual Property Indices) నివేదిక ఆధారంగా, ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు చేసి కొత్తవి ఏవైనా కనిపెట్టినప్పుడు వాటిని సొంతం చేసుకొనేందుకు ఆవిష్కర్తలు పేటెంటు హక్కులు పొందుతారు. ఇలా ఆవిష్కరణలు చేసిన వారిలో ఎక్కువ పేటెంటు హక్కులు రిజిస్టర్ చేసుకున్నవారిలో అందరికంటే ముందున్నది దక్షిణ కొరియా. అమెరికా వాళ్ళ కంటే కూడా దక్షిణ కొరియా, జపాన్ వాళ్ళు ఎక్కువ పేటెంట్లను నమోదు చేసుకొంటున్నారు. అంటే ఎక్కువ ఆవిష్కరణలు చేస్తున్నారు. వాళ్ళు వాళ్ల దేశాలలోనే కనుగొనవచ్చు. కానీ దానికి కావలసిన పేటెంట్‌ను అమెరికాలోనూ మరి కొన్ని ఇతర దేశాలలోనూ తీసుకుంటున్నారు. ఆ తర్వాత అమెరికా, చైనా, ఫ్రాన్సు, జర్మనీ, అలా మరికొన్ని దేశాలు ఉన్నాయి. దక్షిణ కొరియాలో ప్రతి లక్ష మందిక 262 పేటెంట్ల చొప్పున నిర్మాణం అవుతుంటే, జపానులో ప్రతి లక్ష మందికీ 141 పేటెంట్ల చొప్పున, అమెరికాలో ప్రతి లక్ష మందికీ 106 పేటెంట్ల చొప్పున, చైనాలో ప్రతి లక్ష మందికి 37 పేటెంట్ల చొప్పున, జర్మనీలో ప్రతి లక్ష మందికీ 21 పేటెంట్ల చొప్పున, ఫ్రాన్సులోనూ రష్యాలోనూ ప్రతి లక్ష మందికీ 20 పేటెంట్ల చొప్పునా, ఇటలీలో 15 చొప్పున, యూకేలో 14 చొప్పున పేటెంట్ల నిర్మాణం అవుతుంటే- ఇండియాలో ప్రతి లక్ష మందికీ 2 పేటెంట్ల నిర్మాణం మాత్రమే సాధ్యపడుతోంది. అంటే కొత్తగా కనుక్కున్న ఆవిష్కరణల పేటెంట్ పొందితే పారిశ్రామికంగా అనేక పనిముట్లనూ ఉపకరణాలనూ తయారుచేసి ప్రపంచ మార్కెట్లోకి వదిలేసి, తెల్లవారేపాటికి కోటానుకోట్ల రూపాయలు సంపాదించి ధనవంతులు కావచ్చు. అది పరిశోధనల వలన సాధ్యం. ఈ పరిశోధనలను వారు ఏ భాషలో చేశారు? **ప్రపంచంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు చేసి అత్యధిక పేటెంట్లను సొంతం చేసుకున్న ప్రతి దేశమూ తమ తమ మాతృభాషలలోనే చదువులూ నేర్చి పాలనా వ్యవహారాలూ నడుపుతున్నై.** ఇప్పుడు చెప్పండి, మీరు ఏ భాషలో చదువుకోవాలని అనుకుంటున్నారు? పైన చెప్పిన గణాంకాలను చూస్తే ఆంగ్లేతర భాషలను వాడే దక్షిణ కొరియా, జపాను, ఇంగ్లీషును వాడే అమెరికా కంటే చాలా ముందున్నాయి. ఇంగ్లీషుకు పుట్టినిల్లైన ఇంగ్లండు కంటే చైనా, జర్మనీ, ఫ్రాన్సు, రష్యా, ఇటలీలు ఎక్కువ పేటెంట్లతో

ముందున్నాయి.

కానీ మన దగ్గర, ఇవాళ వాతావరణం ఎలా ఉందంటే, ఇంగ్లీషులో చదువుకుంటేనే, ఇంగ్లీష్ లోనే పరిశోధన చేస్తేనే మీకు ఇంగ్లీష్లో ఉద్యోగాలు వస్తాయి. మీరు ఇంగ్లీషులో పరిశోధనలను చేసి ఎక్కువ పేటెంట్లను పొందవచ్చు, ఇంగ్లీష్ ద్వారానే సంపద సృష్టించవచ్చు అనే ఒక రకమైన మానసిక భ్రమని కలిగిస్తున్నారు. ఆ భ్రమ నుండి మనం బయటపడాలి. ఇప్పుడు భారతదేశంలో సుమారు ఆరున్నర శాతం మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారు. అంటే మన జనాభాలో చదువుకున్నవారిలో 6.50% గ్రాడ్యుయేట్లు ఉన్నారు. అదేం తక్కువ కాదు. మన జనాభా, 2011 జనాభా లెక్కల ప్రకారం 131 కోట్లు. ఇవాళ ఇది 140 దాకా చేరుకున్నదనుకోవచ్చు. 131 కోట్ల జనాభా ఉన్న దేశంలో 74% అక్షరాస్యుల్లో ఆరున్నర శాతం అంటే సుమారు తొమ్మిది కోట్ల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నట్లే. వీళ్ళల్లో విజ్ఞానశాస్త్రాలు చదువుకున్నవాళ్ళు 65శాతం. తొమ్మిది కోట్లలో 65 శాతం మంది అంటే సుమారు ఆరు కోట్లమంది సైన్స్ గ్రాడ్యుయేట్లన్నమాట. వాళ్ళల్లోనే ఎమ్మెస్సీలు, పీహెచ్.డీలు ఉన్నవారు ఉన్నారు. మొత్తం కొన్ని దేశాల జనాభా కూడా ఇంత ఉండదు. దక్షిణ కొరియా జనాభా ఎంత? ఐదు కోట్లే, వాళ్లలో సైన్స్ చదివే గ్రాడ్యుయేట్స్ మొత్తం 50 లక్షలలోపే ఉన్నారు. కానీ అలాంటి దేశాలు అంటే ఆంగ్లేతర మాతృభాషల్లో చదువుకొనే జనాభా ఉన్న జపాన్, దక్షిణ కొరియా, చైనా, మరికొన్ని ఐరోపా దేశాలు మన కంటే ముందు ఎందుకు ఉన్నాయి? మన కంటే వాళ్ళ జి.డి.పి ఎందుకు విపరీతంగా పెరుగుతోంది. జిడీపీ అంటే స్థూల జాతీయోత్పత్తి (Gross Domestic Product). అది ఎవరు సంపాదిస్తున్నారు? మీలాంటి విద్యార్థులే ఐదు లేదా పది సంవత్సరాల తర్వాత మీకు ఉద్యోగాలు వచ్చి, సంపాదనపరులై, మీరే కొత్త సంస్థలు తెరిచి మళ్ళీ కొంత మందికి ఉద్యోగాలు ఇచ్చి, మీరు వాళ్ళకి జీతాలు ఇచ్చేటప్పుడు అవన్నీ స్థూల జాతీయ సంపద లెక్కల్లోకి చేరతాయి. అంటే ఏ పని చేసి అయినా సరే మనం ధనం సంపాదిస్తుంటే అది జిడిపి లెక్కలోకి వస్తుంది. నేను విద్యార్థులకు పాఠాలు చెప్పినందుకు నాకు కొంత జీతం వస్తుంది. అది జిడిపి లెక్కలో భాగం అవుతుంది. అట్లా మనదేశంలో పని చేసే ప్రతివారి సంపాదనా ఇందులోకి చేరుతుంది. పనిచేసేవాళ్ళు అంటే ఎవరు? ఒక వ్యవసాయదారుడు పంటలు పండించే పనిచేస్తాడు, పశుపాలకులూ, గని కార్మికులూ, రకరకాల అవసరాలకోసం పనిముట్లూ వస్తువులనూ తయారుచేసేవాళ్లూ, వాటిని బాగుచేసేవారూ, ఇళ్లూ, బళ్లూ, కార్యాలయాలూ, కడిగి శుభ్రం చేసేవాళ్లూ పనిచేస్తారు, ఇక్కడ కూర్చున్న టీచర్లూ, పాలనా వ్యవహారాలు చూసేవారూ కార్యాలయాలలో పనిచేసేవారూ, ప్రజలూ వ్యవస్థలూ పనిచేసేందుకు కావలసిన డబ్బుమదుపు పెట్టేవారూ వాళ్ల వ్యవస్థలూ, ప్రజల శాంతి భద్రతలకోసం కావలికాసేవారూ, దేశ రక్షణకోసం పోరాడేవారూ అంటే ప్రతివారూ, అందరూ పనిచేసేవాళ్లే. మన పనివాళ్లు అందరూ పని చేసి సృష్టించిన జి.డి.పి సంపదతో దేశాన్ని స్వయం సమృద్ధి చేస్తున్నాం. మన దేశానికి 64 లక్షల కోట్ల రూపాయల (2011-12 భారత ఆర్థిక గణాంకాల ప్రకారం) సంపదను సృష్టిస్తున్నాము. ఇది భారత దేశ ఆర్థిక వ్యవస్థ ఇచ్చిన లెక్కలు. వీళ్లందరూ ఇన్ని లక్షల కోట్ల రూపాయలను ఏ భాషలో పనిచేసి ఇంత సంపద సృష్టిస్తున్నారు? ఏ భాష ఎంతెంత మన స్థూల జాతీయోత్పత్తికి తోడ్పడుతోందో ఆ లెక్కలు తేలాలి. ఇక లెక్కలు వేసుకుంటే, ఏ భాషలో ఎవరు ఏ పనిచేసి సంపాదిస్తారు? తెలుగు భాషలో ఎంత? ఇంగ్లీషులో ఎంత? ఎలా తెలుస్తుంది మనకు? వీటికి సమాధానం చెప్పటం కష్టం ఏమీ కాదు. అయితే ఎలా? ఎలా సంపాదించారు అంటే మనందరం మాతృభాషలోనో మరో భాషలోనో పని నేర్చుకుంటాం. ఆపైన మన మాతృభాషనో మరో భాషనో వాడుతూ పని చేస్తాం. సంపద సృష్టిస్తాం. కానీ మనలో చాలామంది మన తల్లిదండ్రులే గానీ బయటవాళ్ళు గానీ అనుకునేది ఏంటి అంటే అందరూ ఇంగ్లీషు ద్వారానే పనిచేసి సంపద సృష్టి చేస్తారని, కదా? చాలామంది అనుకుంటారు. 64 లక్షల కోట్ల రూపాయల సంపద ఎలా వచ్చింది? ఈ సంపదను ఎవరు సృష్టించారు అంటే అందరూ ఇంగ్లీషులో పనిచేస్తే వచ్చింది అనుకుంటారు. కానీ అది కానేకాదు.

మనం ఇంతకు ముందే అనుకున్నాం. పనిచేసేవాడు సంపద సృష్టిస్తాడు. రిక్షావాడు రిక్షా తొక్కి సంపాదిస్తున్నాడు. వ్యవసాయదారుడు వ్యవసాయం చేసి సంపద సృష్టిస్తున్నాడు. పొలంలో పొద్దున్నుంచి రాత్రి దాకా పనిచేసి, నెలలు కష్టపడి, అనేక రకాల పంటలు పండించి సంపాదిస్తున్నాడు. భారతదేశంలో కొన్ని గణాంకాల ప్రకారం 20 నుంచి 18 శాతం జిడిపి వ్యవసాయం వలననే వస్తోంది అంటే మన జిడిపిలో 20 శాతం వ్యవసాయం ద్వారానే వస్తుంది. ఇది అన్నింటి కంటే ఎక్కువ వచ్చే సంపాదనే కానీ దీని మీద ఆధారపడి బ్రతికే వాళ్ళు ఎంతమంది? మన జనాభాలో 54 శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న జనమే ఎక్కువ అంటే 20 శాతం సంపద (జిడిపి) మీద 54 శాతం ప్రజలు బ్రతుకుతున్నారు. ఇక మిగిలిన సంపాదన అంతా ఎక్కడ నుండి వస్తుంది అంటే అనేక రకాలు. మన రాష్ట్రాల పాలనారంగంలో వివిధ స్థాయిల్లో, కార్యనిర్వాహక శాఖల్లో ఉద్యోగాలు చేసేవాళ్ళు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయాలలో ఆచార్యులూ ఇంకా రకరకాల ఉద్యోగాలు చేసే వాళ్ళందరూ దేశ రక్షణ రంగాలలో పనిచేస్తున్న సైనికులూ రాష్ట్రాల పరిధిలో జనం బాగోగులు చూస్తూ కాపలా కాస్తున్న పోలీసు దళాలూ మన ఆర్థిక విషయాలు చూసే బ్యాంకుల్లో పనిచేస్తున్నవాళ్లూ, ఇతరత్రా వ్యాపారాల్లో డబ్బుల లెక్కలు రాసి, డబ్బుల గురించీ అవి చేసే పని గురించీ అంటే ఆర్థిక కార్యకలాపాల పనులు చేసేవారు అంటే అప్పులు ఇచ్చే వాళ్ళు వ్యాపారం కోసం డబ్బులు వడ్డీకి తీసుకునేవారూ ఇచ్చేవారూ ఇదంతా

సంపదసృష్టిలోని భాగమే. ఇవే కాకుండా గనుల్లో పని చేసేవారు, అడవులూ, చేపల పెంపకం, పాడి పరిశ్రమ వీటన్నింటా పనిచేసి సంపాదించేవాళ్లూ, అంటే మొత్తం ఈ వస్తుసామగ్రి, శ్రమలూ, మన చుట్టూ ఉండే వస్తువులను తయారు చేసేవాళ్లూ, ఇట్లా పని చేసేవాళ్ళలో రకరకాలవాళ్ళు ఉంటారు. ఇంజనీర్లు మాత్రమే కాదు. వారు డిజైన్ చేసినవాటిని కట్టేవాళ్లూ గుత్తేదార్లూ మాత్రమే కాదు అందులో పనిచేసేవాళ్లూ, ఎంతోమంది వాటిని అన్నింటినీ ఒకచోటకు చేర్చి బిగించి ఒక వాడదగిన వస్తువుగా మార్చడానికి కొన్ని వందల మంది దానిమీద పని చేస్తారు. అందరికీ తమకు బాగా తెలిసిన భాషలో పనిచేసి పనికితగ్గ సంపదను సృష్టిస్తున్నారు.

ఇవన్నీ కలిసి మొత్తం 64 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో అధిక శాతం ఎవరు ఏ భాషలో పని చేసి సంపాదించారు అంటే, ఈ సంపద సృష్టిలో పాల్గొన్న శ్రమజీవులలో 87 శాతం మంది మాతృభాషలో పనిచేసి ఇంత సంపద సృష్టిస్తున్నారు అని తెలుస్తోంది. ఎలా చెప్పగలిగాను నేను ఇది? ఎలా చెప్పగలిగాను అంటే దానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. మీకందరికీ తెలుసు! మన జనాభాలో చదువుకున్న వారు ఎంతమంది? ఆంధ్రప్రదేశ్లో అక్షరాస్యులు 65 శాతం కాగా తెలంగాణలో 64 శాతం. మనందరం సిగ్గుపడాల్సిన విషయం, 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా మన దేశ సగటు అక్షరాస్యతా శాతం 74 మాత్రమే. తెలుగు రాష్ట్రాలు దేశ సగటుకి 10 శాతం దిగువునే ఉన్నాయి. మన రాష్ట్రాల లాంటివాటిని 'బీమారు' రాష్ట్రాలు అంటారు. అంటే అనారోగ్యంతో జబ్బునపడ్డ రాష్ట్రాలు అని మీకు తెలుసు కదా? బీహారు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్. అయితే ప్రస్తుతం ఇవి కూడా మన రాష్ట్రాల కన్నా ఇంకా కొంచెం ఎక్కువ అక్షరాస్యతా స్థాయిలో అంటే 68 నుండి 74 శాతం మధ్యన ఉన్నాయి. ఇంతకు మునుపు మాట్లాడిన డా. రమేష్‌బాబు చెప్పారు. ఇక్కడ ఐటి ఉద్యోగాలు అన్నీ మన దగ్గరే, కంప్యూటర్ల కోర్సులలో మనవాళ్లే ఎక్కువ చదువుకుంటున్నారు, అమెరికాకు మనవాళ్లే ఎక్కువ వెళ్తున్నారు. మరి ఏం అవుతోంది మనకి? మనకి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చదువుకున్నవాళ్ళ సంఖ్య 65%. ఇంతకంటే పచ్చి నిజం ఏమిటంటే భారతదేశ గణాంకాల ప్రకారం మన దేశంలో 74 శాతం మంది చదువుకున్న వాళ్లు ఉంటే, వాళ్లలో 52 శాతం ప్రాథమికవిద్య దాటనే లేదు. అంటే ఎక్కువమంది నాలుగేండ్ల చదువు తర్వాత బడి మానేసి ఇంటికి పోయి కూర్చున్నవాళ్లే ఎక్కువ శాతం. ఈ లెక్కలు ఏం చెబుతున్నాయి? నాలుగు సంవత్సరాలు బడికి వెళితే చాలు అక్షరాస్యులుగా గుర్తించవచ్చని మన భారతదేశ గణాంకాలు చెబుతున్నాయి. కానీ యునెస్కో అలా చెప్పదు. యునెస్కో అంటుంది మీరు ఏడు సంవత్సరాలపాటు తరగతి గదిలో కూర్చున్నట్లు అయితేనే మిమ్మల్ని అక్షరాస్యులుగా గుర్తిస్తాము అని అంటుంది. ఏడు సంవత్సరాలు చదువుకున్నవారి చదువు మాత్రమే విద్యావంతులుగా సమాజంలో చెలామణి కాగలరు. ఏది ఎలా ఉన్నా, నేను చదువుకోవాలి, చదువుకొని పాస్ అవ్వాలి అనుకుంటే సంతకం పెడతానికో, పేపర్లలో శీర్షికలు చదువుకోవడం కోసమో గోడల మీద సినిమా పోస్టర్లు చదువుకోడానికో కాదు గదా. చదివిన చదువు మన సంపాదనకు తోడుపడాలి. ఆరోగ్యవంతమైన జీవితానికి బాసట కావాలి. ఏదైనా ఒక భాషలో సరిగా చదవడానికీ చదివి అర్థం చేసుకోడానికీ సుమారు ఏడు సంవత్సరాలు తరగతి గదిలో ఉండాలి. తరగతి గదిలో ఏడు సంవత్సరాలు లేనివాళ్ళు చదువురాని వాళ్ళ కిందే లెక్క. మరి మన దేశంలో బడి మానేసినవారి లెక్కతో 52% అక్షరాస్యతను కోల్పోయాం. ఇప్పుడు భారతదేశ అక్షరాస్యత 74% నుంచి 52 శాతం తీసేస్తే 22 శాతం మంది మాత్రమే చదువుకున్నవాళ్ళు. అంటే వార్తా పత్రికలు గానీ రైలు బోగీలలో గానీ, సినిమా ప్రకటనలు గానీ చదివి చూసి అర్థంచేసుకోగలిగినవాళ్లు వీళ్లు. ఎవరికి వారు విశ్లేషించుకుని చెప్పగలిగినవాళ్ళు భారతదేశంలో సగటున 22 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఈ 22 శాతంమందిలో 16 శాతం మంది ఇంటరు వరకే చదివినవారు. మిగిలిన 6శాతం మాత్రమే గ్రాడ్యుయేషన్ దాటినవాళ్లు. వీళ్లు మాత్రమే ఇంగ్లీషు వాడగలిగినవాళ్లు. మరి ఇప్పుడు తెలుగు రాష్ట్రాల నుండి 12 (65-52) శాతం మంది మాత్రమే, అంటే, అసలు తరగతి గదుల్లో ఏడు సంవత్సరాలు కూర్చుని చదువు నేర్చుకున్నవారు. వీరే ప్రకటనలు చదవగలిగినవారు, బస్సుల మీద పేర్లు చదవగలిగినవారు, పోస్టర్లు చదవగలిగినవారు, లేదా ఎలక్షన్‌లో నిలబడ్డవారి చరిత్రను చదివి, వీళ్ళకు ఓటు వేస్తే, మా జీవితాలు సరిదిద్దుతారు, మా బాగోగులు చూసుకుంటారు, మమ్మల్ని ఉద్ధరిస్తారు అని అనుకొని విశ్లేషణ చేయగలిగినవాళ్లు ఈ 12 శాతం మంది మాత్రమే. ఇదీ మన ప్రజాస్వామ్యం. 75 ఏండ్లపాటు రాజకీయం నెరపిన నాయకులు పాలించిన దేశం. ఇకనైనా మారుదాం. మన అమ్మనుడిలో మన చదువులు ఉండాలి. మన ఆర్థిక వ్యవస్థ మన చేతుల్లో వెలగాలి. అమ్మనుడి మనకు పుట్టుకతోనే వస్తుంది అంటారు. కానీ మనకందరికీ తెలియని రహస్యం ఏమంటే అమ్మనుడి మనం పుట్టకముందే అమ్మకడుపులో ఉన్నప్పుడే అమ్మగానీ అమ్మ చుట్టూతా చేరి మాట్లాడే నాన్న, అన్నదమ్ములూ అక్కచెల్లెళ్లూ తాతలు అమ్మమ్మలూ నాయనమ్మలూ ఇతర కుటుంబ సభ్యులూ చుట్టపక్కాలవారి మాటల తాలూకు ప్రకంపనలు బిడ్డకు చేరతాయి. బిడ్డ ఆ ప్రకంపనలకు అనుగుణంగా స్పందించటంకూడా మొదలుపెడుతుంది. మనం అమ్మనుడిలో వాడే శబ్దాలనూ, వివిధ శబ్దాల వాడుకనూ వాడే రీతినీ ఆ రీతిలో ఉన్న తేడాలనూ వినికిడితో అమ్మనుడి శబ్దస్వరూపాన్నీ వంటపట్టించు కొంటుంది. పుట్టిన తర్వాత మాట్లాడటం నేర్చుకుంటుంది. దానిని ఇంకా పెంచుకోవటానికి ప్రయత్నిస్తుంది. అంటే అమ్మనుడి మనం పుట్టకముందే మనలో భాగమవుతుంది అన్నమాట. ఇక ఇప్పటికే నేర్చిన అమ్మనుడిలో తరగతి గదిలో పాఠాలు నేర్పడం తేలికవుతుంది. అంటే బడిభాషగా ఉండడం అమ్మనుడికే చెల్లుతుంది. అదే సహజం. అది మన ప్రజాస్వామ్యానికీ స్వేచ్ఛకూ సంకేతం. గుర్తుంచుకోండి అమ్మనుడిలో చదువులు మన ఆర్థిక పురోగతికి ఆధారం. మీరే రేపటి మన సమ సమాజ సృష్టి కర్తలు. అమ్మనుడే సమ సమాజానికి నిజమైన నిర్వచనం.

నాకు ఇన్ని వందలమంది విద్యార్థినులముందు ఇలా అమ్మనుడిపై మాట్లాడడానికి ఈ అవకాశం కల్పించిన ఈ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. ఆర్. జ్యోత్స్నకుమారిగారికి కృతజ్ఞతలు. ఈ అవకాశాన్ని ఈ రీతిలో మలిచి ఈ సభను చక్కగా నిర్వహించిన తోటి ఉపాధ్యాయ సహచరులకు అభినందనలు.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు?-3

(గత సంచిక తరువాయి.....)

భాష ప్రమాద స్థాయి గుర్తింపు

ఆక్షేపణ

ఒక భాష అంతరించిపోవటానికి ఎన్నో కారణాలుంటాయి. ఒక్క కారణం వలన భాష అంతరించిపోదు. భాషను భద్రపచడానికి గానీ, భాష ప్రమాద స్థాయిని అంచనా వేయటానికి గానీ ఏదో ఒక్క అంశాన్ని పరిగణించలేము. భాషను మాట్లాడే సముదాయం చాలా విస్తృతమైనది. తెలుగు మాట్లాడే సముదాయాన్నే పరిగణిద్దాము - తెలుగు మాట్లాడే వారిలో వ్యాపారవేత్తలుంటారు, కూలీపని చేసుకునే బీద వర్గం ఉంటారు, పూజారులుంటారు, ఉపాధ్యాయులుంటారు, వివిధ వృత్తులతో పొట్టపోసుకునే వ్యక్తులు అనేకం. ఒక్కొక్కరూ భాషను ఒక్కో విధంగా ఇంటా-బయటా ఉపయోగిస్తారు. కొన్ని సందర్భాల్లో భాష భావప్రకటనకు అవసరమైతే, కొన్ని చోట్ల లెక్కలు వేసేందుకు అవసరం, కొన్ని సందర్భాల్లో వ్యక్తి అనుభూతిని చెప్పే పదాలను భాష ఇస్తుంది, మరి కొన్ని చోట్ల వ్యక్తి మదిలో మెదిలే ఆలోచనలకు రూపం అవుతుంది. లిపి ఉన్న భాష కాబట్టే తెలుగులో అక్షరాల రూపంలో కూడా భావ ప్రకటన సాధ్యం. ఇంత వైవిధ్యం ఉన్న భాషలోని పదసంపదను పదిలపరచాలన్నా, అన్ని రంగాల వారూ మాట్లాడే పలుకుబడులను భద్రపరచాలన్నా చాలా కష్టమైనపనే. ఇదే సమస్య ప్రతి భాషకూ వర్తిస్తుంది. అన్ని భాషలూ ఇదే రకమైన సంక్లిష్టతను, విస్తృతిని కలిగి ఉంటాయి. నేటి ప్రపంచీకరణలో ఒక భాషను భద్రపరిచే ప్రక్రియ ఇంకా ఎక్కువ సంక్లిష్టమైపోయింది. తెలుగునే ఉదాహరణగా తీసుకుందాం, తెలుగు అధికార భాషగా ఉన్న రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగు మాతృభాషగా మాట్లాడే జనాభా కన్నా రెట్టింపు జనాభా తెలుగుకు అధికారిక గుర్తింపు లేని ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారు తమను తాము తెలుగువారిగా ఇంటి పరిధిలో గుర్తించుకున్నా, బయట అధికారికంగా వారు తమను ఆ ప్రాంతీయులుగా గుర్తించుకోవటం వలననో, ఇంకేదైనా ఇతర రాజకీయ కారణం వలననో, వారిని అధికార గణాంకాల్లో తెలుగువారిగా లెక్కవేయడం లేదు. నేటికీ తెలుగువారు ఎంతమంది ఉన్నారో అన్న అంచనా వేయటం కష్టతరమవుతోంది. ఇదే పరిస్థితి చాలా భాషలకు ఉంది. ఒక భాషను మాట్లాడే జనాభా ఎంత అన్నది లెక్కించటం చాలా కష్టం.

పై కారణాల వలన యునెస్కోవారు తమ భాషల ప్రమాద స్థాయి అంచనాకు చేసిన అధ్యయనం కోసం ఆరు అంశాలను విశ్లేషించారు. భాషలపట్ల జనానికి ఉన్న అభిప్రాయాన్ని గుర్తించేందుకు రెండు అంశాలను విశ్లేషించారు. ఒక భాషలోని వివిధ అంశాలను పదిలపరచటానికి లేదా భద్రపరచటానికి ఉన్న అవసరాన్ని గుర్తించేందుకు ఒక అంశాన్ని విశ్లేషించారు. ఈ తొమ్మిది అంశాల విశ్లేషణ వలన ప్రతి భాషకూ ప్రస్తుతం ఉన్న సామాజిక-భాషాపరమైన పరిస్థితి మనకు తెలుస్తుంది. ఈ చిన్నపాటి విశ్లేషణ ఆధారంగా భాష ప్రమాద స్థాయిని గుర్తిస్తూ, ఎంత మేరకు భద్రపరచవలసిన అవకాశం ఉంది, ఎంత అవసరం ఉంది అన్న విషయాలు తెల్లమవుతాయి.

భాష ప్రమాదస్థాయి విశ్లేషణ

భాష ప్రమాద స్థాయిని గుర్తించేందుకు తొమ్మిది అంశాల విశ్లేషణ చేస్తామని అనుకున్నాం కదా. అవేమిటో చూద్దాం...

1. భాష ప్రమాద స్థాయిని చెప్పే ఆరు అంశాలు:

భాష ప్రమాద స్థాయిని గుర్తించే ఆరు అంశాలు ఇవే:

1. తరాల మధ్య భాష ప్రసరణ
2. భాషను మాట్లాడే వ్యక్తుల అసలు సంఖ్య
3. మొత్తం జనాభాతో పోల్చితే భాష మాట్లాడే వ్యక్తుల సంఖ్య
4. భాషను వాడే రంగాలలో వస్తున్న మార్పులు
5. కొత్తగా వస్తున్న మాధ్యమాలలో భాష వాడుక
6. భాషలో చదువుకు, అక్షరాస్యతకు అందుబాటులో ఉన్న పాఠ్య సామగ్రి

1. తరాల మధ్య భాష ప్రసరణ

ఫిష్మన్ 1991లో తన పరిశోధనా పత్రంలో భాష బలాన్ని గుర్తించేందుకు వాడే అతి సాధారణ అంశంగా తరాల మధ్య భాష ప్రసరణను ప్రతిపాదించారు. తరువాతి తరానికి ప్రస్తుత తరం తమ భాషను అందజేస్తున్నాయో లేదో విశ్లేషిస్తే, ఆ ప్రకారంగా భాష స్థితిని గుర్తించవచ్చు. ఎలాంటి ప్రమాదం లేని స్థిరంగా ఉన్న భాషల నుంచి కనుమరుగైపోయిన భాషల వరకూ ఈ అంశాన్ని లెక్కించి చెప్పవచ్చు. అయితే ఈ అంశం ప్రకారం ఒక భాష సురక్షితంగా ఉందనుకున్నా, ఆ భాష పూర్తిగా ప్రమాద స్థాయికి పైన ఉందని చెప్పలేము. ఎందుకంటే ఏ క్షణాన ఒక తరం వారు తమ తరువాతి తరానికి తమ మాతృభాషను నేర్పించటం ఆపేస్తారోనన్న విషయం కచ్చితంగా చెప్పలేము. ఈ తరాల మధ్య భాష ప్రసరణను ఆరు స్థాయిల్లో చెప్పుకోవాలి:

స్థాయి 1 : సురక్షితం : భాషను మాతృభాషగా ప్రస్తుతం బ్రతికి ఉన్న అన్ని తరాల వారూ మాట్లాడుతున్నారు. వేరే ఏ పరాయి భాష నుంచి ఈ భాషకు ప్రమాదం లేదు. తరువాతి తరం వారు తమ ముందు తరం నుంచి ఎలాంటి అడ్డంకులూ లేకుండా మాతృభాషను అందుకుంటున్నారు.

స్థాయి 2(దుర్బల స్థితి) : స్థిరం కానీ ప్రమాద స్థాయికి దగ్గర్లో : ఒక తరం నుంచి మరొక తరానికి భాష వెళుతున్నప్పటికీ, అన్ని తరాల వారు భాషను మాట్లాడుతున్నప్పటికీ బహుభాషత్వం వలన, పరాయి భాషలో కూడా కొన్ని సందర్భాలలో, కొన్ని అవసరాల కోసం సంభాషణలు పరాయి భాషలో నడుస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే బహుభాషలు ఆ సమాజంలో ఉండటం వలన భాషకు ప్రమాదం లేదు కానీ ఆ భాష మాట్లాడే ఇద్దరు వ్యక్తులు

తమ భాషలో సంభాషణలు చేసే అవకాశం ఉన్నా, పరాయి భాషను ఆశ్రయించడం వలన చేటు చేకూరుతుంది.

స్థాయి 3: కచ్చితంగా ప్రమాద స్థితి : జనం తమ మాతృభాషల్లో మాట్లాడటాన్ని ఇంటి వరకే పరిమితం చేసుకోవడం. బయట వేరే భాషలో మాట్లాడుకోవడం. కొన్ని కుటుంబాల్లో ప్రస్తుత తరం వారు తరువాతి తరానికి మాతృభాషను నేర్పించడం మానుకోవటం మొదలయింది. అయితే కొన్ని కుటుంబాల్లో ఇంకా ప్రస్తుత తరం వారు తమ తరువాతి తరానికి మాతృభాషను నేర్పిస్తూనే ఉన్నారు.

స్థాయి 4: తీవ్రమైన ప్రమాద స్థితి : ఇళ్ళలో మాతృభాష పిల్లలకు మొదటి భాషగా నేర్పటం లేదు. ఆ భాషను మాతృభాషగా కలిగిన ఆఖరితరం ప్రస్తుతతరం. తరువాతితరం పరాయి భాషను మాతృభాషగా పరిగణిస్తోంది. ఈ స్థితిలో పెద్దలు పిల్లలలో తమ మాతృభాషలో మాట్లాడుతున్నా, పిల్లలు అది అర్థం చేసుకున్నా, జవాబు మాత్రం వేరే భాషలో ఇస్తారు.

స్థాయి 5 : పూర్తి ప్రమాద స్థితి: భాషను మాతృభాషగా మాట్లాడుతున్న ఆఖరు తరం ప్రస్తుతం తాత-అమ్మమ్మ-నానమ్మల ముసలి తరంలో ఉన్నారు. రోజువారీ సంభాషణల్లో భాష వాడుక లేదు. ఈ ముసలి తరం వారికి భాష పూర్తిగా గుర్తులేదు, వారు మాట్లాడేందుకు ఇతరులు ఉండకపోవటం వలన ఆ కాస్త కూడా వాడరు.

స్థాయి 6: లుప్తం/కనుమరుగు : ప్రస్తుతం భాషను మాట్లాడేవారు గానీ, భాషలోని పదాలను గుర్తించగల వారు గానీ లేరు.

2. భాషను మాట్లాడే (మాతృభాష కాకపోయినా, ఆసక్తితో నేర్చుకునే) అసలు వ్యక్తుల సంఖ్య ఆధారంగా

ప్రమాద స్థాయి	స్థాయి సంఖ్య	మాట్లాడే జనాభా
సురక్షితం	5	పిల్లల నుండి అందరూ భాషను మాట్లాడతారు.
దుర్బలం	4	కొన్ని సందర్భాల్లో అందరు పిల్లల తరం వారు, అన్ని సందర్భాల్లో కొందరు పిల్లలు భాషను వాడుతున్నారు. పై తరాల వారు మామూలుగా భాషను వాడుతున్నారు.
కచ్చితంగా ప్రమాదంలో	3	పిల్లల తరం భాషను నేర్చుకోవడం మానేసారు.
తీవ్ర ప్రమాదంలో	2	భాషను ముసలి తరం మాత్రమే సంభాషణలకు వాడుతున్నారు.
పూర్తి ప్రమాదంలో	1	కనీసం ముసలివాళ్ళు కూడా భాషను వాడటం లేదు కానీ కొందరికి భాషలో కొంత భాగం గుర్తుంది.
కనుమరుగు అపోయింది	0	లేదు కానీ కొందరికి భాషలో కొంత భాగం గుర్తుంది. భాష మాట్లాడే వారు లేరు.

భాషను మాతృభాషగా కలిగిన వారు కచ్చితంగా ఆ భాషలో సంభాషించగలరు, అయితే ఆసక్తి వలన పరభాష వారు కూడా ఈ భాషలో సంభాషణ చేయగలరు. అలాంటి రెండవ స్థాయి భాషను మాట్లాడే వ్యక్తులను కూడా కలుపుకొని ఆ భాష మాట్లాడే వ్యక్తుల మొత్తం సంఖ్యను కనిపెట్టి భాష బలాన్ని నిర్ధారించవచ్చు. అలా కనిపెట్టాక ఒకవేళ ఆ భాష మాట్లాడే సముదాయం చిన్నది అయితే ఆ భాష ప్రమాదంలో చేరుకునే అవకాశాలు ఎక్కువ. పెద్ద భాషలు సహజంగానే భౌగోళిక పరిధులను దాటి పలు ప్రాంతాలకు పాకుతాయి. చిన్న భాషలుగా ఉండిపోయే భాషా సముదాయాల్లోని ప్రజలు ఏదైనా రోగం వలన, లేదా యుద్ధం వలన, ప్రకృతి వైపరీత్యం వలన చనిపోతే, ఆ భాషను మాట్లాడేవారి సంఖ్య తగ్గిపోయి, భాష ప్రమాదంలోకి జారుకుంటుంది. ఈ చిన్ని భాషా సముదాయాలు తమ చుట్టూ ఉన్న పెద్ద భాషా సమూహాలతో సామాజిక సంబంధాలు పెట్టుకునే ప్రయత్నంలో పెద్ద భాషా సమూహంలో సమ్మిళితం అవ్వాలనే మానవసహజ పద్ధతి వలన కూడా ప్రమాద స్థాయిలోకి వెళ్ళిపోవచ్చు.

3. మొత్తం జనాభాతో పోల్చితే భాష మాట్లాడే వ్యక్తుల సంఖ్య

దేశం స్థాయిలో, రాష్ట్రం స్థాయిలో, జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో మొత్తం జనాభాలో భాషను మాతృభాషగా కలిగిన వారి సంఖ్యా నిష్పత్తి కూడా భాష ప్రమాద స్థాయిని తెలుపుతుంది. సమూహంలో భాషను మాట్లాడే వారి సంఖ్య ఎంత అని యునెస్కో ఈ అంశాన్ని నిర్వచిస్తూ సమూహం మతం స్థాయి, ప్రాంత స్థాయి, నిర్దిష్ట జాతి స్థాయి, జాతీయ స్థాయి ఇలా చెప్పుకున్నారు.

ప్రమాద స్థాయి	స్థాయి సంఖ్య	మొత్తం జనాభాతో పోల్చితే భాషమాట్లాడే వ్యక్తుల సంఖ్య
సురక్షితం	5	అందరూ భాషను మాట్లాడతారు.
దుర్బలం	4	దాదాపు అందరూ భాషను మాట్లాడతారు.
కచ్చితంగా ప్రమాదంలో	3	అధిక సంఖ్యాకులుభాషను మాట్లాడతారు.
తీవ్ర ప్రమాదంలో	2	అల్ప సంఖ్యాకులు భాషను మాట్లాడతారు.
పూర్తి ప్రమాదంలో	1	అతి కొద్ది జనాభా భాషను మాట్లాడతారు.
కనుమరుగు అపోయింది	0	భాష మాట్లాడేవారు లేరు.

4. భాషను వాడే రంగాలలో వస్తున్న మార్పులు

ఒక భాష తరువాతి తరాలకు ప్రసరిస్తుందో లేదోనన్న సంగతి ఆ భాషను ఏ రంగాలలో, ఎక్కడ, ఎవరితో, ఎలాంటి అంశాల

మీద మాట్లాడేందుకు వాడుతున్నామోనన్న విషయాలపై ఆధారపడి ఉంటుంది.

అన్ని రంగాలలో వాడకం (5): ఆ భాష భాషను మాట్లాడే సమూహంలో మాట్లాడేందుకు. గుర్తింపుకు, ఆలోచించేందుకు, సృజనకు, మరియు వినోదానికి వాడుతున్నారు. అన్ని రంగాలలో అన్ని పనులకు భాషను చురుగ్గా వాడుతున్నారు.

బహుభాషల మధ్య ఒక భాషగా(4): అధికారిక రంగంలో, ప్రభుత్వ రంగంలో, విద్యా సంస్థల్లో, పౌరసంబంధ కచేరీల్లో ఈ భాష కాని మరొక పెద్ద భాష చెలామణీలో ఉంది. అయితే ఈ భాష మాత్రం అక్కడక్కడా వినిపిస్తుంది. ముఖ్యంగా మతపరమైన ప్రదేశాలు - గుడులు, చర్చీలు, మసీదుల్లో ఒకరికొకరు సంభాషణల్లో వాడుతున్నారు, అంగళ్ళలో లావాదేవీల్లో ఈ భాషను పెద్ద భాషకు ధీటుగా వాడుతున్నారు, సమూహంలోని కొందరు వ్యక్తులు ఏదైనా సందర్భంలో కలిస్తే మాట్లాడేందుకు ఈ భాషను వాడుతున్నారు. ఇలాంటి పెద్ద భాష-చిన్న భాష పక్క పక్కన వాడుతున్నపుడు సహజంగా ప్రభుత్వ పరమైన, అధికారిక పనులకు పెద్ద భాషను వాడుతూ, అనధికారిక సందర్భాల్లో చిన్న భాషను వాడటం కద్దు. ఆయా సమూహాల్లోని వ్యక్తులు పెద్ద భాష పరాయిది అయినప్పటికీ సామాజిక, ఆర్థిక్ ఉన్నతి కోసం తమ మాతృ భాషను విడిచి పెద్ద భాషను దగ్గర చేసుకుంటారు. కానీ భాషా సముదాయంలోని ముసలి తరం వారు ఇంకా ఆ భాషలోనే మాట్లాడటం కొనసాగిస్తున్నారు. అయితే ఈ బహుభాషత్వం వలన భాషలకు ప్రమాదం మాత్రం లేదు.

వాడుక రంగాల తారుమారు(3): పెద్ద భాష పెత్తనం పెరిగి చిన్న భాష సమూహంలోని వ్యక్తులు మెల్లిగా అన్ని రంగాలకూ పెద్ద భాషను అలవర్చుకుంటున్నారు. పెద్దలు పిల్లలతో మాట్లాడేందుకు పెద్ద భాషనే వాడుతున్నారు, తమ సొంత మాతృభాషను వదిలేస్తున్నారు. పిల్లలు

ప్రమాద స్థాయి	స్థాయి సంఖ్య	మొత్తం జనాభాతో పోల్చితేభాష మాట్లాడే వ్యక్తుల సంఖ్య
చురుగ్గా కొత్త మాధ్యమాలలో వాడకం	5	అన్ని మాధ్యమాల్లో భాషను చురుగ్గా వాడుతున్నారు.
అన్ని మాధ్యమాల్లో కాకపోయినా సింహభాగం వాడుక	4	రెండు మూడు భాషల మధ్య ఒక భాషగా ఈ భాషను అన్ని మాధ్యమాల్లో వాడుతున్నారు.
కొన్ని మాధ్యమాల్లో వాడుక	3	కొన్ని మాధ్యమాల్లో చిన్న భాష, ఎక్కువ మాధ్యమాల్లో పెద్ద భాష వాడుక. మెల్లిగా ఆ కొన్ని మాధ్యమాల్లో పెద్ద భాష పెత్తనం.
అతికొద్ది మాధ్యమాల్లో వాడుక	2	చిన్న భాష వాడకం కొన్ని మాధ్యమాలకు పరిమితమై, పెద్ద భాష పెత్తనం అన్ని మాధ్యమాల్లో పెరిగిపోయింది.
ఒకటీ అరా మాధ్యమాలకే పరిమితం	1	కొన్ని మాధ్యమాలకే భాష వాడకం పరిమితమయింది.
ఏకొత్త మాధ్యమంలోనూ భాషవాడుక లేకపోవటం	0	ఏ కొత్త మాధ్యమంలోనూ భాష వాడుక లేకపోవటం

అలా తమ సొంత మాతృభాషను మరిచి పెద్ద భాషను అందిపుచ్చుకుంటున్నారు. పెద్దలు, ముసలివాళ్ళు దుబాసీలుగా ఉంటున్నారు. చిన్న భాషను ప్రాథమికంగా వాడే కొన్ని ఇళ్ళల్లో పిల్లలు సైతం రెండు భాషల్లో గట్టి పట్టుతో ఉన్నారు.

కొన్ని రంగాలకే పరిమితం(2): నామమాత్రానికే చిన్న భాష మతపరమైన లేదా సాంస్కృతిక రంగాలకు పరిమితమయింది. పండుగల్లో, మతపరమైన-సాంస్కృతిక కార్యక్రమాలలో మాత్రమే పెద్దల భాషగా మాతృభాష చెలామణీలో ఉండి, మిగితా అన్ని రంగాలలో పెద్ద భాష చిన్న భాష స్థానాన్ని ఆక్రమించుకుంది. చిన్న భాషని అర్థం చేసుకున్నా, ప్రస్తుత తరం వారు ఆ భాషలో మాట్లాడలేరు. ముసలివాళ్ళు, పెద్దలు మాత్రమే మాట్లాడగలరు.

ఒకటీ అరా రంగాలకే పరిమితం (1): సమూహంలోని ఒకటి అరా వ్యక్తులు మాత్రమే మతపరమైన కార్యక్రమాలలో ఒక విశిష్ట భాషగా సమూహ భాషను వాడుతున్నారు. మిగితా జనాభా ఇంటా బయటా అన్ని రంగాలలో పెద్ద భాషను అమలు చేస్తూ, చిన్న భాషను మర్చిపోయారు. కొద్ది మంది వ్యక్తులకు భాషలోని కొన్ని పదాలు గుర్తున్నాయి.

కనుమరుగు(0): భాషను ఏ రంగంలోనూ, ఎక్కడా వాడటం లేదు.

కొత్త మాధ్యమాల వాడకం ప్రాంతీయ సందర్భాన్ననుసరించి మారుతూ ఉండవచ్చు. రేడియో, టీవీ, జాలస్థలాలు, మొబైల్ ఆప్‌లు కొన్ని సమూహ భాషలో ఉండవచ్చు కొన్ని పెద్ద పరాయి భాషలో ఉండవచ్చు. వారానికొక గంట లేదా రోజుకొక అరగంట లేదా కొన్ని నిమిషాలు రేడియోలో లేదా టీవీలో చిన్న భాషకు ఒక కార్యక్రమం ద్వారా పెద్ద భాషల మధ్య స్థానం దొరకవచ్చు. లేదా పూర్తిగా ఒక టీవీ వాహిక ఆ భాషలో ఉండవచ్చు.

6. భాషలో చదువుకు, అక్షరాస్యతకు అందుబాటులో ఉన్న పాఠ్యసామగ్రి

చదువుల్లో ఒక భాషను ఎంత మేరకు వాడుతున్నామోనన్నది ఆ భాష బలాన్ని నిర్దేశిస్తుంది. ఆ భాష వాడుక చదువుల్లో పూర్తి మాధ్యమంగానా, ఒక పెద్ద విషయంగానా, ఒక చిన్న విషయంగానా, లేదా పరిచయంగానా అన్నది భాష బలాన్ని చెబుతుంది. కొన్ని భాషా సముదాయాలు తమ భాషను కేవలం మౌఖికంగా మాత్రమే

కొనసాగినస్తా, వ్రాతలో తమ భాషను నిక్షిప్తం చేయడాన్ని వ్యతిరేకించవచ్చు. కొన్ని భాషా సముదాయాలు తమ భాషలోనే అన్ని విషయాలు చదువుల ద్వారా నేర్చుకోవడాన్ని గర్వంగా పాటిస్తారు. అక్షరాస్యత కొన్ని సముదాయాల్లో గౌరవప్రదమైన అంశం అయితే, మరికొన్ని సముదాయాలు అక్షరాస్యతకు దూరంగా ఉండటమే మేలని నమ్ముతాయి. అయితే నేటి కాలంలో అక్షరాస్యత ఆ భాషా సముదాయపు ఆర్థిక, సామాజిక ఔన్నత్యాన్ని నిర్దేశిస్తున్న సందర్భంలో చదువుకు, అక్షరాస్యతకు భాషలో పాఠ్య సామగ్రి అందుబాటులో ఉండడం చాలా అవసరం. సమూహ భావన ఎలా ఉన్నా, పుస్తకాలు, పాఠ్య సామగ్రి ప్రతి భాషలో అన్ని చదువులకూ


స్థాయి సంఖ్య	పాఠ్య సామగ్రి అందుబాటు
5	భాషలో సాధారణ పాఠ్యాంశాలకు సంబంధించిన మొత్తం పాఠ్య సామగ్రి అందుబాటులో ఉంది. వ్యాకరణాలు, నిఘంటువులు, పాఠ్యాలు, సాహిత్యం, రోజువారీ వార్తలు ఈ భాషలో ఉన్నాయి. చదువుల్లో, అధికార(ప్రభుత్వ) పత్రాలలో భాష వాడుక ఉంది.
4	పాఠ్య సామగ్రి ఉంది. బడులలో పిల్లలకు సరిపడా సాహిత్యం భాషలో వెలువడింది. అయితే అధికారిక రంగాలలో(ప్రభుత్వం, న్యాయం మొ॥) భాష వాడుక లేదు.
3	బడులలో భాషలో పాఠ్య సామగ్రి విద్యార్థులకు అందుబాటులో ఉంది కానీ అధికారిక రంగాలతో పాటు ఆ ప్రాంతంలోని ప్రధాన సమాచార పత్రికలేవీ భాషలో వెలువడటం లేదు.
2	భాషలో మాధ్యమంగా గానీ, ఒక విషయంగా గానీ చదువులు నడవటం లేదు. పాఠ్య సామగ్రి మాత్రం అందుబాటులో ఉంది.
1	కొన్ని వనరులు మాత్రమే భాషలో అందుబాటులో ఉన్నాయి. బడిలో వాడకం లేదు.
0	భాషలో ఎలాంటి పాఠ్య సామగ్రి కానీ సాహిత్యం కానీ లేవు.

తయారు పాఠకులు ఈ వ్యాసం చదివాక వారి పరిసరాలను గమనిస్తే తెలుగు భాష పైన చెప్పుకున్న ఆరు అంశాలలో ఒక్కో అంశంలో ఒక్కో రకంగా ప్రమాద స్థాయికి చేరువవుతోందని తెలుసుకుంటారు. తెలుగు భాషను ప్రమాద స్థాయి నుంచి దూరంగా సురక్షితం చేసే మార్గం ఏంటో కూడా ఈ వ్యాసం ఒక విధంగా తెలియజేస్తోంది. ఆ దిశగా తెలుగు భాషను నడిపించే బాధ్యతను తెలుగు వారిగా మనం మన బాధ్యతగా తీసుకోకపోతే తెలుగు భాషను మన చేతులారా చంపుకున్న సముదాయంగా తెలుగువాళ్ళం చరిత్రలో మిగిలిపోతాం. తెలుగు కనుమరుగూ అవుతుంది. అలా జరగకుండా కలిసి రావాలని పాఠకులకు నా విన్నపం.

అ

గ్రంథాలయం

మార్క్సిజం మీద విమర్శలకు, జవాబులు!
రంగనాయకమ్మ
పుటలు: 136, వెల :40/-
ప్రతులకు : అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు విజయవాడ-520 002
ఫోన్: 9440630378






కవితా ప్రయోజనం
(శ్రీశ్రీ.. ఆరుద్ర)
పుటలు: 31, వెల :40/-



ఆంధ్రీకథనం (శ్రీశ్రీ)
అనువాద కథలు
పుటలు: 167, వెల :140/-

కూర్పు: **సింగంపల్లి అశోక్‌కుమార్**
ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతి నగర్, విజయవాడ-04 సెల్: 9246277375



అనంతపురం
ఆత్మ సింగమనేని

కథలకు కరువా!
పిల్లలకు బరువా!!
సంపాదకుడు: **సాకం నాగరాజ**
అభినవ ప్రచురణలు, తిరుపతి
ఫోన్: 9440331016






దుశ్శాలు వాకప్పంగ
కామిడీ కథలు
పుటలు: 140, వెల :140/-



గతం గతః
(ఆధ్యాత్మిక కథలు)
పుటలు: 160, వెల :116/-

రచన: **ఆర్.సి. కృష్ణస్వామిరాజు**
ప్రతులకు : 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్డు, తిరుపతి-517 501,సెల్: 9393662821

జీవుడు-దేవుడు
డా॥ **కపిలవాయి లింగమూర్తి**
సంపాదకుడు: కపిలవాయి ఆశోక్‌బాబు
పుటలు: 156, వెల :200/-
ప్రతులకు : ఇం.నెం. 1-9-312/ఏ,
ప్లాట్ నెం. 404, సి.బ్లాక్, వైదేహినివాస్
గోల్డెన్ ఫామ్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్,
హైదరాబాద్ - 500 044
ఫోన్: 9440630378



జె.డి.ప్రభాకర్
8500227185

భారతీయ నుడుల ఆర్థిక మూలాలు: పరిచయం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ ఆర్థిక ఉన్నతినీ, దానికి గల కారణాలనూ ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. దేశానికి పట్టుకొమ్మలుగా నిలిచిన గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలూ, వాటిలో స్థానిక నుడుల వాడుక- దేశ ఆర్థిక వ్యవస్థకు ఏ విధంగా బలాన్ని చేకూరుస్తాయో ఈ వ్యాసంలో తెలియజెప్పాను. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఐఎంఫ్ మొదలగు వాటి నుండి ఆధారాలను సేకరించి, అసంఘటిత రంగం ద్వారా జరిగే ఆర్థిక కార్యకలాపాలూ వాటికి జీవం అందించే అమ్మనుడుల పాత్రనూ ఇందులో శాస్త్రీయ కోణంలో అభివర్ణించారు. అమ్మనుడుల విద్యా, దాని ద్వారా వచ్చే నైపుణ్యాలూ దేశ ఆర్థిక ఉన్నతికి ఏవిధంగా దోహదపడతాయో ఈ వ్యాసం వివరిస్తుంది.

పరిచయం: సంపద సృష్టి మానవ మనుగడకు మూలం. సంపదను కేవలం డబ్బూ, వస్తు రూపాలలో చూసి దానిని నిర్వచించలేము. అవి కేవలం మారకపు విలువకు ప్రతిరూపాలే. సంపద వివిధ రూపాలలో ఉన్నప్పటికీ జ్ఞానం అత్యంత విలువైన సంపదగా పరిగణించవచ్చు. ఒక దేశ ఆర్థికాభివృద్ధి ఆ దేశంలో ఉండే సహజ వనరులూ, ఆ దేశ ప్రజల జ్ఞానసమృద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఏదైనా ఒక సమస్యకు మూలం తెలుసుకున్నప్పుడు ఆ సమస్యకు పదునైన పరిష్కారాన్ని అందించవచ్చు. అలాగే విజయానికి కారణమైన మూలాలను తెలుసుకున్నప్పుడు విజయాన్ని కొనసాగించడానికి వీలవుతుంది. ప్రపంచంలో ఆర్థికాభివృద్ధి చెందిన అమెరికా, చైనా, జపాను, జర్మనీ, యునైటెడ్ కింగ్డమ్ మొదలగు దేశాల అభివృద్ధికి కారణాలు - సహజ వనరుల వినియోగమూ, ఉత్పత్తి నదుపాయాలూ, ఉత్పాదకత. కానీ వీటన్నిటినీ సమన్వయపరిచేది జ్ఞానం. ఆ జ్ఞానానికి మూలం నుడి. "నుడి, వ్యక్తినీ సమాజాన్నీ కలిపివుంచుతుంది. సామాజిక వ్యవస్థకు నుడే పునాది. వ్యక్తికీ ఆర్థిక వనరులకూ మధ్య సంబంధాలలో నుడికి సంబంధించిన విధి విధానాలు ఉన్నాయి" (గారపాటి ఉమామహేశ్వరరావు, 2017). ఆర్థిక వ్యవస్థకు సహజ వనరులు ఎంత ముఖ్యమో ఆ ప్రాంతంలో ఉపయోగించే సహజ నుడులూ అంతే ముఖ్యం. ప్రజల నిత్య అవసరాల మేరకు చేసే వ్యవసాయమూ, వస్తూత్పత్తీ, సేవా సహజ వనరులపై ఆధారపడి ఉంటాయి. ఆ విధంగా సహజ వనరులను ఉపయోగించి చేసే వ్యవసాయం, పశువులూ, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, గనుల తవ్వకం, ఇతర వస్తూత్పత్తి సేవలకు శ్రమశక్తి అవసరం అవుతుంది. వాటి ఉత్పత్తికి పనిచేసే శ్రామికులకి పనికి అవసరమైన పరిజ్ఞానం అంతా కూడా వారి మాతృభాషతో ముడిపడి ఉంటుంది. "అమ్మనుడి ఆర్థిక స్వావలంబనకు ఆధారం. ఈ స్థానాన్ని మరొక నుడి ఆక్రమణకు అవకాశం కల్పించడం మన హక్కులను కాలరాయడమే అవుతుంది" (గారపాటి ఉమామహేశ్వరరావు, 2017)

క్ర. సం	దేశం	విద్యా మాధ్యమం (ప్రాథమిక, మాధ్యమిక విద్యలో)	శ్రమ శక్తి (కోట్లలో) 2020 సం.*	అక్షరాస్యత % (15 సం. పై)+	స్థూలజాతీయోత్పత్తి (GDP%) కోట్ల,డాలర్లలో (2020 సం.)**
1.	అమెరికా	ఇంగ్లీషు, స్పానిష్, ఫ్రెంచ్, హవాయి, అమెరికా మాదలికం, భారతీయ ఇంగ్లీష్ మాండలికం.	16.52	99	2,09,53, 030.00
2.	చైనా	మాండరిన్, ప్రాంతీయ భాషలు.	77.85	96.8	1,47,22, 730.70
3.	జపాన్	జపనీస్	6.87	99	50,57, 758.96
4.	జర్మనీ	జర్మన్	4.34	99	38,46, 413.93
5.	యు.కె	ఇంగ్లీష్, గేలిక్	3.47	99	27,59, 804.06
6.	భారతదేశం	తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, హిందీ, బెంగాలీ మొ.) లేదా (ఇంగ్లీషు)	47.17	74	26,60, 245.25

మూలం: *,** ప్రపంచ బ్యాంకు నివేదిక 2020వ సంవత్సరం. + ప్రపంచ జనాభా సమీక్ష 2022.

పట్టిక 1.1 లో చూపిన విధంగా ప్రపంచంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలు, దానికి గల కారణాలను పరిశీలించినట్లయితే, మొదటి స్థానంలో ఉన్న అమెరికా 99% తో పాటు 16.52 కోట్ల శ్రమశక్తితో ముందంజలో నడుస్తోంది. వారి ప్రధాన అమ్మనుడులపైన ఇంగ్లీష్‌లో విద్యాబోధన జరుగుతోంది. కొన్ని రాష్ట్రాలలో స్పానిష్, ఫ్రెంచ్ (లూసియానాలో), హవాయిన్ (హవాయిలో) ప్రాథమిక మరియు మాధ్యమిక విద్యను అందిస్తోంది. ఏ రాష్ట్రాలలో ఏ నుడిని అత్యధికంగా ఉపయోగిస్తున్నారో ఆ భాషలో ఆ ప్రాంత విద్యార్థులకు మాతృభాషలో విద్యను అందించడానికి నుడి ప్రణాళికలు రూపొందించారు. తర్వాత ప్రపంచంలోనే అత్యధికంగా 77.58 కోట్ల శ్రమశక్తి కలిగిన దేశమైన చైనా 96

శాతం అక్షరాస్యతను సాధించి అమెరికాని తలదన్నే విధంగా సాంకేతికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందింది. చైనా, జపాన్, జర్మనీ, దేశాలు పూర్తిగా ప్రాథమిక మాధ్యమిక విద్యను అమ్మనుడిలోనే అందిస్తున్నాయి. హెల్లర్, ఎం. (2003) ప్రస్తావించినట్టుగా ప్రపంచీకరించబడిన కొత్త ఆర్థిక వ్యవస్థ అనేక రకాలుగా నుడి మరియు గుర్తింపుతో ముడిపడి ఉంది (ఉదా. బామన్ 1997; కాస్టెల్స్ 2000; గిడెన్స్ 1990). అక్కడి శ్రమశక్తి నైపుణ్యత కలిగి ఆర్థిక ఆర్థిక కార్యకలాపాలలో చురుకుగా పని చేస్తున్నారంటే దానికి కారణం వారి అమ్మనుడిలో విద్యను అభ్యసించడమే. ఆయా దేశాలలో సహజ వనరులు ఉత్పాదకత మొదలైన అంశాలు ఆ దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావం చూపుతున్నప్పటికీ వాటిని సరైన క్రమంలో ఉపయోగించుకునే జ్ఞానాన్ని అందజేస్తున్న అమ్మనుడిలో విద్యా మాధ్యమాన్ని ఒక ప్రత్యేక అంశంగా పరిగణించాల్సి అవసరం ఉంది.

1. ప్రపంచంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ:

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలు యువతే అని చెప్పవచ్చు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకారం మనదేశంలో 80.80 కోట్లమంది యువత ఉన్నారు. భారతదేశంలోని మొత్తం జనాభాలో 60 శాతం అన్నట్లు. ప్రపంచంలో ప్రస్తుతం ఆర్థికాభివృద్ధిలో ఏడవ శాతాన్ని దక్కించుకున్నా, 2030 నాటికి ఆసియాలో మొట్టమొదటి స్థానాన్ని సంపాదించుకుంటునట్లు ఇన్ఫర్మేషన్ హ్యాండ్లింగ్ సర్వీసెస్ (అయ్‌హెచ్ఎస్) పేర్కొంది. జపాన్ ఆర్థిక వ్యవస్థను త్వరలోనే అధిగమిస్తుందనీ, ప్రపంచంలో నాలుగో స్థానాన్ని పొందుతుందనీ అంచనా వేసింది. దేశంలో ప్రస్తుతం 47.17 కోట్ల శ్రామికశక్తితో, అమెరికా, జపాన్, జర్మనీ, యునైటెడ్ కింగ్డమ్ శ్రమశక్తితో పోలిస్తే మనది అత్యధికం. అయినప్పటికీ ఆ దేశాలు ఆర్థిక ప్రగతిలో ముందు ఉండడానికి కారణాలు వారికి ఉన్న ఉత్పాదకతా సామర్థ్యం, సదుపాయాలూ నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి కావచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా ఆ దేశాలు అమ్మనుడిలో మాధ్యమ విద్యకు ప్రాముఖ్యతను ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఏడుపదుల స్వతంత్రదేశంలో 74 శాతం అక్షరాస్యతను సాధించినప్పటికీ మనదేశంలో నిరుద్యోగసమస్య దేశాన్ని పట్టిపీడిస్తోంది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఈ) 2021 ప్రకారం, దేశంలో 5.3 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నట్లు తెలిపింది. అందులో ముఖ్యంగా ఏటా 15 లక్షల మంది ఇంజనీర్లు తమ చదువులు పూర్తి చేసుకుని బయటకు రాగా అందులో 80 శాతం మంది యువత నిరుద్యోగులుగా మారుతున్నారు. దీనికి గల ప్రధాన కారణం చదువు ఉన్నా పనికి కావాల్సిన నైపుణ్యాలు లేకపోవడమే. విద్యార్థులు ఈ విధంగా ప్రతి రంగంలోనూ ప్రతి ఏటా నిరుద్యోగులుగా మారుతున్నారు. దీనికి గల ప్రధానకారణం విద్యా మాధ్యమమే. చదువు నైపుణ్యంగా రాకపోవడానికి కారణం సరైన సదుపాయాలు లేకపోవడంతో పాటు విద్యను ఆంగ్లమాధ్యమంలో అందించడమే. ఇంజనీరింగ్ చదివిన 86 శాతం మంది ఉద్యోగులు ఆంగ్లం అర్థం చేసుకోలేక పోతున్నారు అని సర్వేలో తేలింది. భాష అర్థం చేసుకోలేనప్పుడు అందులోని విషయావగాహన ఏ విధంగా ఆకళింపు చేసుకుంటారు? చదువు నైపుణ్యంగా ఎలా మారుతుంది? అందువలన ప్రపంచంలో ఆర్థిక అభివృద్ధి చెందిన దేశాలతో మనం పోటీ పడాలి అంటే మన అమ్మనుడిలో విద్య తప్పనిసరి. మన దేశంలోనే ఆర్థిక వనరుల సద్వినియోగానికి మన స్థానిక నుడిని ఉపయోగించి ఆర్థిక అభివృద్ధి చెందాలి.

2. ఆర్థిక వ్యవస్థలో అసంఘటితరంగ పాత్ర:

ఆర్థిక కార్యకలాపాలను స్థూలంగా రెండు రంగాలుగా విభజించవచ్చు. వ్యవస్థీకృత రంగం (ఆర్గనైజ్డ్ సెక్టర్ మరియు అసంఘటితరంగం (అన్‌ఆర్గనైజ్డ్ సెక్టర్). వ్యవస్థీకృత రంగం మరియు అసంఘటితరంగం పునరుత్పత్తి, వృద్ధి ప్రక్రియల మధ్య సంబంధాన్ని కొత్త కోణంలో విశ్లేషించడం చాలా కీలకంగా మారింది (భట్టాచార్య, ఆర్., భట్టాచార్య, ఎస్.,& సన్యాల్, కె, కె.(2013). సంఘటిత రంగంలో శ్రామికులకు నియమిత పని సమయం, జీతం, యజమానితో పని ఒప్పందం, పన్ను చెల్లింపు మొదలగు లక్షణాలు ఉంటాయి. అసంఘటిత రంగానికి పై లక్షణాలు ఏవీ ఉండవు. స్వేచ్ఛగా స్వతంత్రంగా పని చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మనిషికి తన నైపుణ్యాన్ని ఉపయోగించి సొంత పనినీ, వ్యాపారాన్నీ చేసుకునే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలోగానీ పట్టణ ప్రాంతాలలో గానీ వీరి వ్యాపారాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుంటాయి. అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) గణాంకాల ప్రకారం ప్రపంచంలో రెండు వందల కోట్ల మంది శ్రామికులు అసంఘటిత రంగంలో ఆర్థిక కార్యకలాపాలు చేస్తున్నారు. ప్రపంచంలోని తక్కువగా లేదా మధ్యరకంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో స్థూల జాతీయోత్పత్తికి (జిడిపి) అసంఘటిత రంగం నుంచి దాదాపు 35 శాతం సంపద చేకూరుతోందనీ, అభివృద్ధి చెందిన దేశాలలో 15 శాతం వరకు స్థూల జాతీయోత్పత్తి వస్తుందనీ సర్వే నివేదికల ద్వారా తెలియజేశారు.

పట్టిక 2.1 దేశ సమూహాల వారీగా (గ్రామీణ/పట్టణ) అనధికారిక ఉపాధి వాటాలు (శాతాలలో)

క్ర. సం	అంశాలు	ప్రపంచ వ్యాప్తంగా	అభివృద్ధి చెందిన దేశాల్లో	వేగంగా అభివృద్ధి చెందిన దేశాల్లో	అభివృద్ధి చెందుతున్న దేశాల్లో
1.	అసంఘటిత శ్రమశక్తి	61	18	67	90
1.1	గ్రామీణ	80	22	83	90
1.2	పట్టణం	44	17	51	79
2.	వ్యవసాయం	94	59	93	98
2.1	గ్రామీణ	95	64	95	98
2.2	పట్టణం	87	49	82	98

3.	పరిశ్రమలు	57	16	67	73
3.1	గ్రామీణ	69	17	75	87
3.2	పట్టణం	49	15	61	65
4.	సేవ	47	18	55	74
4.1	గ్రామీణ	65	19	71	79
4.2	పట్టణం	39	17	47	70

మూలం: అనధికారిక ఆర్థిక వ్యవస్థలో స్త్రీలు మరియు పురుషులు-ఒక గణాంక సంక్షిప్తి (2019); జాతీయ కార్మిక శక్తి డేటా ఆధారంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) లెక్కలు.

పైన పేర్కొన్న పట్టిక 2.1 ను గమనించినట్లయితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రమశక్తి వ్యవసాయ రంగంలో ఎక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో 94 శాతం, పరిశ్రమలలో 57 శాతం, సేవ రంగంలో 47 శాతం శ్రమశక్తి ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలియజేస్తోంది. ఇందులో గమనించాల్సిన విషయం ఏమిటంటే శ్రామికవర్గం ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాలవారే. ప్రతి రంగంలోనూ గ్రామీణ కార్మిక శక్తి ఎక్కువగా ఉంటోంది. దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు తమకున్న జ్ఞానాన్ని ఉపయోగించి తమ అమ్మనుడిలోనే సంభాషిస్తూ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలుసుకోవాలి. ఈ ఆర్థిక కార్యకలాపాలు వాటి నుండి వస్తున్న ఆదాయం స్థూల జాతీయోత్పత్తికి మూల స్తంభంగా నిలుస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో ఈ వైవిధ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అదేవిధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా ఈ స్వల్ప వ్యత్యాసాన్ని మనం చూడవచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలో శ్రామిక శక్తి తక్కువగా 18 శాతం ఉండటం, తక్కువగా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో 67, 90 శాతం ఉండడం ఆ దేశంలోని శ్రామికుల శక్తి సామర్థ్యాన్ని చూపిస్తోంది. ఏ దేశంలో అయితే అసంఘటిత రంగం తక్కువగా ఉందో అక్కడ సంఘటిత రంగం ఎక్కువగా నైపుణ్యంతో పనిచేస్తున్నట్టుగా తెలుస్తోంది. అదే విధంగా ఆ దేశాలలోని అక్షరాస్యతా, విద్యామాధ్యమం కూడా వాటికి సహకరించేవిగా ఉంటున్నాయి. వ్యవసాయం, చేతివృత్తులు, చిన్న చిన్న వ్యాపారాలు మొదలగువాటికి కూడా నైపుణ్యాలు అవసరమే.

3. భారతదేశంలో వ్యవస్థీకృత, అసంఘటిత రంగాల ఆదాయం స్థానిక నుడుల పాత్ర:

భారతదేశ ఆర్థికవ్యవస్థనూ, అందులో స్థానిక భాషల పాత్రనూ అర్థం చేసుకోవడానికి భారతదేశానికి వస్తున్న ఆదాయంలో వ్యవస్థీకృత అసంఘటిత రంగాల్లో నుంచి వస్తున్న ఆదాయాన్ని కూడా పరిగణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆర్థిక కార్యకలాపాలు వ్యవస్థీకృత, అసంఘటిత రంగాల ద్వారా ఫలితాలను ఇస్తాయి. ప్రతి ఆర్థిక రంగంలోనూ వ్యవస్థీకృత ఇంకా అసంఘటిత మార్గాల ద్వారా వాటి విలువ తెలుస్తుంది. ఉదాహరణకు వ్యవసాయంలో దాని నుండి వచ్చే విలువ రెండు రంగాల ద్వారాను అని తెలుస్తోంది. దీన్నిబట్టి ఏయే రంగాలలో ఆర్థిక కార్యకలాపాలలో స్థానిక భాషలను ఉపయోగిస్తూ సంపదను సృష్టిస్తారో తెలుసుకోవడానికి వీలుపడుతుంది. వివరాలకు కింద పొందుపరిచిన పట్టిక 3.1 ను చూడండి.

పట్టిక 3.1 భారతదేశం - ఆర్థిక కార్యకలాపాల ద్వారా వ్యవస్థీకృత మరియు అసంఘటిత రంగం
(జోడించిన స్థూల విలువలో (జివిఎ) వాటాగా)

పరిశ్రమ	2011-12		2017-18	
అంశాలు	వ్యవస్థీకృత	అసంఘటిత	వ్యవస్థీకృత	అసంఘటిత
వ్యవసాయం, అడవులు, చేపలుపట్టడం మొ	3.2	96.8	2.9	97.1
గనులూ-తవ్వకాలు	77.4	22.6	77.5	22.5
తయారీ	74.5	25.5	77.3	22.7
విద్యుత్,గ్యాస్,నీరు	95.7	4.3	94.7	5.3
నిర్మాణం	23.6	76.4	25.5	74.5
వసతి; ఆహారసేవలు; వాణిజ్యం	13.4	86.6	13.4	86.6
రవాణా; నిల్వలు; ప్రసారం	53	47	52.3	47.7
ఆర్థిక సేవలు	90.7	9.3	88.1	11.9
రియల్ ఎస్టేట్, నివాసాల యాజమాన్యం	36.6	63.1	47.2	52.8
పరిపాలన, రక్షణ	100	0	100	0
ఇతర సేవలు	58.8	41.2	52.1	47.9
ప్రాథమిక ధరల వద్ద మొత్తం జివిఎ	46.1	53.9	47.9	52.4

మూలం: మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్,ఇండియా. ఏడవ IMF స్టాటిస్టికల్ ఫోరమ్‌లో సమర్పించబడింది (వాషింగ్టన్ డీసి., 2019).

పట్టిక 3.1. లో చూపిన విధంగా జోడించబడిన స్థూల విలువలో (జివిఎ) అసంఘటిత రంగాల్లో ఎక్కువ విలువ ఉన్నట్టు గమనించవచ్చు. ఉదాహరణకు వ్యవసాయం 2017-18 సంవత్సరంలో వ్యవస్థీకృత రంగం నుంచి 2.9% ఉంటే అసంఘటిత రంగం నుండి 97.1 శాతం ఉన్నది. విద్యుత్తు, గ్యాసు, నీరు, ప్రజా పరిరక్షణ, పాలన మొదలగునవి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తాయి కాబట్టి అవి వ్యవస్థీకృత రంగం క్రిందకివస్తాయి. మరికొన్ని ప్రైవేట్ ఉత్పత్తులు సేవలు అయినా వాటికి పన్ను చెల్లించే విధానం పని సమయాలు జీతాలు మొదలగునవి ఉంటాయి కాబట్టి అది కూడా వ్యవస్థీకృత రంగంలోకి వస్తాయి. వీటిలో పనిచేయడానికి నైపుణ్యత, విద్య అవసరం. అందులోనూ పనిచేసేవారు అమ్మనుడి అన్ని సమయాల్లో వాడినప్పటికీ

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

కేవలం ఉన్నతాధికారులలో, సాంకేతిక విషయాలను సంబంధించి వివరించేటప్పుడు ఆంగ్ల భాషను వాడతారు. అసంఘటిత రంగాల్లో మాత్రం ఎక్కువ పనివారు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు కాబట్టి తోటి పనివారితో మాట్లాడేటప్పుడు వారి అమ్మనుడులను ఉపయోగిస్తారు. భారతదేశ జోడించబడిన స్థూల విలువలు స్థానిక భాషల ఉపయోగం వలననే చేకూరుతోంది. ఐఎంఎఫ్ 2017-18 లెక్కల ప్రకారం భారతదేశంలో 52.4 శాతం అసంఘటిత రంగాల ద్వారా విలువ చేరిన స్థూల ఉత్పత్తి చేకూరుతోంది. కేవలం వ్యవసాయం, చేపలు పట్టడం, అటవీ వనరుల నుండి అసంఘటిత రంగం ద్వారా 96.7 శాతం జోడించిన స్థూల విలువ GVA, (GDP)ని రంగాల వారీగా కొలవడానికి ఉపయోగించి ఒక ప్రక్రియ వస్తుందని ఐఎంఎఫ్ 2017-18 పేర్కొంది.


ఆర్థికాభివృద్ధిలో స్థానిక నుడుల వాడుక:

దేశంలోని ఆర్థిక కార్యకలాపాలు వ్యవస్థీకృత అసంఘటిత రంగాల నుంచి సుమారు 97.74% నిరక్షరాస్యులు, గ్రాడ్యుయేట్స్ కానీ పనివారితో స్థానిక భాషల వినియోగం ద్వారా జరుగుతున్నాయి. దీనికి గల ఆధారాలను పరిశీలిస్తే, దేశంలో ఆంగ్లంలో, చదవడం రాయడం మాట్లాడటంతోపాటు ఆర్థిక కార్యకలాపాలలో వ్యవహరించేవారు గ్రాడ్యుయేట్స్ అనుకుంటే మనదేశంలో గ్రాడ్యుయేట్స్ 6.8 కోట్ల పైచిలుకు ఉన్నారు. అంటే పదిమందిలో ఒకరు గ్రాడ్యుయేట్ అన్నమాట. మొత్తంలో 8.15 శాతం మంది మాత్రమే గ్రాడ్యుయేట్స్. చదువుకున్న గ్రాడ్యుయేట్స్ అందరూ ఉద్యోగం చేస్తున్నారా అంటే కాదు. ఇందులో 26 శాతం మంది మాత్రమే ఉద్యోగులు, 74 శాతం మంది నిరుద్యోగులే. అంటే ఆర్థిక కార్యకలాపాలలో 97.74 శాతం స్థానిక నుడుల వాడుకలోనే జరుగుతున్నది. ఇందులో ఎక్కువ శాతం పనివారు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, చేపల పట్టడం, కుండలు చేయడం, బట్టలు నేయటం, కల్లు తీయడం, నిర్మాణ కూలీలుగా పనిచేస్తూ సంపద సృష్టిలో పాల్గొనేవారే. వీరు అందరూ పూర్తిగా తమ అమ్మనుడిని మాత్రమే ఉపయోగించి పనిచేస్తారు.

పట్టిక 4. భారత గ్రాడ్యుయేట్లలో ఇంగ్లీషు ఇతర స్థానిక భాషలలో ఆర్థిక కార్యకలాపాలు:

గ్రాడ్యుయేట్ల సంఖ్య	గ్రాడ్యుయేట్ల శాతం	గ్రాడ్యుయేట్ ఉద్యోగులు %	గ్రాడ్యుయేట్ నిరుద్యోగులు %	స్థానిక భాషలలో ఆర్థిక కార్యకలాపాలు	ఇంగ్లీష్ భాషలో ఆర్థిక కార్యకలాపాలు
6,86,00,000	8.15	26	74	97.4	2.6

పటం 1.



ఆర్థిక కార్యకలాపాలు ఎంత సహజంగా, నైపుణ్యంతో సహజ భాష అయిన మాతృభాషలో జరుగుతుందో వాటినుండి వచ్చే ఉత్పత్తి గానీ సేవ గానీ అంతే ఉన్నతంగా ఉంటుంది. పనికి కావలసిన నైపుణ్యాన్ని విద్య ద్వారా అందించవచ్చు. మాతృభాషా మాధ్యమంలో విద్యని అందించడం దేశ ఆర్థిక ప్రగతికి మూలం. దేశ ఆర్థిక ప్రగతికి కూడా స్థానిక భాషల వాడుకే మూలం. మన సంపద సృష్టికి జీవన మనుగడకు మూలమైన మాతృభాషను అన్ని వేళలా ఉపయోగించడం సమాజ అభ్యున్నతికి దారి తీస్తుంది. మన దేశ ప్రగతికి మూలాలుగా నిలిచిన మన స్థానిక భాషల విలువను తెలుసుకొని వాటిని అన్ని రంగాల్లోనూ పరిరక్షించడం మన తక్షణ కర్తవ్యం.

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

అంకెలు తెలిపే 'ఇంగ్లీషు' నిజాలు!


2011 జనాభా లెక్కల సందర్భంగా భారతదేశంలో కేవలం 0.02 శాతం అంటే 5000 మందిలో ఒక్కరు మాత్రమే ఆంగ్ల భాషను తమ మాతృభాషగా తెలిపారు. కానీ విచిత్రంగా ఈ ఆంగ్లభాషే సుప్రీమ్ కోర్టులో, పెద్ద పెద్ద పరిశ్రమలలో, ప్రభుత్వ కార్యకలాపాలలో, ప్రముఖ మీడియా సంస్థల్లో చెలామణీ అవుతోంది.

మన జనాభా లెక్కల్లో తెలుపనప్పటికీ అనధికారికంగా ఒక 6.8% మంది అంటే ప్రతి వంద మందిలో కేవలం ఏడుగురు ఆంగ్లభాషలో మాట్లాడగలమని నమ్ముతారు. ఆంగ్లం కన్నా 43 ఇతర భాషలు ఎక్కువగా భారతదేశంలో మాట్లాడబడతాయి.

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో మాతృభాషలు కీలకం

తొలి సారిగా పిల్లలుగా ఉన్నప్పుడు నేర్చుకునే పద్యాలు, పాటలు, కథలు, మాతృభాషల్లో నేర్చుకున్నప్పుడు అవి ఆయా ప్రాంతాల అంశాలను కలిగి ఉంటాయి. ప్రపంచాన్ని పరిచయం చేసే ఈ తొలి పాఠాలు మాతృభాషలో ఉండటమే మేలు. ఈ విషయాన్ని గ్రహించిన దిల్లీకు చెందిన మోహిని గుప్త అనే ఆవిడ సోషల్ మీడియాలో మదర్‌టంగ్‌ట్విస్టర్స్ (ఫేస్‌బుక్‌లో / ఇన్‌స్టాగ్రాములో mothertonguetwisters, ట్విట్టర్‌లో @mttandmore) పేరుతో ప్రాంతీయ భాషల్లోని చిన్నపిల్లల పాటల్ని, కథల్ని, పద్యాలను అందరికీ పరిచయం చేస్తున్నారు. వీరు అనువాద సాహిత్యం పై కూడా సామాజిక మాధ్యమాల్లో రాస్తూ ఉంటారు.

శ్రీలంక లో మూలవాసులైన తెలుగు నాగజాతులను కలిసిన బౌద్ధబిక్షు 'బోధిహీన్'




బౌద్ధబిక్షువు 'బోధిహీన్' గారు 'అమ్మనుడి' పత్రిక కార్యాలయానికి ఫిబ్రవరి 26న వచ్చారు. ఆయనకు 'అమ్మనుడి' సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు ప్రేమతో, గౌరవంతో స్వాగతం పలికారు. డి.పి. అనురాధ రచించిన 'జగములనేలిన తెలుగు' పుస్తకాన్నీ, స.వెం.రమేశ్ కూర్చగా, తెలుగువాణి ట్రస్టు ప్రచురించిన సింహళినుడి ద్వారా 'తెలుగు నేర్చుకోవటం' పుస్తకాన్నీ 'అమ్మనుడి' తాజా పత్రికను బిక్షు 'బోధిహీన్' గారికి బహూకరించారు. ఈ సందర్భంగా సిలోన్ అనబడుతున్న శ్రీలంకలో తెలుగువారితో తన అనుభవాల గురించి 'అమ్మనుడి' పాఠకులకు తెలుపవలసిందని కోరగా, ఆయన సమ్మతించారు. తన అనుభవాలను ఈ సంచికలో కొంతమేరకు తెలిపారు. తర్వాత కూడా తరచుగా వ్రాస్తారని ఆశించవచ్చు. –సంపాదకుడు

శ్రీలంకలోని తెలుగువారు నివసించే ప్రాంతాలలో బౌద్ధ ఆనవాళ్ళు, అక్కడి తెలుగువారి జీవన విధానము, భాష, వారి సంస్కృతి అసలు మూలవాసుల మూలతత్వం వెతుక్కుంటూ బౌద్ధ బిక్షువు బోధిహీన్‌గా పాదయాత్ర చేస్తున్నాను. మధ్య శ్రీలంకలో కుహనీ గ్రామము నందు గల కేతరామ గుడి నుండి గురువుగారి దీవెనలు తీసుకొని నడుచుకొంటూ గ్రామములోకి బయలుదేరాను. ఆ గ్రామములోని సింహళీలు ఎటూకాని సమయంలో బిక్షువు గ్రామములోకి రావటాన్ని ఒక విధంగా ఆశ్చర్యముతో నన్ను చూడసాగారు. కానీ, నేను తలవంచుకొని క్రింద ఉన్న నేలను నా బిక్ష పాత్రను నా శీవరము అంచులను చూస్తూ గ్రామాన్ని దాటుతున్నాను. వెనుక నుండి భంతే! భంతే! అంటూ కొందరి పిలుపు నాకు వినిపించింది. నిదానముగా వెనుకకు తిరుగుతూ వారి పాదాలను చూస్తూ ఉండిపోయాను.

వారు సింహాళీ భాషలో ఒకరితో ఒకరు ఏదో మాట్లాడుతున్నారు. నాకు అర్థం కావటంలేదు. అందులో నుంచి ఒక ఉపాధ్యాయుడు నన్ను సమీపించి ఇంగ్లీషులో, 'అయ్యా, తమరు ఎక్కడికి ప్రయాణము? ఇది బిక్షువులు ఆహారము కొరకు బిక్షాటన సమయము కూడా కాదు, ఎక్కడికి మీ ప్రయాణము' అని అన్నారు. అప్పుడు నేను "అయ్యా, ఆయుష్మాన్, నా తెలుగుజాతి మహా చక్రవర్తి అశోకుని కుమారుడు "మహేంద్ర" బౌద్ధధర్మ ప్రచారంలో భాగముగా ఈ శ్రీలంకకు విచ్చేశారు. వారితో, అప్పటి త్రిలింగ దేశము నుండి మహేంద్రునికి కాళ్ళబాట దారి చూపుతూ అరణ్య మార్గము గుండా వారి పాదాలకు ముళ్ళమొక్కలు తగులకుండా దారిని శుభ్రం చేస్తూ శ్రీలంక సముద్ర మార్గం ఒక అడుగు నీటి లోతు ఉన్న ప్రాంతముగుండా ఒక వారధిని 'మహేంద్ర, సేతువును' నిర్మించి శ్రీలంకలోనే స్థిరపడిపోయారు. వారు ఇప్పుడు ఏ పరిస్థితిలో ఉన్నారో చూడాలని నా మనస్సు పదే పదే ధ్యానములో ఒకే తరహా ఆలాపనలు అలలుగా కెరటాలుగా నాగపాములు బుసలుగా నల్లత్రాచులు నన్ను చుట్టుకొనిపోతున్నట్టుగా నన్ను ఉక్కిరిబిక్కిరి చేసే స్థితిని గురువుగారికి నా భావనస్మృతిని చెప్పి గురువుగారి ఆశీర్వాదాలు తీసుకున్నాను. వారు 'నీకు ధర్మమే మార్గము చూపించుగాక', అని దీవించినారు" అని అన్నాను ఆ ప్రజలతో.

అప్పుడు "మీరు తెలుగువారా! మా దేశాన్ని పరిపాలించిన వారిలో ఎందరో బలిజ తెలుగు రాజులు ఉన్నారు. కానీ మహారాజ్





విజయకుడు, విక్రమసింహా చాలా పేరు గలవారు. వీరి కాలంలో ధర్మము నాలుగు పాదాలా నడిచింది" అనటం మొదలుపెట్టారు. నేను "అవునా! అవునా! మరి ఇప్పుడు తెలుగువారు ఇక్కడ లేరా!" అని అడిగాను. "వారు ఉన్నారు, కానీ ఇప్పుడు వారు బిక్షవాళ్ళవలె పాములు ఆడించుకొంటూ జీవనము గడుపుతున్నారు. అని అన్నాడు. అప్పుడు నేను సరే, వారు ఉండే ప్రదేశం చూపగలరా? లేకుంటే నేను వెతుక్కొంటూ ముందుకు సాగుతాను" అని అన్నాను. "వారు ఒక చోటనే స్థిరనివాసం ఉండరు" అని, అంటుంటే, వెనుక నుండి ఒక యువకుడు 'తండ్రీ నేను చూశాను కేపిటిగల్ రోడ్ నందు' అన్నాడు. 'వెంటనే బయలుదేరండి భంతేజీ. వారు మీకు అందవచ్చు' అని, వారి గ్రామంలోని ఆటోని పిలిపించి ఆ కుర్రవాణ్ణి నాకు తోడుగా ఆ ఉపాధ్యాయుడు పంపారు.


రోడ్ పక్కన తుప్పల్లో వెనుక భాగము మొక్కలు... పెద్ద పెద్ద చెట్లు మధ్యలో ప్లాస్టిక్ గూడారాలు. అక్కడ నన్ను దింపారు. ఆటో నుంచి, నాతో వచ్చిన బాలుడు వారితో ఈ బౌద్ధ బిక్షువు మీ వాడే, తెలుగు మాట్లాడుతున్నారు మీ నుంచి తప్పిపోయి ఇలా బిక్షువు అయ్యారు. అని సింహళీ భాషలో వారికి చెప్పుతుంటే ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టారు పిల్లలు. అందులో చిన్న పిల్లలు నా శీవరము లాగుతూన్నారు. పెద్దలు నాకు దగ్గరగా వస్తూ బాబా సామి మీరు ఇక్కడ మా నాగజాతి వారేనా అని ప్రేమగా పలకరించారు. కొందరైతే పాములు మెళ్ళో వేసుకొని విన్యాసాలు చేస్తూ నా చుట్టూ ప్రదర్శన చేస్తున్నారు. నేను తలను క్రిందకే వంచి వారితో అవును, అవును అంటూ నెమ్మదిగా మాట్లాడసాగాను. ఇంతలో గ్రామము నుంచి వచ్చిన ఆటోడ్రైవరు మేము వెళ్తాము భంతేజీ అంటూ ఆ కుర్రవాడు గ్రామములో పెద్దలు ఇచ్చిన దానసొమ్ములను వాళ్ళ ముందు నాకు ఇవ్వబోయారు. నేను అప్పుడు వీరే మా బంధువులు వారికి ఇవ్వండి అన్నాను. వారు ఇచ్చి వెళ్ళిపోయారు. ఇంతలో నాగన్న అనే పెద్దాయన 'సామి, మాది అన్నీ గుడారాలే అంటూ మొన్న మా పిల్లకి ఇచ్చిన ఈ కొత్త గుడారములో మీరు ఉండండి, మీకు అన్నీ ఏర్పాట్లు నేను చేస్తాను. అయితే తాగితే నేను మనిషిని కాను, అప్పుడు నన్ను క్షమించాలి' అని నన్ను ఆ గుడారమునకు తీసుకువెళ్ళి స్నానం చెయ్యండి అంటూ నీళ్ళు ఇచ్చాడు. అప్పటికి సాయంత్రము 5 గంటలు అయ్యింది. నేను గుడారములోకి వెళ్ళాను. దానిలో ఒక చాప, దోమతెర, ఒక రగ్గు ఉంది. ఒక కుండలో నీళ్ళు ఉన్నాయి. కాళ్ళు కడుక్కొని నేను దోమతెరలో కూర్చొని ధ్యానం చేసుకుంటూ కొంతకాలం గడిచిపోయింది. సుమారు ఏడు గంటలకు నాకు పనసకాయ కూర, పప్పుచారుతో నాకు అన్నం పెట్టారు; మధ్యాహ్నం నాకు భోజనము లేని కారణముగా నేను శుభ్రముగా తినడము చూసి వారు ఆనందపడ్డారు. సరే, మీరు పడుకోండి, ఇదిగో దీపము... భయపడవద్దు మమ్మలను లేపండి అంటూ వారు వెళ్ళిపోయారు. నేను రెండు రోజులు గుడారాలు దగ్గరే ఉంటున్నాను. పెద్ద ముసలివాళ్ళు, పిల్లలు ఇక్కడే వుంటున్నారు. మధ్య వయస్సువారు, కుర్రవాళ్ళు అందరూ పట్నములకు పోయి ఆటలు, పాటలు నాగపాముల విన్యాసాలు చేసి ప్రజల నుండి డబ్బులు సంపాదిస్తుంటారు. సుమారు మూడు నెలలు వారితో గడిపాను. వారికి తెలుగు అక్షరాలు పలికే విధానము, పాళీ అక్షరాలు నేర్పుతూ మధ్య మధ్యలో బుద్ధుని పంచశీల, బుద్ధ వందనము వారితో పలికించుతూ ఉండేవాడిని. వాళ్ళు ప్రతి పదిరోజులకు వేరే ఊళ్ళకు వెళ్ళేవారు. వారితోనే నేను ప్రయాణం చేసేవాడిని. యువకులకు, బాలికలకు కరాటే తాయిచీ నేర్పేవాడిని. అది చూసి సింహళీలు కూడా తాయిచీ ఇష్టపడేవారు. సుమారు 15లక్షలు జనాభా తెలుగు నాగప్రజలు ఉన్నారు. ఈ కరోనా వలన వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మన భారతదేశంలో 14 కోట్లు తెలుగువారు ఉన్నారని ప్రత్యేకముగా రెండు తెలుగు రాష్ట్రాలే ఊన్నాయని వారికి తెలీదు.

'సామి, మమ్మల్ని అక్కడికి తీసుకుపో' అనీ బతిమాలుతున్నారు, నేనైతే "మీ ఆశ నెరవేరును గాక, ధర్మం కోసం మీరు ఈ శ్రీలంక నేలకు చేరారు. అదే ధర్మము మిమ్మలిని భారత్‌కి తీసుకువెళ్తుంది. మీరు వేరే వేరే పనులను చేపట్టండి. మీ ఆకలే మీకు పనులను నేర్పుతుంది. తోలుబొమ్మలాటలు ఇప్పుడు ఎవరూ చూడరు, పాములాటలు ఎవరికీ నచ్చటములేదు, కోతికప్పగంతులు మనిషికి పట్టటం లేదు. మనిషి చాలా అందని ఆకాశంలో విహరిస్తుంటే మీరు క్రీస్తు పూర్వపు ఆటలు, డ్రామాలు ఆడటం మంచిది కాదు, మారండి. బౌద్ధం అంటేనే మార్పు, శాస్త్రీయత, పని, జ్ఞానము, యోగము. నేను మరలా కలుస్తాను. మిమ్మలను నేను వదలనులే, ప్రపంచానికి మన నాగజాతి దీనస్థితిని తెలుపుతాను" అనీ, చెప్పాను వారిని విడిచి మరల నా పాదయాత్ర ప్రయాణము సాగింది ఇలా...

మన అమ్మనుడితోనే మనకు గుర్తింపు

వి. ఎం. సుబ్రహ్మణ్య శర్మ
9866707774

మసక బారుతున్న ఎరుకల నుడి





'భాషా విధ్వంసం జాతి విధ్వంసానికి మూలం' అనే నినాదాన్ని అర్థం చేసుకున్నపుడే 'అమ్మభాషలన్నీ అమృతభాషలుగా నిలిచిపోతాయి'.

ఉపోద్ఘాతం:

గత ఐదు వందల యేండ్లల్లో సగానికి పైగా మానవ భాషలు అంతరించి పోయాయని, ప్రస్తుతం మిగిలి ఉన్న ఏడువేల భాషల్లో మరో సగం భాషలు అంతరించి పోయే ప్రమాదం ఉందని అంచనా (సస్సే, 1990). భారత దేశంలో కూడా కొన్ని భాషల్ని అంతరించిపోయే భాషలుగా గుర్తించి వాటిపైన పరిశోధనలు జరుగుతూ ఉన్నాయి. కొన్ని మాతృభాషలు మృతభాషలుగా మారడం, మృతభాషలు తిరిగి పునరుజ్జీవం పోసుకోవడం చరిత్ర పరిశీలిస్తే తెలిసే విషయాలు.

నేటి ఆధునిక వైజ్ఞానిక యుగంలో మనిషి సృష్టిస్తున్న ఆవిష్కరణల్లో కృత్రిమ మేధ ఒక అద్భుతం. ఈ నేపథ్యంలో మనిషి అనేక కృత్రిమ భాషలను సృష్టించాడు, నేర్చుకున్నాడు, వాటిని సంగణక యంత్రాలు అర్థం చేసుకొనే రీతిలో తీర్చిదిద్దాడు. ఇది ఒక పార్శ్వం అయితే మాతృభాషలను నిర్లక్ష్యం చేయడం వల్ల రాబోయే పెను విపత్తులను గుర్తించి సమాజాన్ని మేల్కొల్పడంలో పూర్తిసమయం వెచ్చించి స్వచ్ఛందంగా పనిచేస్తున్న భాషాశాస్త్రజ్ఞుల అమ్మనుడి బలగం ఒక వైపు, తెలుగు భాషోద్యమ సమాఖ్య తదితర అమ్మనుడుల బలగం మరోవైపూ మొహరించి ఉన్నప్పటికీ కొన్ని అమ్మనుడులు త్వరితగతిన అంతరించిపోనున్నాయి అనే విషయాన్ని జీర్ణించుకోక తప్పటంలేదు.

నేపథ్యం:

తెలుగు, తమిళ, కన్నడ భాషలతో పాటే మూలద్రావిడ భాషనుంచి వేరుపడిన ఎరుకల భాష (రావు, రూస 2.0. ఉపన్యాసం,2020) నీలగిరి ప్రాంతంలో ఆవాసం ఏర్పరుచుకొని ఉన్న భాషాసమూహం. వీరు త్రిప్పట జీవనం చేయవలసిన పరిస్థితులు ఏర్పడడానికి కారణాలను పరిశీలిస్తే, ముఖ్యంగా ఆంగ్లేయుల, మహమ్మదీయుల దండయాత్రలలో యుద్ధసామగ్రిని మోసుకుపోవటమూ, వారి సైన్యాలకు దారులు ఇచ్చేందుకు తాము నివసించే ప్రాంతాలనుండి తొలగిపోవటమూ, వారి ఆధిపత్యపు పోరాటాల మధ్యన నలిగిన జీవితాలూ పోగొట్టుకున్న నివాసాలూ. చివరికి వారు త్రిప్పట జీవనానికి అలవాటు పడడం జరిగింది. మన దేశసంపదను కొల్లగొట్టి వారి దేశాలకు ఎగుమతి చేసుకోవడం కోసం నిర్మించుకున్న రోడ్లూ, రవాణా వ్యవస్థలూ వీరి సాంప్రదాయక వనవాసాల నివాసాలనుండి జనసమూహాలను చెల్లాచెదురు చేశాయి. మనమీదే దండెత్తి అక్కడ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేసి బానిసలుగా చేసుకొని యుద్ధ సమయాల్లో వీరందరిని ఉపయోగించుకోవడం వల్ల వాళ్ళ స్వస్థలాలనుండి బ్రతికి బట్టకడితే చాలు అనే ఉద్దేశ్యంతో వీరు వివిధ ప్రాంతాలకు తరలిపోవడం జరిగింది. ఇదంతా జరగకుండా ఉంటే తెలుగు, తమిళ, కన్నడ భాషలలాగానే ఎరుకల కూడా అభివృద్ధి సాధించేదే. పైన చెప్పినదంతా కూడా స్వాతంత్ర్యం రాకముందు జరిగినది, మరి ఇప్పటికీ ఈ గిరిజన భాషలు ఎందుకు అభివృద్ధి చెందలేకపోతున్నాయి అనేదే సమస్య.

తెలుగులాంటి భాష కూడా లిఖిత సంప్రదాయం ఉండి ఎంతో సాహిత్యం ఉన్న, మాతృభాషలో విద్యావిధానం కుంటుబడటం, ఆంగ్ల

భాషలో చదివితే ఉద్యోగాలొస్తాయి అనే భ్రాంతి, ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి విషయాలను పట్టించుకోకపోవడం తర్కం, ముందుచూపు లేని కారణాల వల్ల ఇంకా మనం పరాయి భాషా సమూహాల చేతుల్లో కీలుబొమ్మలుగానే ఉండి గమ్యం లేని కీకారణ్యంలోకి ప్రవేశిస్తున్నాము. ఈ సందర్భంలో ఎరుకల లాంటి విలక్షణమైన భాషను పరిరక్షించడానికి మాతృభాషా మాధ్యమమే కీలకం అనే విషయాన్ని ఈ పత్రం విశ్లేషిస్తుంది.

ఎరుకల భాష:

'ఎరుకలనుడి' ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని భాషాశాస్త్రజ్ఞుల గుర్తించారు. ఎరుకలు పలురకాల పేర్లతో (కుఱ్ఱు, కొరవ, కొరచ, కొర, కైకాడి, కొరమరాల్, నిద్దనారు, వెల్లాలు) పలు రాష్ట్రాల్లో నివసిస్తున్నారు. ఎరుకలు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో నివసిస్తున్నారు. శ్రీలంకలో కూడా వీరు నివసిస్తున్నట్టుగా కుఱ్ఱు మాస పత్రిక (2005) పేర్కొంది. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎరుకలు దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఉన్నారు. 1991 లెక్కల ప్రకారం వీరి జనాభా 3,87,898 కాగా అక్షరాస్యతా శాతం కేవలం 25.74 మాత్రమే** (ఐటిడిఏ: ఏటూరి నాగారం). అక్షరాస్యతా శాతం తక్కువగా ఉండటానికి కారణాల్ని పరిశీలిద్దాం.

అసలు సమస్య :

ఎరుకలు అందరూ ద్విభాషీయులు. ఎరుకల, తెలుగు భాషలు మాట్లాడగలుగుతారు. ఒకే భాష మాట్లాడేవారికంటే రెండూ అంతకంటే ఎక్కువ భాషలు మాట్లాడేవారి మెదడు చురుగ్గా పనిచేస్తుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అయితే ఎరుకలకు ఎరుకల మాధ్యమంలో ప్రత్యేకమైన పాఠశాలలు లేని కారణంగా వారి ప్రాథమిక విద్యాభ్యాసం అంతా కూడా తెలుగు (ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో) మాధ్యమంలో జరుగుతోంది. గత కొంతకాలంగా పేరుకు ఆంగ్ల మధ్యమం కూడా తయారైంది. లిఖిత సాహిత్యం ఉన్న తెలుగులాంటి భాషలే అనవసర ఆంగ్ల మాధ్యమ ప్రభావాన్ని ప్రాథమిక స్థాయి వరకు ఆపలేకపోతున్న సందర్భంలో లిఖిత సాహిత్యం లేనిదీ అల్పసంఖ్యాక వర్గ భాషగా ఉన్న ఎరుకల నుడి ఆంగ్ల ప్రభావాన్ని తట్టుకొని తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం చాలా కష్టం. ఎరుకలు తెలంగాణలో అన్ని జిల్లాల్లోనూ, అన్నీ గ్రామాల్లోనూ ఉన్నప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే వీరు సమూహంగా ఉన్నారు. చాలావరకు గ్రామానికి ఒకటి, రెండు కుటుంబాలే కనపడతాయి. అంటే ఎరుకలు తన మాతృభాషను ఉపయోగించే అవకాశం కేవలం తన కుటుంబ సభ్యులతోనే. ఒకవేళ ఆ కుటుంబం మొత్తం కూడా తెలుగు భాషలోకి క్రమేపి మారితే ఇక కుఱ్ఱు భాష బ్రతికి బట్టకట్టే అవకాశం ఉండకపోవచ్చు. ఇదేదో నిరాశా దృక్పథంతో చెబుతున్నది కాదు. దీనికి కొన్ని దృష్టాంతాలు కనబడుతున్నాయి.

ఒకప్పుడు ఎరుకలలో 18 రకాల వృత్తులు ఉన్నాయని చెబుతారు (భీమమ్మ,2017). అందులో ప్రస్తుతం కుంచె ఎరుకల, దబ్బఎరుకల, ఈతపుల్ల ఎరుకల లాంటి మూడు, నాలుగు వృత్తులే కనపడుతున్నాయి. **ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే, మిగిలిన 14 రకాల వృత్తులూ వాటి తాలూకు విజ్ఞానాన్ని ఎరుకలవారే కాకుండా మొత్తం మానవ సమాజం కోల్పోయింది.** ఎరుకలలో స్త్రీలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. సోదె చెప్పడం అనేది కేవలం కొంతమంది స్త్రీలు మాత్రమే చెప్పగలిగిన వృత్తి. ఈ వృత్తి కూడా త్వరలో అంతరించిపోయే స్థితిలో ఉంది. ఈ మధ్యలో తెలంగాణలో ఎరుకల భాష గురించి చేసిన సర్వేలో తెలిసిన విషయం ఏమిటంటే- తెలుగు మాధ్యమంలో వీరు విద్యాభ్యాసం చేసే విధానంలో 5, 6, 7 తరగతుల వరకు తెలుగు చదవడం, రాయడం, నేర్చుకోవడంలో ఇబ్బందులు పడటమనేది ప్రాథమికంగా ఉన్న సమస్యగా చెప్పారు. పాఠశాలల్లో ఇటువంటి విద్యార్థులకు వారి మాతృభాషలో ప్రత్యేక తరగతులు నిర్వహించ లేకపోవడం కూడా వీరికి అడ్డంకిగా మారుతోంది. చురుకైన పిల్లలు చదువులో ముందుకెళ్తున్నారు. మిగిలినవారు చదువుకి దూరం అవుతున్నారు. మరి కొంతమంది తల్లిదండ్రుల అభిప్రాయంలో తెలుగు మాధ్యమంలో చదివించినా ఏదో ఒక స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో చదువక తప్పదు కాబట్టి, ముందే ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తే ఇబ్బంది ఉండదనే దురభిప్రాయంతో ఉన్నవారు కొందరు.

పాఠ్యప్రణాళికలు-పరివర్తనభాషా మాధ్యమం: తెలుగుతో పెనవేసుకొని ఉన్న వీరి జీవన విధానాన్ని సరిగ్గా అర్థం చేసుకొని వీరికి తార్కికమైన పద్దతిలో, రాజ్యాంగబద్ధంగా ఎవరి మాతృభాషలో వారిని ప్రాథమిక విద్యాభ్యాసం చేసే హక్కును కలిగించే విధంగా ఒక ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉంది. అది ఏ విధంగా ఉండాలంటే – ఎరుకల భాషీయులకు (ఇతర అల్పసంఖ్యాక గిరిజన భాషీయులకు) ఒకటో తరగతి నుండి మూడవ తరగతి వరకు పూర్తిగా వారి మాతృభాషలోనే బోధించడం జరగాలి. తద్వారా వారికి ఇంటి భాషే బడిలో వాడడం వల్ల చదువు పట్ల సహజమైన ఆసక్తి కలుగుతుంది, జీవితం పట్ల సరైన దృక్పథం ఏర్పడుతుంది. స్వేచ్ఛగా మాట్లాడడానికీ, అడగడానికీ అవకాశం ఉంటుంది. నాలుగవ తరగతిలో మాతృభాషతో పాటు తెలుగుని నేర్పుతూ ఆంగ్ల భాషను పరిచయం చేయాలి. అప్పటికే ఎరుకల నుడిని తెలుగులిపిలో చదవటం రాయటం నేర్చివుండటంతో తెలుగును చదవడం రాయటం ప్రత్యేకంగా నేర్చుకోవలసిన అవసరం కలుగదు. ఇక్కడ మాతృభాష శాతాన్ని తగ్గించుతూ తెలుగు శాతాన్ని పెంచాలి. అదే విధంగా ఐదవ తరగతిలో తెలుగు శాతాన్ని మరింత పెంచి ఆంగ్ల భాషను ఇంకొంచెం పెంచాలి. అంటే పాఠ్య ప్రణాళికలు పరివర్తనభాషా మాధ్యమంగా ఉండాలె. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే ఎరుకల లాంటి భాషల్లో, బాగా అభివృద్ధి చెందిన భాషల్లో లాగా పదసంపద సమృద్ధిగా ఉండదు. వెయ్యి, పదిహేను వందల పదాలు దొరికితే ఎక్కువ కాబట్టి వారికి మాతృభాషలో ఐదవ తరగతిపైన పుస్తకాలు తయారు చేయగలిగే అవకాశం తక్కువ. కాబట్టి తెలుగులో చదవడం, రాయడంతో పాటు అవగాహన చేసుకునే సామర్థ్యంకూడా ఉంటుంది కాబట్టి ఇంటరు వరకు తెలుగు మధ్యమంలో విద్యాభ్యాసం జరిగేలా చూస్తే అప్పటివరకూ ఆంగ్ల

తరువాయి 32వ పుటలో....

డా. చంద్రయ్య ఎస్
9963709032

సాంకేతికయుగంలో
తెలుగు సాంస్కృతిక పదకోశ నిర్మాణం–కొన్ని ఆలోచనలు

(తెలుగు సంస్కృతీ సంబంధమైన పదజాలాన్ని ఒకచోట కోశస్థం చేయాలనే ఆలోచన ఈ కోశనిర్మాణానికి ప్రేరణ. ఈ ప్రయాణంలో కొన్ని ఆలోచనల్ని పాఠకులముందు చర్చకు పెట్టడమే ఈ వ్యాసోద్దేశం)

'**ఒక** జాతి జీవనవిధానం ఆ జాతి సంస్కృతి'గా అర్థం చేసుకోవచ్చు. తెలుగు సంస్కృతి ఎప్పుడూ ఏకశిలాసదృశంగా లేదు. అది భారతీయ సంస్కృతితో భిన్నిస్తూనే ఆ సంస్కృతితో ఐక్యమయ్యే సామాన్యగుణాల్నీ, వెసులుబాటునూ(flexibility) కలిగినటువంటిది. ప్రాచీనకాల తెలుగు సంస్కృతికి ఆధారాలు– శాసనాలు, నాణేలు, తాళపత్రాలు, రాతప్రతులు, కావ్యాలు. వీటితోపాటూ నిర్మాణకళాసంస్కృతికి కట్టడాలూ బహుళ ప్రయోజనకారులు. ప్రాచీన తెలుగు సంస్కృతిని పట్టిచూపించే పదజాలంతో ఒక వివరణాత్మక కోశాన్ని నిర్మించాల్సిన అవసరం ఈ ప్రపంచీకరణ యుగంలో చాలా ఉంది. తెలుగులో ఇప్పటివరకు వెలువడిన నిఘంటువులకంటే 'సాంస్కృతిక పదకోశం' విభిన్నమైంది. ఇది ప్రాచీన భారతీయ సంస్కృతిలో భాగమైన తెలుగువారి సంస్కృతిని పదాలరూపంలో పట్టిచూపుతుంది. మానవుని సకల భావనలనూ, విలువల్నీ, వస్తుసంస్కృతినీ అక్షరరూపంలో (లిపిలేని భాషల్లోనైతే ధ్వనుల రూపంలో) భద్రపరుస్తూ భాషే మూల ఆకరంగా ఉంటుంది. మన ప్రాచీనుల ఆచార వ్యవహారాలు, పుట్టుక, చావు, కర్మకాండలు, ఆధ్యాత్మిక విధానాలు, పూజా పద్ధతులు, వివాహాది శుభకార్యాలు, అలంకరణ విశేషాలు, ఆహారపు అలవాట్లు... ఇలాంటి ఎన్నో అర్థక్షేత్రాల(semantic fields)కు సంబంధించిన విరాట్‌రూపాన్ని సంకలించే ప్రయత్నానికి బీజావాపనమే ఈ పదకోశం. దీన్ని శాసనాలు, నాణేలు, తాళపత్రాలు, రాతప్రతులు, కట్టడాలు, లిఖిత సాహిత్యం ఇలా ప్రధానంగా లభ్యమయ్యే ఆకరాల సహాయంతో ఐదు దశల్లో తయారుచేయవచ్చు. ఒక పదానికి సంబంధించిన వివరాలకోసం సమాంతరంగా ఈ ఐదు ఆకరాల సహాయం (references) తీసుకునే అవకాశం ఎలాగూ ఉంటుంది. మొదటిదశలో ప్రాచీన తెలుగు సాహిత్యంలో సంస్కృతీ ప్రధానమైన కావ్యాలను అధ్యయనం చేయడాన్ని కేంద్రీకరించి ఈ వ్యాసం రాయబడింది. రెండోదశలో చారిత్రక ఆకరాలైన శాసనాలు, నాణేలు, ఇతర రాతపూర్వక ఆకరాలను అధ్యయనం పరిధిలోకి తీసుకొంటుంది. స్థూలంగా ఈ ప్రణాళికతో ఈ కోశ నిర్మాణం తయారుచేస్తే బాగుంటుంది.

"మన తాత, ముత్తాత లెట్టివారై యుండిరో మన అవ్వలు ఎట్టి సొమ్ములు దాల్చిరో, యెట్టి అలంకరణములతో నుండిరో, మన పూర్వులకు ఏ దేవతలను గొలిచిరో, ఏ విశ్వాసాలు కలిగియుండిరో, ఏ యాటపాటలతో వినోదించిరో, దొంగలు, దొరలు దోపిడీలు చేసినప్పుడు క్షామాదీతి బాధలు కలిగినప్పుడెటుల రక్షణము చేసుకొనిరో, జాడ్యాలకు ఏ చికిత్సలు పొందిరో, ఎట్టి కళలందు ప్రీతి కలవారై యుండిరో, ఏయే దేశాలతో వ్యాపారాలు చేసిరో అవన్నీ తెలుసుకొనవలెనని మనకు కుతూహలముండును"(ఆంధ్రుల సాంఘిక చరిత్ర ముందుమాట: v) అని మాన్యులు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారి మాటల్ని ఈ సందర్భంలో గుర్తుచేసుకోవడం అవసరం.

తెలుగు ప్రజలు ప్రకృతితో చేసే సహవాసం, యుద్ధం వల్ల అనేక సంస్కృతీసంబంధమైన కార్యకలాపాలను (rituals, customs & beliefs) తమ తమ జీవితాల్లో భాగం చేసుకున్నారు. ఆ క్రమంలో వారు నిర్మించుకున్న సాంస్కృతిక పదసంపద ఎంతో విలువైంది, విస్తృతమైంది. ఇదంతా వారి జీవన, తాత్త్విక విలువలకూ ఆలోచనలకూ నిలువుటద్దం. తెలుగుప్రజల సాంఘికచరిత్రను రాయాలనుకునేవారికి ఇటువంటి పదకోశాలు ఎంతో ఉపయుక్తాలవుతాయి. ఎన్నో వేల ఏళ్ళ చరిత్ర కలిగి సంపద్వంతమైన తెలుగు సాంస్కృతిక పదజాలాన్ని ప్రత్యేకకోశంగా నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. భాష, సంస్కృతి అవినాభావ సంబంధులు కనుక, తెలుగు సాంస్కృతిక పదజాలాన్ని కోశంగా కూర్చుకోవటమంటే తెలుగు సంస్కృతిని, ప్రజల సాంఘిక చరిత్రాదులను పరిరక్షించుకోవటమే అవుతుంది.

తెలుగు నిఘంటు వికాస క్రమాన్ని తరచి చూస్తే ఒక్కో నిఘంటువు ఒక్కో అవసరంతో పుట్టుకొచ్చినట్టు తెలుస్తుంది. తెలుగులో పద్య నిఘంటువులతో మొదలైన నిఘంటు నిర్మాణం మాండలిక రచనలను అర్థం చేసుకోవటం కోసం ప్రత్యేక పదకోశాలు నిర్మించుకునేంత విస్తృత రూపాన్ని ధరించింది.

శ్రీ వేంకటేశాంధ్రము, ఆంధ్రనామ సంగ్రహము, క్యాంబెల్ నిఘంటువు, బ్రౌణ్య నిఘంటువు, సాంబ నిఘంటువు, శబ్ద రత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువు మొదలైన ఎన్నో నిఘంటువులు అవతరించాయి. తెలుగు అకాడమీ ఏర్పాటైన తరువాత అనేక అవసరాలను తీర్చే క్రమంలో ఎన్నో నిఘంటువులు వెలువడ్డాయి. ముఖ్యంగా మాండలిక నిఘంటువులు ప్రజల భాషకు, దేశీ భాషకు దగ్గరగా వెళ్లాయి. ఆదిభట్ల నారాయణదాసు గారు 1964లో కూర్చిన 'సీమ పలుకు వహి', 1970లో తెలుగు అకాడమీ వారు ముద్రించిన మరుపూరి కోదండ రామిరెడ్డి గారి 'మాండలిక పదకోశం', జి. ఎస్. చలం గారి 'కళింగాంధ్ర మాండలికం', వెలగా వెంకటప్పయ్య గారి 'రాయలసీమ పలుకుబడులు' సి. వి. బాలకృష్ణ శర్మ గారి 'శ్రీకాకుళం ప్రజల భాష', అత్తలూరి నరసింహారావు గారి

'రావి శాఖీయం', డా. నలిమెల భాస్కర్ గారి 'తెలంగాణ పదకోశం', డా. ముదిగంటి సుజాతారెడ్డి గారి 'తెలంగాణ వ్యవహార పదకోశం' మొదలైన కోశాలు వెలువడ్డాయి. మాండలిక వృత్తి పదకోశాలు, వ్యుత్పత్తి కోశాలు, తెలుగు సంస్కృతి పేరుతో వెలువడిన విజ్ఞాన సర్వస్వాలు, పద ప్రయోగ సూచీలు మొదలైనవి ఎన్నో అవసరాలను తీర్చాయి. ఈ వ్యాసకర్త 'తెలంగాణ సాహిత్య అకాడమీ వారికి సమర్పించిన "తెలంగాణ సాంస్కృతిక పదకోశం" ఈ ఆలోచనల్తో వెలువడిన మొదటి తెలుగు సాంస్కృతిక పదకోశం.

మొదటి దశలో ప్రాచీన సాహిత్యం ఆధారంగా ఈ కోశనిర్మాణం జరగాలనే ముఖ్య ఉద్దేశంలో ఈ ఆలోచనల్ని మీతో పంచుకొంటున్నాను. "కావ్య ప్రబంధాలలో నూటికి తొంభై పాళ్లు సాంఘిక చరిత్రకు పనికి వచ్చినవి కావు. ఈ పురాణాలు మధ్య కాలపు ప్రబంధాలు ఎందుకు పనికిరావు"(ఆంధ్రుల సాంఘిక చరిత్ర ముందుమాట: x) అన్న వారి మాట అక్షర సత్యం. "ఒక్కొక్కమారు కొన్ని పుస్తకాలు పూర్తిగా చదివిన మనకు పనికి వచ్చు మాటలు రెండో మూడో దొరుకును అంతే"(ఆంధ్రుల సాంఘిక చరిత్ర ముందుమాట: xi) కనుక ఈ పదకోశ నిర్మాణంకోసం ప్రాచీన తెలుగు గ్రంథాలనన్నింటినీ ముందేసుకొని చదవడం చేసిన పనినే మళ్ళీ చేయడమౌతుంది. ఇది "గడ్డివామిలో సూది"వంటిది. ఈ కోశ నిర్మాణంకోసం మొదటగా పెద్దలు సురవరం ప్రతాపరెడ్డిగారు తన ఆంధ్రుల సాంఘికచరిత్రకోసం సంప్రదించిన ఈ కింది ప్రాచీన గ్రంథాలనే ప్రధాన ఆకరాలుగా తీసుకొంటే బాగుంటుంది.

తెలుగు భారతము-విరాటపర్వం వరకు, అభిలషితార్థ చింతామణి-చాళుక్య సోమేశ్వరుడు-మైసూరు విద్యాపీఠ ప్రచురణము మొదటి సంపుటం), క్రీడాభిరామము, కాకతీయ సంచిక- ఆంధ్రేతిహాస పరిశోధక మండలి, పల్నాటివీర చరిత్ర- అక్కిరాజు ఉమాకాంతం గారి ముద్రణ, ఉత్తర హరివంశము- నాచన సోమన, ప్రతాప చరిత్రము-ఏకామ్రనాథుడు, దశకుమార చరిత్ర- కేతన, నీతిశాస్త్ర ముక్తావళి- భద్రభూపాలుడు, పండితారాధ్య చరిత్ర, బసవపురాణము, శ్రీనాథుని కృతులు-చాటువులు, భోజరాజీయము- అనంతామాత్యుడు, కేయూరబాహు చరిత్ర- మంచన, ఎఱ్ఱాప్రగడ- నృసింహాపురాణ, ఉత్తర హరివంశ కృత్యాది పద్యాలు, రెడ్డి సంచిక- రాజమహేంద్రవరము ఆంధ్రేతిహాస పరిశోధక మండలి, హరిశ్చంద్ర, నవనాథ చరిత్ర- గౌరన, శుకసప్తతి- పాలకవేరి కదిరీపతి, వైజయంతీ విలాసం-సారంగు తమ్మయ్య, పాండురంగ మాహాత్మ్యము-తెనాలి రామకృష్ణ కవి, మల్లన చరిత్ర- పెదపాటి యెఱ్ఱనార్యుడు, సాంబోపాఖ్యానము-రామరాజు రంగప్ప, విప్రనారాయణ చరిత్ర-చదలవాడ మల్లన, చంద్రభాను చరిత్ర- తరిగొప్పుల మల్లన, నిరంకుశోపాఖ్యానము-సంకుసాల రుద్రకవి, అప్పకవీయము-కాకనూరి అప్పకవి, వేంకట నాథుడు- పంచతంత్రము, వెలుగోటి వంశావళి (మద్రాసు యూనివర్సిటీ ప్రచురణము), వేమన పద్యాలు, విశ్వగుణాదర్శము- వెంకటాధ్వరి (సంస్కృత మూలం), సింహాద్రి నారసింహ శతకము- గోగులపాటి కూర్మనాథ కవి, భద్రాద్రి శతకము-చల్లాపేర కవి, చంద్రశేఖర శతకము (నెల్లూరు భాష), రామలింగేశ్వర శతకము-ఆడిదము సూరకవి, వేణుగోపాల శతకము, భాస్కర శతకము, హంస వింశతి- అయ్యలరాజు నారాయణ కవి, దశకుమార చరిత్ర, నృత్త రత్నావళి- జాయపసేనాని, విజయనగర రాజ్య సాంఘిక చరిత్ర పేరుతో సలటోర్ అనే అతడు రెండు సంపుటాలు, సారంగు తమ్మయ్య- వైజయంతీ విలాసము, గౌరన- హరిశ్చంద్ర ద్విపద, కదిరీపతి- శుక సప్తతి, భాషీయ దండకము-గండూరు నరసింహకవి-కర్నూలు, కుక్కుటేశ్వర శతకము-కూచిమంచి తిమ్మకవి, గువ్వల చెన్న శతకము, కాశీయాత్ర చరిత్ర-ఏనుగుల వీరాస్వామి, ఏనుగుల వీరాస్వామి- కాశీయాత్ర చరిత్ర, రాజవాహన విజయము, గౌరన కృతులు, వేంకటనాథుని పంచతంత్రము, పాండురంగ విజయం, శ్రీకాళహస్తి మహత్యం, శ్రీనాథుని చాటువులు, పీఠికలు, పరమయోగి విలాసము(ద్విపద)- తాళ్ళపాక చిన్నన్న, సింహాసన ద్వాత్రింశిక-కొరవి గోపరాజు, సిద్ధేశ్వర చరిత్ర, నీలాసుందరి పరిణయం, సింహగిరి వచనములు, యయాతి చరిత్ర మొదలైనవి.

పై గ్రంథాలకు సమకాలీనంగా వెలువడిన చారిత్రక గ్రంథాలను కూడా పరిశోధించాల్సి ఉంటుంది. పైవన్నీ భిన్న చారిత్రక దశలనూ, వైవిధ్యమైన సాంఘిక, మత పరిస్థితులనూ, విభిన్న భాషాసాంస్కృతిక వారసత్వంగల రాజవంశాలనూ ప్రతిబింబించిన పద్య, వచన కావ్యాలు. కనుక మొదటదశలో పై గ్రంథాలను దృష్టిలో ఉంచుకొని సాంస్కృతిక పదసేకరణ చేస్తే సురవరంవారు చెప్పినట్టు సమయం, శ్రమా వృధాకాకుండా విలువైన, మౌలికమైన సాంస్కృతిక సంపదను 'నమోదు'చేసినవాళ్ళమవుతాం. ఇటువంటి కోశనిర్మాణంలో భాగంగా వర్ణనాప్రధాన కావ్యమైన 'కుమార సంభవము' గ్రంథాన్ని ఆకరంగా తీసుకొని పనిచేసినప్పుడు ఈ వ్యాసకర్తకు అటువంటి చేదు అనుభవమే ఎదురైంది. స్వీయ అనుభవంలోంచి వర్ణనా ప్రధానమైన కావ్యాలను సంప్రదించకుండా ఉండటమే ఈ దశలో మంచిదని అభిప్రాయం. ఈ పద్ధతిలో ఆయా యుగ సాంస్కృతిక స్వభావాల్ని చిత్రీకరించిన కనీసం 50 రచనల్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అప్పటికి ఈ కోశం రెండోదశ ఐన శాసనాది ఆకరాల అధ్యయనంలోకి వెళుతుంది. ఈ రెండు దశల్లో వచ్చిన సమాచారంతో ఈ కోశం గమ్యం చేరుతుందనిపిస్తోంది.

దేన్ని సాంస్కృతిక పదంగా గుర్తించాల్సి ఉంటుంది అనే ఎరుక కోశకర్తలకు స్థూలంగానైనా ఉండాలి. 'తెలుగు సంస్కృతి' అనే సాంకేతిక పదాన్ని తెలుగు ప్రజల జీవన విధానపు బహుళ కోణాలను ఆవిష్కరించే ఒక సామూహిక సంజ్ఞగా గ్రహించవచ్చు. తెలుగు సాంస్కృతిక పదసేకరణను ప్రాచీన తెలుగుగ్రంథాల ఆధారంగా స్థూలంగా కొన్ని వర్గీకృతాంశాలుగా/అర్థ క్షేత్రాలుగా వింగడించుకోవచ్చు. ఉదా: మతం-ఆధ్యాత్మిక ఆచరణ, కులం, పండుగలు, జాతరలు, ఆచారవ్యవహారాలు, వస్త్రధారణ, విశ్వాసాలు, అలంకరణలు, ఆహారపు అలవాట్లు, చావు, పుట్టుక, వివాహం, కర్మకాండలు, వినోద క్రీడలు, కళారూపాలు, వృత్తికళాకారులు, చిత్రలేఖనం, వాయిద్యాలు, చేతి వృత్త్యాధారిత కార్యకలాపాలు మొదలైనవి ప్రధానంగా అధ్యయనం చేసే అర్థక్షేత్రాలు (semantic fields). వీటిలో అంతర్భాగమయ్యే మరెన్నో ఉపాంశాలను ఈ కోశ

పరిధిలోకి తీసుకోవచ్చు. ప్రణాళికను చలనశీలనంగా (dynamic) మార్పులుచేర్పులు చేసుకునే వెసులుబాటు ఎప్పుడూ ఉంటుంది.

1. సాంస్కృతిక పదకోశనిర్మాణం-సాంకేతిక అనువర్తన

ఇప్పటికి అందుబాటులో ఉన్న చాలా నిఘంటువులు వివిధకాలాల్లో, విభిన్న అవసరాలను తీర్చేక్రమంలో పుట్టుకొచ్చాయి. ఇవి సంప్రదాయపద్ధతుల్లో అంటే, వ్యాకరణ విభాగం, అర్థం, ప్రయోగం, ఆకర వివరాలు అనే పద్ధతిలో (format) నిర్మాణమయ్యాయి. అప్పటికి డిజిటల్ రంగం అంతగా అభివృద్ధిచెందకపోవడంవల్ల పుస్తకరూపంలో ముద్రించాలనే ఉద్దేశమూ నిఘంటుకారులకుండేది. పదానికి సంబంధించి-వివరణాత్మకత, ఇతర విశేషాలు ఇవ్వడంలో ఉండే విస్తరణాభీతివల్లా ముద్రణాసంబంధిత ఆర్థిక కారణాలవల్లా అర్థవంతంగా సంక్షిప్తంగా ముగించేవారు. సాంకేతికత బాగా అభివృద్ధి చెందిన తరువాత పరిస్థితి మారింది. పుస్తకం ముద్రించాల్సిన అవసరంలేకుండానే డిజిటల్ వేదికమీద కొన్ని లక్షల పేజీల సమాచారాన్నైనా అత్యంత తక్కువ ఖర్చుతో పొందుపరుచుకోవచ్చు. ఒక పదానికి సంబంధించి ఇచ్చే వివరణల్లో లేదా ఇతర విశేషాలను పొందుపరిచే క్రమంలో ఎటువంటి 'విస్తరణాభీతి' అక్కర్లేని అవకాశాన్ని ఈరోజు సాంకేతికత కల్పించింది. 'ఈ పుస్తకంలో ఏవైనా పొరపాట్లు జరిగినట్టు మా దృష్టికి తీసుకొస్తే వాటిని మలిముద్రణలో సవరిస్తాం' లాంటి విన్నపాలకు కాలంచెల్లిపోయింది. పాఠకులు మలిముద్రణవరకు వేచి ఉండే అవసరంలేదు. అర్థనిర్ణయానికి, అక్షర, ఆకర దోషాలకు సంబంధించీ ఏవైనా ఏమరపాట్లు, పొరపాట్లు దొర్లినట్టు గుర్తిస్తే, వాటిని ఏ క్షణంలో సరిదిద్దుకునే మరో గొప్ప అవకాశాన్ని ఈ డిజిటల్ నిఘంటువు కల్పిస్తోంది. డిజిటల్ నిఘంటువు అనేక నిఘంటువుల సమాహారిణి. ఒకే పదాన్ని వివిధ అర్థచ్ఛాయల్తో, పర్యాయ పదాల్తో, నానార్థ భేదాల్తో, ధ్వనిరూప వైవిధ్యాల్తో, అర్థవిపరిణామ రీతుల్తో, ప్రాచీనాధునిక తేడాల్తో, చారిత్రక గతుల్తో, మాండలికాల్లో ఉండే అన్నిరకాల తేడాల్తో, వివిధ భాషాభేదాల్తో ఇంకా మరెన్నో విశేషాల్తో ఒక్క క్షణంలోనే వందలకొద్ది నిఘంటువులనుంచి కావాల్సిన పద విశేషాల్ని క్షణాల్లో మన కళ్ళముందుంచే సాంకేతికత ఈరోజుల్లో అందుబాటులో ఉంది. దీన్ని నిరూపించిన అద్భుతమైన కృషికి నిదర్శనమే ఆంధ్రభారతి.కామ్ వెబ్‌సైట్. ప్రస్తుతానికి ఇది 50 నిఘంటువుల/కోశాల సమాహారిణి. దీంట్లో మరెన్నో నిఘంటువులు చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇది నిరంతరం జరగాల్సిన కృషి. ఆర్థిక, అంగ బలాల్ని సమకూర్చుకోవాల్సిన పరిస్థితి కూడా ఉంది. దీని బలం గురించి తెల్సుకున్న తరువాత దీన్ని ఉపయోగించుకోనివారు లేరంటే అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు. ఈ డిజిటల్ నిఘంటువు సమాహారిణిని సుసాధ్యం చేసిన శేషతల్పశాయిగారికి తెలుగు సమాజం రుణపడి ఉంటుంది.

ఈ సాంస్కృతిక పదకోశాన్ని 'డిజిటలీకరించడం'వల్ల పాఠకులు ఒక సాంస్కృతిక పదానికి రాసిన వివరణతో సంతృప్తి చెందకపోతే వారికి ఆ పక్కనే శ్రవణ రూపాన్ని (audio form), అవసరమైతే దృశ్యరూపాన్ని(photo & video links) పొందుపరిచే విధంగా డిజిటల్ నిఘంటువుల్లో వెసులుబాటు ఉంటుంది. ఉదా: 'కుమ్మి' (క్రీడాభిరామం, పంచమాశ్వాసం-46) అంటే చలికుంపటి. చలి బాధను తప్పించుకోవడానికి కుంపట్లను రాజేసుకోవడం మన దినచర్యలోని భాగమే. నేటికీ కొన్నిప్రాంతాల్లో ఈ రకమైన కుంపట్లను బాలింతల కాళ్ళదగ్గర చూస్తాం. ఇలా ఈ సాంస్కృతిక పదానికి ఎంత వివరణ రాసినా దాని ఛాయాచిత్రమో లేదా దృశ్యరూపమో చూపిస్తే తప్ప దానిలోని సంస్కృతీ పరమార్థం బోధపడదు.

పైన వివరించిన ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ ఈ సాంస్కృతిక పదకోశాన్ని నిర్మిస్తే బహుళ ప్రయోజనకారిగా ఉంటుంది. మొదటిదశలో ఆరోపం, అర్థవివరణలు (వర్ణనాత్మకంగా), ప్రయోగ వాక్యం, ఆకర విశేషాలు, సాంస్కృతిక విభాగం, ఇతర వివరాలు లేదా ఆకరాలు (photo, audio &video links) అనే క్రమంతో database రూపంలో దీన్ని నిర్మించుకుంటే తరువాతి దశలో కావాల్సినరీతిలో output రావడంకోసం programing రాసుకోవచ్చు. ఈ కోశం పదం, తదర్థవివరణలు తెల్సుకోవడంకోసం మాత్రమే ఉద్దేశించిన నిఘంటు నిర్మాణపద్ధతి కాదు. దీనిద్వారా బహుళ ప్రయోజనాలను సాధించాలనే ఆశయం ఉంది.

2. పుస్తక, డిజిటల్ రూపాల్లో సాంస్కృతిక పదకోశ స్వరూపం

సాంస్కృతిక పదకోశాన్ని పుస్తకరూపంలోనూ, డిజిటల్ వేదికమీదా రెండు రకాలుగా ముద్రించాలనుకుంటే ఇలా విడివిడిగా నిర్మించుకోవచ్చు. ఒక్కో కావ్యం నుంచి ఉదాహరణగా- మొదట, ఆరోప పదం, తరువాత దాని అర్థం వివరణాత్మకంగా ఇవ్వడం, ఆ తరువాత ప్రయోగ వాక్యం, గ్రంథ ఆకరం, చివరకు ఆ పదం సాంస్కృతిక విభాగాన్ని తెలిపే రూపం. ఈ వరుసను ఈ కింద పేర్కొన్న ఉదాహరణల్లో గమనించవచ్చు.

'క్రీడాభిరామము' నుంచి:

కాలాగుర్వము ఆ పేరుతో ఉన్న లేపనం. దీనిని చలిపోగొట్టుకోడానికి ఒంటికిపూసుకునేవారు. "ధూపోపచారంబులుం / గాలాగుర్వనులేపనంబులు..." (క్రీడాభిరామం, పంచమాశ్వాసం-48.). వస్తువు/స్థానిక విజ్ఞానం.

'ప్రతాపరుద్రీయము' నుంచి:

వీరజడలు సత్య నిరూపణకు చేసే అగ్నిప్రవేశానికి సిద్ధమవుతున్నప్పుడు వేసుకునే ఒకరకమైన జడ పద్ధతి. "అట్లగాదని దలంచితిరేని నీ కాంతతో గూడ నీ విప్రులందరము సొదలు జొచ్చువార" మని దీక్షపట్టి హరిద్రా వస్త్రములు దాల్చి వీరజడలల్లుకొని తమ గృహంబులు విప్పుకొని శపింప..." (ప్రతాపరుద్రీయము. చతుర్థాశ్వాసం.పు.41). ఆధ్యాత్మికం/ఆచారం.

'సిద్ధేశ్వరచరిత్రము' నుంచి:

కుంటెన వేశ్యల తార్పుడుకత్తె. "కుంటెనగాఁ బంపెఁగొదలేక యొకడు/వింటcగొట్టె నొకండు వెరవక మిమ్ము" (సిద్ధేశ్వర చరిత్రము.పు.8). కులం/కులవృత్తి/వేశ్య.

'కుమార సంభవము' నుంచి:

ఉప్పు పెరిక ఉప్పుతో నిండిన గోనె మూట లేదా సంచి. వీటిని పూర్వకాలంలో ఎద్దుల వీపులపై వేసుకొని ఒకచోటు నుంచి

మరో చోటుకి తీసుకెళ్ళేవారు."...ఁబోతుమీఁద నడ్డంబు పడి యుప్పుఁ బెరికవోలె వెరచి పరచె జముడు.''(కుమార సంభవము. ద్వితీయాశ్వాసం.73). సామాజికం/వస్తువు.

ఈ కోశాన్ని డిజిటలైజ్ చేసి అంతర్జాలంలో పొందుపరిస్తే (up-load) కనిపించే రూపం 'ఆంధ్రభారతి నిఘంటువు'లా ఉంటుంది. దానికోసం తయారుచేసుకోబోయే Database ఈ కింది విధంగా ఉండాలి. (సాంకేతిక నిపుణుల సూచనలతో ఈ ఫార్మాట్లో మరిన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది).

3. సాంస్కృతిక పదకోశ ప్రయోజనాలు, లక్ష్యం

ఏ పదకోశమైనా నిర్దిష్ట ప్రయోజనం, లక్ష్యంతోనే నిర్మాణమౌతుంది. ఈ సాంస్కృతిక పదకోశానికీ ఈ కింది నిర్దిష్ట ప్రయోజనాలు, లక్ష్యాలున్నాయి.

భారతీయ ఐక్యతకు ప్రధాన సూత్రం-భిన్నత్వంలో ఏకత్వం. తెలుగు సంస్కృతిలోని భిన్నత్వాన్నీ జీవధాతువునూ పరాస్తంచేస్తూ రాష్ట్రేతర, దేశీయేతర సంస్కృతులు తమతమ సాంస్కృతిక సామ్రాజ్యాలను విస్తరించుకునే క్రమాన్ని నిలువరించడం ఈ సాంస్కృతిక పదకోశం ప్రధాన లక్ష్యం. స్థానికీకరణే(localization) సాంస్కృతిక ప్రపంచీకరణను ఎదుర్కొనే ఏకైక ఆయుధం.

సుస్థిరాభివృద్ధిలేని అభివృద్ధి నిజమైన అభివృద్ధి కాదని ఆర్థికవేత్తల అభిప్రాయం. అది దేశ స్వయంపోషక భావనకు గొడ్డలిపెట్టు. సంప్రదాయ పునాదులమీద ఆధునికం నిర్మాణమైనప్పుడే అది సుస్థిరాభివృద్ధికి దారితీస్తుంది. ఇటువంటి అభివృద్ధి లక్ష్యంగా జాతి సర్వతోముఖాభివృద్ధి సాంధించాలంటే, ప్రాచీన సంస్కృతిలో నిక్షిప్తమైన ఉత్తమ విలువల్ని, ప్రజాస్వామిక భావనల్ని ఈ తరానికి అందించడానికి ఈ కోశం ఉపయోగిస్తుంది.

నిఘంటువులు డిజిటలైజేషన్ వల్ల పరిశోధనలు వేగవంతంకావడంతో పాటూ పరిశోధనలో ఖచ్చితత్వం, విశ్లేషణకోసం ఉపయోగపడే వైవిధ్యమైన సమాచారం ఒకేసారి కళ్ళముందు ప్రత్యక్షమవడం మొదలైన ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి.

తెలుగువారి సాంస్కృతిక చరిత్ర నిర్మాణాన్ని రాయడానికి ఈ సాంస్కృతిక పదకోశం ఉపయోగిస్తుంది. లేదా పైన ప్రస్తావించిన 20 అర్థక్షేత్రాల్లోంచి విడివిడిగానూ సాంస్కృతిక చరిత్రల్ని ఈ కింది విధంగా నిర్మించుకొనే అవకాశం ఉంది.

అ) "తెలుగువారి అలంకరణ సంస్కృతి- చరిత్ర"

ఆ) "తెలుగువారి ఆహార సంస్కృతి- చరిత్ర'

ఇ) "తెలుగువారి ఆధ్యాత్మిక సంస్కృతి- చరిత్ర"

ఈ) "తెలుగువారి శకునాలు/నమ్మకాల సంస్కృతి- చరిత్ర"

ఉ) "తెలుగువారి వృత్తి సంస్కృతి- చరిత్ర"

ఇలా ప్రతీ చిన్న అంశాన్నీ ఒక ప్రత్యేకమైన చరిత్రగా నిర్మించుకొనే అవకాశాల్ని ఈ పదకోశం కల్పిస్తుంది. తద్వారా భారతీయసంస్కృతిలో తెలుగు సంస్కృతీస్థానాన్ని సాధికారికంగా ప్రకటించుకోడానికి వీలవుతుంది.

ముగింపు

తెలుగులో సాంస్కృతిక పదకోశాలు ఇప్పటివరకు పైన పేర్కొన్న పద్ధతిలో రాలేదు. కనుక, దీన్ని భవిష్యత్తులో నిర్మించబోయే సాంస్కృతిక కోశాలకు ఒక నమూనాగా ఉండేలా తీర్చిదిద్దాలనేది ఈ వ్యాసోద్దేశం. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం, నెల్లూరులో ఈ వ్యాసకర్త ఈ కోశనిర్మాణం చేస్తున్నాడు.

(ఈ కోశనిర్మాణ ఆలోచన తనతో చేసినప్పుడు విలువైన సలహాలను అందించిన గురువుగారు ఆచార్య పమ్మి పవన్‌కుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు)

సంప్రదించిన పుస్తకాలు, వెబ్‌సైట్స్:

1. ఏకామ్రనాథుడు(మూలగ్రంథం). సి.వి. రామచంద్రరావు(సంపా.). 1984. ప్రతాపరుద్ర చరిత్రము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

2. కాసె సర్వప్ప (మూల గ్రంథం). ఖండవల్లి లక్ష్మీరంజనం (వ్యాఖ్యాత). 1960. సిద్ధేశ్వర చరిత్రము. హైదరాబాదు: ఆంధ్ర రచయితల సంఘం.

3. గోపరాజు, కొరవి (మూలగ్రంథం). రామకృష్ణ, గడియారం (పరిష్కరణ). 1982. సింహాసన ద్వాత్రింశిక. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

4. చెన్నప్ప, మసన. 2014. ప్రాచీన కావ్యాల్లో గ్రామీణ జీవన చిత్రణ. మహబూబ్‌నగర్: పాలమూరు సాహితి. ద్వితీయ ముద్రణ.

5. నన్నెచోడుడు, (మృత్యుంజయరావు, జొన్నలగడ్డ, వ్యాఖ్యాత). 1994. కుమార సంభవం. హైదరాబాదు: తెలుగు యూనివర్సిటీ.

6. పరబ్రహ్మ శాస్త్రి, పి.వి. 2016. కాకతీయులు. హైదరాబాదు: ఎమెస్కో పబ్లికేషన్స్. ద్వితీయ ముద్రణ.

7. ప్రతాపరెడ్డి, సురవరం.1950. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. హైదరాబాదు: సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతీ పబ్లికేషన్స్.

8. ప్రమీలారెడ్డి, ఎమ్. 2000. కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి. హైదరాబాదు: ధీర లిటరరీ అండ్ కల్చరల్ పబ్లికేషన్స్.

9. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2017. తెలుగు సంస్కృతి శాసనాలు: చారిత్రక పరిణామాలు. విజయవాడ: చినుకు పబ్లికేషన్స్.

10. వల్లభరాయుడు, వినుకొండ(మూలగ్రంథం). బాలగంగాధరరావు, యార్లగడ్డ. (వ్యాఖ్యాత) 2008. క్రీడాభిరామము. విజయవాడ: నిర్మలా పబ్లికేషన్సు.

11. వెంకటరత్నం, గుంజి. 2014. ప్రాచీన సమాజ విజ్ఞానసర్వస్వం. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

12. శ్రీహరి, రవ్వా. 2004. శ్రీహరి నిఘంటువు.

13. సోమశేఖర శర్మ, మల్లంపల్లి. (ఆంగ్లమూలం). చక్రపాణి, కాకాణి మరియు ఇతరులు (తె. అనువాదం). 2013. రెడ్డిరాజుల చరిత్ర. (క్రీ.శ.1325-క్రీ.శ.1444). హైదరాబాదు: ఎమెస్కో పబ్లికేషన్స్.

14. https://andhrabharati.com/dictionary/index.php

15. https://archive.org/details/in.ernet.dli.2015.371884/page/n1/mode/2up

వ్యాసకర్త- అసోసియేట్ ఫెలో
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (14)

భాషను విశ్లేషించి వివరించేది వ్యాకరణం. ప్రత్యేకించి పదవ్యుత్పత్తిని పద స్వరూప స్వభావాన్ని తెలిపేది వ్యాకరణం. భాషలో పద నిర్మాణం, వర్ణ నిర్మాణం, వాక్య నిర్మాణంలాంటి స్వరూప స్వభావాలను, నియమనిబంధనలను విశదీకరించేది వ్యాకరణం లక్ష్య లక్షణీ వ్యాకరణమ్ అని పతంజలి నిర్వచనం.

'వ్యాక్రియన్తే వ్యుత్పద్యన్తే శబ్దాఃఅనేన ఇతి వ్యాకరణమ్'

వ్యాకరణం ఏదో ఒక భాషను మాత్రమే ఆశ్రయించుకొని ఉంటుంది. ఏ భాష వ్యాకరణం ఆ భాషకే పరిమితం. ఐతే భాష నిత్యం మారుతూ ఉంటుంది. కాలానుగుణంగా భాషలో మార్పులు చేర్పులు, నూతన పదబంధాలు, సరికొత్త పదస్వరూపాలు ఆవిర్భవిస్తాయి. అందువల్ల మారుతున్న కాలానుగుణంగా వ్యాకరణంలో కూడా చిరుమార్పులు జరుగుతాయి. వ్యాకరణ సిద్ధాంతం ఒకటిగా ఉన్నా ఉదాహరణల్లో మార్పులను బట్టి సిద్ధాంత అనుబంధాలు కూడా మారవచ్చు. అంటే మార్పు సహజం. భాషానుగుణంగా, కాలానుగుణంగా మార్పులకు వ్యాకరణం లోనవుతుంది.

వ్యాకరణాలకు ఆద్యుడు పాణిని స్మరించుకోవాలి. ఈయన క్రీ.పూ. 5వ శతాబ్దకాలం వాడు. పాణిని రచన అష్టాధ్యాయి వ్యాకరణ సంప్రదాయాల్లో ప్రాచీనమైనది. ఎనిమిది అధ్యాయాలు ప్రతి ఒకటి నాలుగు పదాలుగా విభక్తమయింది. మొత్తం 4 వేలసూత్రాలున్నాయి. వ్యాకరణమనే పదం మహాయాన సూత్రాల్లో తొలిగా వచ్చిందని అంటారు. బౌద్ధ గ్రంథాల్లో బోధిసత్వుడు బుద్ధుడికి చేసిన ప్రవచనమే వ్యాకరణం. వ్యాకరణం అంటే వేరు చేయడం భేదం-వివక్ష-విశ్లేషణ-వివరణ అని అర్థాలున్నాయి.


వ్యాకరణం-భాషా నిర్మాణం ఋగ్వేదంలో ఉందని దీనికి సాహిత్య పరమైన ఆధారాలు బ్రాహ్మణాలు ఆరణ్యకాలు ఉపనిషత్తులలోని విశ్లేషణ తెలియజేస్తుందని పాశ్చాత్య వ్యాకరణం శాస్త్రవేత్త మోరీజ్ వింటర్నిట్జ్ పేర్కొన్నాడు. పాణిని తర్వాత కాత్యాయనుడు పాణినీయ సూత్రాల ఆధారంగా వార్తికాలను రచించాడు. పతంజలి పాణిని తర్వాత మూడు శతాబ్దాల అనంతరం మహాభాష్యం రచించాడు. పాణిని - కాత్యాయన - పతంజలిని సంస్కృత వ్యాకరణ త్రిమూర్తులుగా పేర్కొంటారు.

తెలుగు వ్యాకరణాలలో ప్రాచీనమైనది నన్నయ భట్టు రాసిన ఆంధ్ర శబ్దచింతామణి. తదనంతరం అథర్వణాచార్యులు-అహోబిల సూత్రాలు, వార్తికాలు, భాష్యాలు రాశారు. 19వ శతాబ్దానికి చెందిన చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణము ప్రసిద్ధి చెందినదని లోకానికి తెలుసు. అనంతరం బహుజనపల్లి సీతారామాచార్యులు రచించిన ప్రౌఢ వ్యాకరణము కూడా పండితలోకంలో ప్రసిద్ధి చెందినదే. ఇక్కడే ఒక విషయం ప్రస్తావనకు వచ్చింది. తమిళ వ్యాకరణానికి అగస్త్యుడు ఎలాగో తెలుగు వ్యాకరణాని కణ్వుడు అలాగేనని కాంబెల్ మహాశయుని వాదన. ఈ చర్చ ఔగాములు తేల్చవలసిన విషయం. యువ పాఠకుల సౌలభ్యం కోసం తెలుగులో వెలువడిన వ్యాకరణ గ్రంథాలు. వేములవాడ భీమకవి. కవిజనాశ్రయము, విన్నకోట పెద్దన -కావ్యాలంకాచూడామణి, వెల్లంకి తాతంభట్టు - కవి చింతామణి, చిత్రకవి పెద్దన - లక్షణ సార సంగ్రహము, ముద్దరాజురామన - కవిజన సంజీవని, లింగమగుంట తిమ్మకవి - సులక్షణ సారము, వార్తాకవి రఘునాథయ్య - లక్షణ దీపిక, అప్పకవి - అప్పకవీయము, గణపవరపు వేంకటకవి - ఆంధ్రకౌముది, ఆంధ్ర ప్రయోగ రత్నాకరము, పొత్తపి వేంకట రమణకవి - సర్వలక్షణ సార సంగ్రహ చింతామణి, కస్తూరి రంగకవి - ఆనందరంగరాట్ఛందము, నైషధము, తిమ్మకవి - లక్షణ మంజరి, చిఋమఙ్జి నరిసింహకవి- లక్షణ నవరత్న మాలిక, రంగయ్య-సర్వలక్షణ సారము ఇంకా స్ఫురణకు రానివి ఎన్నో ఉన్నాయి.

శ్లోకమయమైన సూత్రరీతిలో చెప్పిన వ్యాకరణాల్లో ఆంధ్ర శబ్దచింతామణి మొదటిది. చింతామణికి వెలువడిన అనువాదాలలో ఎలకూచి బాలసరస్వతి రచించిన బాలసరస్వతీయము మొదటిది. ఇతని అసలు పేరు ఎలకూచి వేంకటాచార్యుడు. బాలసరస్వతి బిరుదు నామం. కాలం 17వ శతాబ్ది. ఇది చింతామణికి సరళమైన ప్రథమ టీకా గ్రంథం. ప్రప్రథమంగా తెలుగు వారికి ఇతనే పరిచయం చేశాడు. పరిచ్ఛేదాంత గద్యలో తన గ్రంథానికి శబ్దానుశాసనటీక అని పేరు పెట్టాడు. అయినా ఇది బాలసరస్వతీయముగానే పరిచయమై ప్రసిద్ధి చెందినది.

పాశ్చాత్యులు భారతదేశానికి వచ్చి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విషయం జగద్విదితం. వారిలో కొందరు విద్యాంసులు వ్యాకరణాలు, నిఘంటువులు స్థానిక పండితుల సహకారంతో తయారు చేయించారు. తెలుగు భాషలో అచ్చయిన వ్యాకరణాల్లో పాశ్చాత్యులు తయారు చేసి ముద్రించినవే తొలినాటివి. తెలుగు వ్యాకరణ రచనకు తొలిగా పూనుకున్నవారు ఫ్రెంచ్‌వారే. 1700 ప్రాంతంలో గుంటూరులోని రోమన్ కాతలిక్ సంస్థ పక్షాన వచ్చిన మిషనరీలు తెలుగు వ్యాకరణ రచన చేశారు. దీని రచయిత పేరు తెలియదు. దీని ప్రస్తావన మాత్రం విలియం బ్రౌన్ రూపొందించినA Grammar of the Gentoo Language 1857 పీఠిక పుట XII లో కొంత వివరించాడు.

"A reference in the first instance was made to a Gentoo Grammar, Published a series of years ago by a French man of which an in perfect copy was procured




from a mission- ary there residing at Guntoor". ఈ సందర్భంలోనే వివరిస్తూ ఫ్రెంచ్ విద్వాంసుడు రాసి తయారు చేసిన వ్యాకరణం ఏమీ బాగాలేదని అన్నాడు. గుంటూరు ప్రాంతం వచ్చిన ఫ్రెంచ్ మిషనరీలు తాము రాసిన గ్రంథంలో తెలుగును బడగ బాష అనేవారని సి.పి.బ్రౌన్ చెప్పినట్టు కాల్వెల్ తన వ్యాకరణంలో రాశాడు. తొలి తెలుగు వ్యాకరణం అచ్చువేసిన ఖ్యాతి జర్మన్ మిషనరీ అయిన బెంజిమన్ షూల్ట్జ (Ben-jamin Shultze)కే దక్కుతుంది. ఈ వివరాలు అమ్మనుడి ప్రారంభ సంచికల్లో గమనించవచ్చు. 1728లో మద్రాసులో అచ్చువేసిన Grammatica telugica Von Benjamin schultze, Madras - 1728, Halle 1984. ఇది జర్మనీ విటెన్‌బర్గ్‌లోని మార్టిన్ లూథరన్ విశ్వవిద్యాలయం వారు 1984లో పునర్ముద్రించారు. ఇది ఎనిమిది బాగాలుగా విభజించారు. ఆ విషయం పునర్ముద్రణ పీఠికలో వివరంగా ఉంది. 1. The Script 2. Pronunciation 3. Nouns 4. Adjectives 5. Pronouns 6. Verbs 7. Particles 8.Syntax. ఈవిభాగం పాణిని అష్టాధ్యాయిని అనుకరించి వుండవచ్చు. లేదా తెలుగులో వచ్చిన వ్యాకరణాలు ఏవయినా కారణం కావచ్చు ఇది ఊహ ప్రతిపాదన (Hypothetical) మాత్రమే.

తరువాత అచ్చయిన వ్యాకరణాల్లో విలియం కేరీ రచించిన A Grammar of the Telinga Language – 1814. ఇది సిరంపురులో అచ్చయింది. కేరీ తన వ్యాకరణంలో తెలుగు సంస్కృత జన్యమని చెప్పాడు. దీనిపై అనంతరం బహు విమర్శలు వచ్చాయి. ఈ వ్యాకరణం రచనకు సహాయ పడిన Native Pundits అయినSooba Shastree, Nageswar Shastree ల సహాయం ఎంతయినా ఉందని అన్నాడు. ఈ ప్రతి ప్రస్తుతం National Library, Calcuttaలో ఉంది ఈ వ్యాకరరణంలో 3+186 పుటలున్నాయి. దీని ఖరీదు 6 రూపాయలు. ఫోర్ట్ విలియం కళాశాలవారు వంద ప్రతులు కొన్నారు. అందులో కొన్ని ప్రతులు వారు ఉంచుకొని 40 ప్రతులు లండన్‌లోని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు, మరికొన్ని విద్యార్థుల కోసం మద్రాసు పంపారు. ఈ పుస్తకాల బిల్లు 1814 జులైలో మంజూరయింది. ఒక ప్రతిమాత్రం బ్రిటీషు మ్యూజియం లండన్‌లో ఉంది. మరెక్కడా ఈ ప్రతులున్న దాఖలాలు లేవు (యునైటెడ్ థియోలాజికల్ కాలేజి బెంగళూరులో ఉన్న మైక్రోఫిల్ములు ఆధారంగా). అనంతరం అచ్చయిన తెలుగు వ్యాకరణాల్లో ఎ.డి.కాంబెల్ 1816లో ముద్రించిన " A Grammar of the Telugu Language Commonly termed gentoo, Peculiar to the Hindus inhabiting the north eastern provences of the Indian Peninsula". కాంబెల్ వ్యాకరంణం రోమన్ లిపిలో రాశాడు. ఇందులో ఆరు అధ్యాయాలు 519 సూత్రాలున్నాయి. 1. తెలుగు అక్షరాలు 2. ద్విత్వ సంయుక్తాక్షరాలు 3. నామవాచకాలు, సర్వనామాలు 4. విశేషణములు 5. క్రియావదాలు 6. వాక్యపరిచ్ఛేదముతోపాటు సంఖ్యలు, కొలతలు, భిన్నాలు, సంవత్సర కాల విభజన తెలుగు ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగుల కోసం రాసినది కాబట్టి వివరణలు కూడా ఉన్నాయి. మొదట ముద్రణ 1816లోనూ రెండవ ముద్రణ మద్రాసులోని హిందూ ప్రెస్‌లో 1849లో జరిగింది. మొదటి ప్రతి మద్రాసులోనూ, బ్రిటీష్ మ్యూజియం లండన్‌లోనూ ఉన్నాయి. తెలుగు, తమిళం దక్షిణాదిన గుర్తింపు పొందిన ఇతర భాషలు సంస్కృతం నుంచి వచ్చినవి కాదని కాంబెల్ తన పీఠికలో స్పష్టం చేశాడు. పీఠికకు అనుబంధమైన ఎఫ్. డబ్లియు.ఎల్లిస్‌కూడా నోట్ టు ఇంట్రడక్షన్‌లో యిదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇక్కడే మరో విషయం ప్రస్తావించాలి. కాంబెల్ వ్యాకరణ పీఠికలో సంస్కృత భాషా విభాగాధిపతి అయిన తెలుగు ఉపాధ్యాయుడు పట్టాభిరామశాస్త్రి సహాయం కూడా తీసుకున్నానని రాశాడు.

కాంబెల్ వ్యాకరణానికి ఉపోద్ఘాతం ఒక చిన్న 'నోట్' రాసిన ఫ్రాన్సిస్ డబ్ల్యుఎల్లిస్ ((Francis W.Ellies)ని పేర్కొనాలి. ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాల నిర్వహణాధికారిగా పనిచేసిన ఎల్లిస్ బహుభాషావేత్త. తెలుగు వ్యాకరణం ఏదీ ప్రత్యేకంగా రాయలేదు. కానీ భాషలపై అవగాహన ఉంది. తెలుగు సంస్కృత జన్యము కాదనే విషయంతో ఏకీభవిస్తూ దక్షిణాదిభాషలయిన తమిళం, కన్నడ భాషలతో ఉన్న పోలికను వివరించాడు. ఆకళాశాలలోనే పనిచేస్తున్న పట్టాభిరామశాస్త్రి రచించిన 'ధాతుమాల' నుంచి అ-క-ప-వ అనే అక్షరాలతో ప్రారంభించి ప్రతి అక్షరానికి నలభై ధాతువులను తీసుకుని సంస్కృతంలో ఏ పోలికాలేదని తమిళ, కన్నడ భాషల సాజాత్యాన్ని వివరించాడు. దీనితో పాటు డాక్టర్ విల్కిన్స్ రచించిన సంస్కృత వ్యాకరణంలోని కారక పరిచ్ఛేదం నుంచి కొన్ని ఉదాహరణలతో వివరించాడు. అన్ని విషయాలను వివరిస్తూ దక్షిణాది భాషల సాజాత్య నిరూపణ కొంత వివరించాడు. కాంబెల్ వ్యాకరణానికి ఎల్లిస్ పీఠిక మరింత బలాన్నిచ్చింది. ఈ సందర్భంగానే కేరీ నమ్మిన తెలుగు సంస్కృత జన్యమన్న అభిప్రాయాన్ని ఖండించాడు.

తరువాత వచ్చిన వ్యాకరణాల్లో 1817లో విలియం బ్రౌన్ రచించిన A Grammar of the Gentoo Language అనే గ్రంథం వెలువడింది. విలియం బ్రౌన్‌కూడా తెలుగు సంస్కృత జన్యం కాదని వివరించాడు. తన వ్యాకరణ రచనకు మచిలీపట్నానికి చెందిన మామిడి వెంకయ్య గ్రంథాలు బాగా ఉపయోగపడినాయని కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే తన రచనకు ప్రత్యక్ష సాయమందించిన గుండుమళ్ళ పురుషోత్తం (మరణం 1817) సాయం ఎంతయినా ఉందని, ప్రభుత్వ ప్లీడరుగా పనిచేస్తూ కూడా తనకు



A GRAMMAR

OF THE

TELUGU LANGUAGE

BY

CHARLES PHILIP BROWN,

LATE OF THE MADRAS CIVIL SERVICE, TELUGU TRANSLATOR TO GOVERNMENT
MEMBER OF THE LATE COLLEGE BOARD,
AUTHOR OF THE TELUGU DICTIONARY, AND OTHER WORKS.

SECOND EDITION:
Much Enlarged and Improved.

MADRAS:

PRINTED AT THE CHRISTIAN KNOWLEDGE SOCIETY'S PRESS,
AND SOLD IN LONDON BY
WM. H. ALLEN AND CO., 7, LEADENHALL STREET.

1857.

సాయమందించాడని పీఠికలో కృతజ్ఞతలు తెలియజేశాడు.

అనంతరం వచ్చిన తెలుగు వ్యాకరణాల్లో ఆంధ్ర బంధు, తెలుగు భాష పునర్నిర్మాణ పితామహుడు సి.పి. బ్రౌన్ 1840లో రాసిన A Grammar of the Telugu Language ముఖ్యమైనది. రెండవ ముద్రణ 1857లో జరిగింది. మూడవ ముద్రణ 1863లో బ్రౌన్ తన స్వదేశానికి తిరిగి వెళ్ళిన తర్వాత అచ్చుయింది. ఈ వ్యాకరణం 12 భాగాలుగా అచ్చుయింది. మొదటి పది భాగాలు వ్యాకరణమంతా వివరంగా ఉంది. (రాబోయే సంచికల్లో వివరంగా చూడవచ్చు) పదకొండవ భాగం ఛందస్సు, పన్నెండవ భాగం ద్రుత ప్రకృతి,కళలకు సంబంధించినది. అనుబంధంగా లెక్కలకు సంబంధించిన మానాలు మొదలయినవి ఉన్నాయి. బ్రౌన్‌కు వ్యావహారిక భాష అంటే మక్కువ. అలాగే సంస్కృతాంధ్రల సంబంధాన్ని గురించి పేర్కొంటూ ఆంగ్ల వ్యాకరణాలు లాటిన్ భాషా పద్ధతిలో తొలిదశలో ఉండేవి. అలాగే తెలుగు వ్యాకరణాలు కూడా సంస్కృత పద్ధతిలోనే కొనసాగిందని రెండవ ముద్రణ పీఠిక VI లో వివరించాడు. తెలుగు యతి, ప్రాసలను గూర్చి తెలియజేస్తూ ప్రాచీనాంగ్ల కవుల రచనల్లో కన్పిస్తాయని గోతిక్ (Goethic) భాషలో శబ్ద సౌందర్యం కోసం యిలాంటి పద్ధతిలో అనుసరించారని ఉదాహరణలతో వివరించాడు. తెలుగు యతి వంటిది స్పానిష్ భాషలో కూడా ఉందని చెప్పాడు. (తరువాయి భాగం వచ్చే సంచికలో; గతసంచిక తరువాయి 15)

అనంతరం వచ్చిన వ్యాకరణాల్లో రెవరెండ్ ఎ. రిక్కజ్ (Rev. A. Reccaz) అనే మిషనరీ సంక్షిప్త వ్యాకరణం 1889లో రాశాడని ప్రతీతి. ఇది ముద్రణ జరిగినా ప్రతులేవీ లభ్యం కావడం లేదు. విశాఖపట్టణంలో మిషనరీగా పరిచేసిన రిక్కజ్ తెలుగు వ్యాకరణానికి బ్రౌన్ వ్యాకరణమే ఆధారమన్నాడు. బ్రౌన్ వ్యాకరణం కన్నా ఇది సరళంగా ఉంది. సూత్రాత్మకమయింది. మొత్తం 253 సూత్రాలున్నాయి. సంప్రదాయ తెలుగు వ్యాకరణ పద్ధతినే అనుసరించాడు. రిక్కజ్ వ్యాకరణములో గ్రామ్య అని పేర్కొంటూ గ్రామ్యము లక్షణ విరుద్ధమని అన్నాడు. తెలుగు రచనలో వు-వూ-వొ-వోలు తెలుగు పదాదిలో ఉండవని వ్యావహారంలో విస్తారంగా ప్రయోగాల్లో ఉన్నాయని అన్నాడు. చిన్నయసూరి కూడా ఇదే విషయాలను వివరించాడు. కాంబెల్ వ్యాకరణము చింతామణిని అనుసరిస్తే, బ్రౌన్ స్వతంత్ర మార్గాన్ని ఎన్నుకున్నాడు. రిక్కజ్ ప్రాచీన-అర్వాచీన వ్యాకరణ మార్గాలను అనుసరించాడు.

తరువాత లభిస్తున్న వ్యాకరణాల్లో ఎ.హెచ్. ఆర్డెన్ (Rev. A. Reccaz) రచించిన (A Progressive Grammar of the Telugu Language - 1873 ముఖ్యమైనది. తెలుగు-ఇంగ్లీషు భాషల్లో కలిపి రాసిన ఈ వ్యాకరణం మొత్తం 360 పుటలున్నాయి. మూడు భాగాలుగా విభజించినట్టు టైటిల్‌పేజీలో పేర్కొన్నాడు. 20 అధ్యాయాలుగా విభజించాడు.

Parg I - Introduction, on the alphabet and orthrography, out line grammar, and Model Sentences

Part II - A complete Grammar of the colloquial dialect.

Part III - on the grammatical dialect used in books.

ఈ వ్యాకరణం Society for promoting Christian, knolwledge, 17, church street vepery, Madras లో అచ్చుయింది. వెల 6 రూ. ఆర్డెన్ తమిళ వ్యాకరణం కూడా రచించాడు. A Progressive Grammar of the Tamil Language అనే పేర అచ్చుయింది. ఇది 1910లో అచ్చుయింది.

తెలుగు భాష పరిచయంలేని విదేశీయులకు అర్థమయ్యేలా సరళంగా ఇంగ్లీషు వ్యాకరణ పద్ధతిననుసరించి రచించాడు. తెలుగు వ్యాకరణాల్లోని పరుష, సరళ స్థిరాది సంజ్ఞల్ని వివరించి ద్రుత ప్రకృతుల్ని వివరించి సప్త విభక్తుల్ని పరిచయంచేశాడు. కావ్యాల్లో ఉదాహరింపబడిన ఎవ్వారలు, ఎవ్వంద్రు, ఆపి, ఈకె వంటి సర్వ నామ రూపాలు, త్రిక సంధులు, భవత్యర్థ వ్యవహితులయిన విశేషణాలు, క్రియాల్లో ఆశీర్వాద్యర్థకాలు, ముత్తు పరమైనపుడు వచ్చు, ఇచ్చు, చూచు, తెచ్చు, చొచ్చు, నొచ్చు, చచ్చులకు కలిగే రూప భేదాలు, సిద్ధ సాధ్యబిందువులు వివరించాడు. సంస్కృత భాషలోని అచ్చంధి, హల్సంధులకు లక్ష్యాన్ని మాత్రమే చూపాడు వ్యావహారంలో మాండలిక భేదాలున్నా సర్వసమ్మతమైన రూపాలనే ఈ వ్యాకరణంలో గమనించవచ్చు. ఇది ప్రస్తుతం అమెజాన్‌లో లభ్యమవుతుంది.

లభించే వ్యాకరణాల్లో హెచ్. మోరిస్ (H.MORRIS) వివరణాత్మక సూత్రాలు ఉన్నాయి. ప్రథమ అధ్యాయం ఉపోద్ఘాతం (Introduction) తెలుగుభాష ఏయే ప్రాంతాల్లో వ్యవహారంలో ఉంది, ఎంతమంది తెలుగుభాషను వినియోగిస్తున్నారో తెలిపి ఉచ్చారణ గూర్చి వివరించాడు. తెలుగు సంయోగాత్మక భాషని నిరూపించాడు. రెండో అధ్యాయం అంతా -సమామ్నాయం (orthgography) ఈ అధ్యాయం అంతా అజ్ఝల్లులు, కళా దృత ప్రకృతికాలు, సంధిని గూర్చిన విధులున్నాయి. మూడవ అధ్యాయం Etymology. నామ వాచకాన్ని కాంబెల్, బ్రౌన్, ఆర్డెన్‌లా కాకుండా మరో విధంగా విభజించాడు.

class I Nouns ending in డు - మనుమడు

class II Nouns endging in ము - గుర్రము

class III Nouns endging in ఇ - పులి

class IV Nouns endging in అ - అన్న

class V Nouns endging in అ - ఔపవిభక్తికములు

కాంబెల్, బ్రౌన్ స్త్రీసమములను ఒక్కొక్కటిగా పరిగణిస్తే మోరిస్ ఇకాం-అకారాంతాలుగా విభజించాడు. బహువచన ఇకారాంతాలు, ఉకారాలవుతాయి. కాబట్టి యిలా విభజన జరిగింది. చివరి

ప్రకరణం structure - the structure of the Telugu Verb is stnictly aggluitinative అనడానికి ప్రామాణికంగా బిషప్ కాల్వెల్ లక్షణాన్ని ఉదహరించాడు. క్రియా పురుష కాలార్థాలలో ఆర్డెన్ వ్యాకరణాన్ని అనుసరించాడు. మారిస్ వ్యాకరణం తెలుగు సంప్రదాయ వ్యాకరణ విధానాలను అనుసరించింది. తెలుగు క్రియారూపాలకు ప్రాధాన్యత కనిపిస్తుంది. మారిస్ గోదావరి జిల్లా చరిత్రను కూడా రాశాడు. ఇది 1878లో ప్రచురణ జరిగింది.

మరో తెలుగు వ్యాకరణం A Manuel of Telugu Grammar and phonetics (1918) ఒకటి కనిపిస్తుంది. రచయిత ఎవరో తెలియదు అందులో భాషాశాస్త్ర విషయమైన తెలుగు ధ్వనుల వివరణ (Phonetics) ఉంది. పదకొండు ప్రకరణాలు 113 సూత్రాలు ఉన్నాయి. ఇందులో అచ్చదేశ్యం, తత్సమాలు, తద్భవాలు, అన్యదేశ్యాలు వివరంగా చెప్పాడు. సర్వనామ, క్రియారూపాలకు పట్టికలు యిచ్చాడు. పూర్వ వ్యాకరణాలచే సంక్షిప్తంగా సరళంగా సుబోధకం చేశాడు.

తరువాత లభించే వ్యాకరణాల్లో ఆల్ఫ్రెడ్ మాస్టర్ (Alfred Master) రచించిన An introduction to Telugu Grammar (1947) ఒకటి కనిపిస్తుంది. ఆర్డెన్ రాసిన వ్యాకరణ సూత్రాలనే చెప్పి తాను గుర్తించిన కొన్ని విశేషాలను వివరించాడు. కర్మణ్యర్థక వాక్యాలు తెలుగుకు సజాతీయాలు కావని ఆర్డెన్ చేసిన ప్రతిపాదననే బలపరచాడు. రష్యన్‌భాషలో రచించిన తెలుగు వ్యాకరణాలు 1950-70 ప్రాంతాల్లో తెలుగులో వచ్చిన అనువాద పుస్తకాల్లో రష్యన్ బాలసాహిత్యం పుంఖాను పుంఖాలుగా వెలువడిరది. సైన్సు, సాహిత్యం, సాధారణ వ్యావహారిక జీవితం, నీతిబోధక కథలు లాంటివి ఎన్నో ఉదాహరణలాగా చెప్పవచ్చు రష్యాలో తెలుగువారు అక్కడక్కడా కనిపించే పరిస్థితులు ఆరోజుల్లో ఉండేది. ఆకాలంలోనే తెలుగు-రష్యా సంబంధాలు కూడా రాజకీయంగా బాగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తెలుగు భాష రష్యన్ ప్రజలకు పరిచయం చేసే విధంగా వచ్చిన వ్యాకరణాలు కొద్దిగా ఉన్నాయి. 1960లో Telugu Language అనే పేర జడ్. పెత్రూనిచెవా(Z.Petrunicheva) ఒక లఘువ్యాకరణం రష్యన్ భాషలో రచించింది. మరో వ్యాకరణం 1972లో TKRATKY GRUMMATICHESKY OCHERE YAZYKA TELUGU అనే వ్యాకరణం ఒకటి. A short Telugu -Reference Grammar అనే పేర యన్ ద్జీనిత్, ఎన్.గురువేలు రచన చేశారు. తెలుగు వ్యాకరణ అనుబంధంలో రష్యన్ తెలుగు నిఘంటువును కూడా జత చేశారు.

పాశ్చాత్యులు రచించిన వ్యాకరణాల పరిశీలనలో కొన్ని విషయాలు వివరంగా విశదీకరించవచ్చు.

1. పాశ్చాత్య వ్యాకరణాలు రచనచేసినవారందరూ దాదాపు వ్యావహారిక భాషనే ఉపయోగించారు.

2. తెలుగు సంప్రదాయ వ్యాకరణ పద్ధతుల కన్నా ఆంగ్ల వ్యాకరణ సంప్రదాయాలను తెలుగు భాషకు అన్వయించారు.

3. తెలుగు పలుకుబడి, జాతీయాలు గుర్తించి తెలుగు వాక్య నిర్మాణ విధానం రూపొందించారు.

4. వ్యాకరణ నిర్మాణం తెలుగువారి సంప్రదాయానుసారంగా, గ్రామస్థాయిలో గుణింతాలు వల్లె వేసే పద్ధతులను వివరించారు.

5. వ్యాకర్తలందరూ తెలుగు భాషలోని సహజ సిద్ధమైన తియ్యందనాన్ని గుర్తించారు.

6. వ్యాకరణం కష్టమని, కొరుకుడు పడని అంశమనే భావనను తొలగించి సరళంగా చేసిన ఖ్యాతి పాశ్చాత్యులకే దక్కుతుంది.

7. దాదాపు పాశ్చాత్యులు రచించిన వ్యాకరణాలన్నీ ఇంగ్లీషు భాషలో రచనలు చేసినా ఉదాహరణలు తెలుగు వారి సహజ సిద్ధమైన వ్యావహారిక రూపాలు తెలుగులో ఇచ్చారు.

తెలుగు వ్యాకరణ రచనలో పాశ్చాత్యులకు సహాయపడిన తెలుగు పండితుల్లో రావిపాటి గురుమూర్తి శాస్త్రి, ఉదయగిరి శేషయ్య, పాపినేని అబ్బాయి నాయుడు, సుబ్బశాస్త్రి, నాగేశ్వరశాస్త్రి, పూదూరి సీతారామశాస్త్రి, మొదలయిన వారున్నారు.

ఈ వ్యాసరచనకు ఆరుద్ర, ఆచార్య లలిత, ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, జోలెపాళెం మంగమ్మ, కె.ఆర్. కె.మోహన్, అచ్చయిన నా పూర్వవ్యాసాలు ఎంతగానో తోడ్పడ్డాయి. అ

23 వ పుట తరువాయి...

భాష కూడా నేర్చుకునే అవకాశం ఉంటుంది. తదనంతరం ఏ మాధ్యమంలో చదువుకుంటారు అనే విషయాన్ని వాళ్ళ ఇష్టానికే వదిలేసినా నష్టం జరుగదు. ఈ విధంగా విద్యావిధానం ఉండడం ద్వారా ఎరుకల అస్తిత్వాన్ని కాపాడగలుగుతాము.

ముగింపు:

పాఠశాలల్లో ఆంగ్లం మాధ్యమంగా ఉండటం వల్ల తెలుగువాళ్లే కాదు; ఎరుకలవాళ్ళు కోల్పోతోంది, కోల్పోయింది చాలానే ఉంది. అది సంస్కృతి పరంగా, భాషాపరంగా, వృత్తుల పరంగా, ఆర్థిక వనరుల పరంగా నష్టం జరిగింది. పెద్దలు చెప్పిన విధంగా ప్రపంచీకరణ అంటే స్థానికీకరణ అనే విషయాన్ని గుర్తుపెట్టుకొని, ఎరుకల భాషను మాధ్యమంగా ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకతను గుర్తించి, నూతన విద్యా విధానాన్ని (2020) పకడ్బందీగా మన ప్రభుత్వాలు అమలుపరచాల్సిన అవసరం ఉంది.

భాషా శాస్త్రజ్ఞులూ, సామాజిక శాస్త్రజ్ఞులూ, విద్యావేత్తలందరూ ఎరుకల నుడినీ, సమాజాన్నీ, వారి సాంప్రదాయిక విజ్ఞానాన్ని పరిరక్షించడానికీ తోటివారిగా మన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ఎరుకల అస్తిత్వానికి సహాయ సహకారాలు అందించాలి.

తెలుగు సంపర్కంలో ఉన్న గిరిజన మాతృభాషలు మనగలిగిన రోజు తెలుగు కూడా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇది జరగాలంటే తెలుగు మనుగడలో ఉండాలి. తెలుగు మనుగడలో లేని రోజున మరే అల్పసంఖ్యాకవర్గ భాషలూ బతకలేవు. అల్పసంఖ్యాక వర్గ భాషలను మాట్లాడేవారూ తెలుగు మాట్లాడేవారూ అందరూ ఒక్కటై బడిలో తెలుగులో బోధన ఉండేటట్లు చూడాలి.

'భాషా విధ్వంసం జాతి విధ్వంసానికి మూలం' అనే నినాదాన్ని అర్థం చేసుకున్నప్పుడే 'అమ్మభాషలన్నీ' అమృతభాషలుగా నిలిచిపోతాయి'.

ఈ వ్యాసరచయిత భాషా శాస్త్ర సహాయాచార్యులు
ఉస్మానియా విశ్వవిద్యాలయం



ఎవరు తెలివి గలవారు?! 6

జరిగిన కథ:

కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకున్నారు జంతుపక్షిజనాలు. ఆ బడిలో పిల్లలకు అనేక అనారోగ్యసమస్యలు వచ్చాయి. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు చెప్పే సమాధానాలు అర్థంగాక అయోమయంలో పడ్డారు. అడవి జనాలకు ఒక మనిషి స్నేహితుడయ్యాడు. అతడు అడవి జనాలకు నశించిపోతున్న చెట్లు, జంతువులు, పక్షుల గురించి వివరించి చెప్పాడు. మనుషుల నుండి జబ్బులు రాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించాడు.

తరువాత కథ చదవండి -

అడవిలో 'ఆటల ప్రదర్శనలు'

సి. వి. క్రిష్ణయ్య
93965 14554

అడవిలో మొలకల పండుగ వచ్చింది. తొలకరి వానలు కురిసిన పదోరోజు నుండి వారం రోజులు అడవి జనాలంతా కలసి ఈ మొలకల పండుగ చేసుకొంటారు.

తొలకరివానలకు మట్టిలో దాగిన గడ్డి గింజలన్నీ మొలకలెత్తి లేతాకు పచ్చరంగుతో గడ్డి మొలకలు మెరిసిపోతుంటాయి. ఎండిపోయిన గడ్డి మొదళ్ళ నుండి, చెట్ల వేళ్లనుండి చిగుళ్లు వస్తాయి. జంతువులు పక్షులు తమ బిడ్డల్ని తీసుకెళ్లి ఈ లేత మొలకల్ని చిగుళ్లను తినిపిస్తాయి. ఈ మొలకలు చిగుళ్లు వాటికి అమృతంతో సమానం. అందుకే ఈ ఆహారాన్ని అమృతాహారం అని పిలుస్తారు. ఈ ఆహారం తిన్న రోజుల్లో పిల్లలూ పెద్దలూ ఎంతో ఉత్సాహంగా ఉంటారు. ముర్రుపాలు బిడ్డలకు రోగ నిరోధశక్తినిచ్చినట్లు ఈ మొలకలు ఔషధ గుణాలను కలిగి పశు పక్షిజనాలకు ఎంతో మేలు చేస్తాయి. నేలతల్లి తన బిడ్డలకు తినిపించే మెత్తటి ఆహారం అనుకొంటారు. అందుకే వారం రోజులు నేల మీద గంతులేసి తమ ఆనందాన్ని తెలియజేస్తారు.

ఈ పండుగ సందర్భంగా పిల్లలకు బడిలో ఆటలపోటీలు పెట్టాలని కోతి సలహామేరకు నిర్ణయించారు. తల్లిదండ్రులను పెద్దలను పిలిపించి సమావేశం ఏర్పాటు చేసారు. పిల్లలకు ఆటలపోటీలు పెడతున్నామని అందరూ తప్పక వచ్చిచూడాలని పోటీల్లో గెలిచిన పిల్లలకు బహుమతులు ఉంటాయని హెడ్మాష్టరుగారు ప్రకటించారు.

పోటీలు జరపడం బహుమతులివ్వడం ఈ ఆడవిలో ఇప్పటి వరకు జరగలేదు. అందువలన అందరికీ అనుమానం వచ్చింది. "పోటీలు అంటే ఏమిటి? బహుమతులు ఇవ్వడం ఏమిటి" అని అడిగారు.

"పిల్లల మధ్య పోటీలు పెడతాం. అందులో ఒకరు గెలుస్తారు. గెలిచిన వారికి బహుమతి ఇస్తాం" అని చెప్పారు హెడ్మాష్టరు గారు. ఇంతలో ఆటల ఉపాధ్యాయుడు నక్క గారు లేచి నిలబడ్డారు. "మీకు అర్థమయ్యేటట్లు చెపతాను. పదిమంది పిల్లల్ని ఎంపిక చేస్తాం. వాళ్లందరు పరుగులు దీసి తిరిగి బయలుదేరిన స్థలానికి ఎవరు ముందుచేరుకొంటారో వారు గెలిచినట్లు. మిగిలినవాళ్లాంతా ఓడిపోయినట్లు, గెలిచిన వారికి బహుమతులు ఇస్తాం"

"ఏమేమి పోటీలు పెడతారు" అడిగింది ముసలి ఆవు. పరుగు పందెం, ఎగిరి దూరంగా దూకడం, ఎత్తు ఎగరడం, దాచిన వస్తువుకనుక్కోవడం, బరువులు ఎత్తడం, పాటలుపాడడం, నాట్యంచేయడం. ఇలాంటివే ఇంకాచాలా ఉంటాయి. అని చెప్పారు హెడ్మస్టారు.

గెలిచేదెవరో, ఓడిపోయేదెవరో? ముందుగా చెప్పవచ్చుగదా అనింది కొమ్ముల జింక.

బాగా ఆడేవారే గదా గెలుస్తారు. ఆ సంగతి ముందుగా ఎలా తెలుస్తుంది. అని ప్రశ్నించారు ఆటల మాష్టారు

ఎందుకు తెలియదు. పరుగుపందెంలో చిరుతగాని గుర్రంగాని గెలుస్తుంది. పాటలు పాడడంలో కోకిల, నాట్యంలో నెమలి, బరువు ఎత్తడంలో ఏనుగు గెలుస్తాయి. అసమానుల మధ్య పోటీలు పెట్టడం ఏమిటి? అన్నది కొమ్ముల జింక.

పులినిచూసి నక్క వాతలు పెట్టుకొన్నట్లు మనుషులు చెసే చెడ్డ పనులన్నీ ఈ ఆడవి జనాలకు నేర్పాలనుకోవడం మంచిది కాదు అన్నది ముసలి ఆవు.

''ఇందులో చెడ్డ ఏమున్నది అంటూ ప్రశ్నించారు ఉపాధ్యాయులు. ''ఇప్పటి వరకు ఇలాంటి పోటీలు అడవిలో జరిగాయా? పోటీలవల్ల జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. పోటీలు పందేలుగా మారుతాయి. పందేలు జూదాలుగా మారుతాయి. జూదాలుగా ఎప్పుడు మారతాయో అప్పుడు అవి వ్యసనాలుగా మారి మోసాలు, కుట్రలు, కుతంత్రాలు చేస్తారు. ఇదంతా ఒక



విషవలయం. మానవ సమాజంలో ఈ ఆటలు జూద క్రీడలుగా మారిపోయాయి. జూదం అనగానే డబ్బులు ఆస్తులు చివరకు ప్రాణాలు పందెంలో పెడతారు. అమాయకులు నిజాయితీ పరులు ఓడిపోయి సర్వం పోగొట్టుకొంటారు. **జూదాలుగా క్రీడలు ఎప్పుడు మారతాయో అవి వ్యాపారంగా తయారవుతాయి. తుదకు ఈ వ్యాపారస్తులు ఆటగాళ్లను డబ్బులిచ్చి కొంటారు. ఆటగాళ్లు తమను తాము అమ్ముకొంటారు. ఆత్మాభిమానం స్వాతంత్ర్యం కోల్పోతారు. ఇప్పుడు తనకోసం గాక యజమాని కోసం ఆడతాడు.**

ఈ ఆటగాడు తమ ప్రాంతంవాడని తమ మతంవాడని తమ జాతివాడని అభిమానిస్తారు. ఓడిపోతే వారంతా దూషిస్తారు. అవమానిస్తారు. ఎదుటి పక్షంవారికి అమ్ముడుపోయి ఓడి పోయినాడంటారు. చివరకు ఆటగాడు వత్తిడికిలోనవుతాడు. బాధపడతాడు. ఇలాంటి పోటీలు పిల్లల మధ్య జరిగితే మరెంతో ప్రమాదం. పసి తనంలో ఓటమిని భరించలేరు. వారు నిరుత్సాహ పడతారు. వారి మానసిక, శారీరక ఆరోగ్యాలు దెబ్బతింటాయి.

ఒక్కడు గెలిచాడని సంతోషించాలా? వందమంది ఓడిపోయారని బాధపడాలా? ఇది ఎంతఘోరమో ఆలోచించండి. అంటూ పోటీలవల్ల జరిగే అనర్థాల గురించి వివరించింది ఆవు.

"అవును నిజమేనన్నది పెంపుడు కుక్క. నన్ను పెంచిన ఇంటి యజమానికి ఒక కొడుకున్నాడు. నా యజమాని గొప్పధనవంతుడు. కొడుకు గుర్రప్పందాలు ఆడేవాడు. తల్లిదండ్రులు ఎంత మందలించినా వినేవాడు కాదు. డబ్బులన్నీ పోగొట్టాడు. తల్లిదండ్రుల దగ్గర ఇంకేమి మిగలలేదు. చివరకు ఇద్దరినీ హత్య చేసాడు. కటకటాలపాలయ్యాడు. మనుషులు చేసే ఈ దుర్మార్గాలు చూడలేక ఈ అడవిలోకి వచ్చాను. ఇక్కడ ఆస్తులు, జూదాలు, మోసాలు, అబద్ధాలు లేవు. హాయిగా ఉంది. ఇలాంటి అడవిలోకి పోటీల పేరుతో అలాంటి వ్యసనాలను తేవద్దు అన్నది.

అయితే ఏమి చేద్దాం అని ప్రశ్నించారు హెడ్మాష్టరు ఏనుగుగారు "ప్రత్యేకంగా పిల్లలకు పోటీలు అని కాకుండా ఈ అడవిలో పిల్లల్ని పెద్దల్ని కలిపి అందరినీ ఆటల ప్రదర్శనల పేరుతో ఆడించండి. ఎవరి ప్రతిభవారు ప్రదర్శిస్తారు. వారం రోజులు ఎవరెవరు ఏమి చేయాలో శిక్షణ ఇచ్చి కార్యక్రమాలు రూపొందించండి అని చెప్పింది ఆవు.

ఇది బాగుంది అంటూ అందరూ అంగీకరించారు. వెంటనే ఈ విషయం అడవిలో సమస్త జంతుపక్షిజనాలతో పాటు క్రిమి కీటకాదులకు తెలియజేసారు. వారం రోజులు అందరినీ పిలిచి వారేమి చెయ్యాలో ఎంతసేపు చేయాలో కార్యక్రమాన్ని రూపొందించుకొన్నారు. ఆటల ప్రదర్శన రోజు రంగుల చిలకను వ్యాఖ్యాతగా నియమించారు.

నదివడ్డున విశాలమైన మైదానంలో మొలకల పండుగ చివరిరోజు ఆటల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మైదానం చుట్టూ పిల్లలు పెద్దలు చేరారు. రాజుగారైన సింహం, వారి ప్రత్యేక సిబ్బంది

ముందు వరుసలో కూర్చున్నారు. చుక్కల గుర్రంతో పాటు కొండలోయలో నివాసముంటున్న మనిషిగూడా వచ్చాడు.

మైదానం మధ్యలో ఎత్తైన బండరాయి ఉంది. ఆ రాతి మీదికి రంగుల చిలుకవచ్చివాలింది. చిలుక సూచనలివ్వడం మొదలు పెట్టింది.

ఆటల ప్రదర్శనలు మొదలైనట్టు సూచనగా రెండు గద్దలు ఆకాశంలోకి ఎగిరి మైదానం చుట్టూ తిరుగుతూ ఈలలు వేసాయి. ఈ ఈలలు, గుర్రపు సకిలింతలవలె, సింహగర్జనల్లాగా అడివంతా వినిపించాయి.

వెంటనే రాజుగారైన సింహంలేచి తన పంజా చూపించడంతో ప్రదర్శనలు మొదలయ్యాయి.

నాలుగు ఏనుగులు పెద్ద కొయ్యదుంగను మోసుకొని వచ్చి మైదానం మధ్యలో పెట్టాయి. ఒక్కో ఏనుగు వచ్చి తొండంతో దుంగను ఎత్తి వెనక్కి విసరివేయాలి. బలమైన రెండు ఏనుగులు మాత్రమే ఈ పనిచేసాయి.

పది రాబందులు ఎముకలను నోట కరుచుకొని ఆకాశంలోకి ఎగిరి మైదానం చుట్టూ తిరిగి కిందకి వదిలాయి. మరో పది గద్దలు వాటిని క్రింద పడకుండా ఆకాశంలోనే పట్టుకొని కిందికి దిగి మైదానంలో ఒక చోట గుట్టగా పెట్టాయి. వెంటనే ఇరవై గద్దలు లేచి పది జతలుగా ఒకదాని కాళ్లు ఒకటి పట్టుకొని గుండ్రంగా తిరిగాయి.

ఒక ఎముకను రాజుగారైన సింహం చేతికి తాకించి దూరంగా దాచిపెట్టి వచ్చింది పెంపుడు కుక్క. మరో నాలుగు కుక్కలు రాజుగారిచేతి వాసన చూసి పరుగులు దీసి వెళ్లి ఐదు నిముషాల్లో ఆ ఎముకను తెచ్చి రాజుగారి ముందు పెట్టాయి. అంతా అభినందిస్తూ అరిచారు.

కోరల పందులు మధ్యలో ఒక గుంతను తవ్వాయి. ఏనుగులు ఒక చెట్టుకొమ్మను విరిచి ఆ గుంతలో నాటి నిలబెట్టాయి. ఒక ఏనుగు ఎండిపోయిన గడ్డి తెచ్చి ఆ కొమ్మ దగ్గర వేసింది. వెంటనే వంద పిచ్చుకలు లేచి ఆ గడ్డి పోచను చెట్టుకొమ్మకు తగిలించి పది గూళ్లు అల్లాయి. అవి రకరకాల ఆకారాల్లో అందంగా ఉన్నాయి.

రంగు రంగుల పావురాళ్లు వచ్చి మైదానంలో వాలాయి. పక్షులు ఏటవాలుగా పైకిలేచి ఏటవాలుగా నేలపై కూర్చుంటాయి. కాని ఈ పావురాళ్లు రెక్కలు ఆడిస్తూ అలా చక్కగా పైకి లేచాయి. పైనుండి ఒక్కసారిగా నేలమీదికి పడ్డాయి. నేలను తాకేలోపు పైకి లేచాయి. రకరకాల పల్టీలు కొడుతూ చూపరులను మైమరిపించాయి.

తరువాత పరుగుల ప్రదర్శనలు మొదలయ్యాయి.

మొదట రెండు కాళ్ల వాళ్లను రమ్మని పిలిచారు. పెద్ద పెద్ద పక్షులు వచ్చి నిలబడ్డాయి. హంసలు, కొంగలు, నెమళ్లు, కోళ్లు, వచ్చి వేగంగా పరుగుదీసాయి. ఆ వేగానికి తమకు తెలియకుండానే ఆకాశంలోకి ఎగిరాయి.

తర్వాత నాలుగు కాళ్ల వారిని పిలిచారు. చిరుత, గుర్రం, జింక, కుక్క, పిల్లి వచ్చి పరుగులు తీసారు. చివరకు అందరి కంటే ముందు జింక పరుగెత్తింది. అందరూ జింకను అభినందించారు. తరువాత ఆరుకాళ్ల వారిని పిలిచారు. చీమలు, ఈగలు, దోమలు, మిడతలు, బొద్దింకలు వచ్చి నిబడ్డాయి. పరుగులు ప్రారంభించారు. ఒక్క చీమలు దప్ప అన్నీ పైకి ఎగిరాయి. పరుగెత్తలేకపోయాయి. ఎనిమిది కాళ్ల వారిని పిలిచారు. తేళ్ళు, సాలెపురుగులు, పీతలు గునగున నడుచుకొంటూ వచ్చాయి. అవి ముందుకూ వెనక్కి పక్కలకు పరుగెత్తుతూ చూపరులను ఆకర్షించాయి. పదికాళ్లున్నవారిని పిలిచారు. ఎవరూ రాలేదు. పది కంటే ఎక్కువ కాళ్లున్నవారిని పిలిచారు

ముప్పైకాళ్లున్న జెర్రెలు, యాభై కాళ్లున్న జెర్రెలు, అరవై కాళ్ళున్న జెర్రెలు, డెబ్బై కాళ్లున్న జెర్రెలు లెక్కలేని కాళ్లున్న గాజుపురుగులు జరజరమంటూ పరుగులు తీసాయి. రాజుగారికి ఆశ్చర్యమేసింది. జెర్రెలకు ఇన్ని రకాలుగా కాళ్లుంటాయని తెలియదు. గాజుపురుగుల్లో పెద్దదానికి కాళ్లు ఎన్ని ఉంటాయో లెక్క బెట్టమన్నారు.

చిలుక "మహారాజా! నాకు తెలుసు. అన్నిటికంటే ఎక్కువ కాళ్లున్నది గాజుపురుగులకే. వంద నుండి పదమూడువందల కాళ్ల వరకు ఉన్నగాజు పురుగులున్నాయి అని చెప్పగానే అందరికీ ఆశ్చర్యం వేసింది.

చివరగా కాళ్లు లేని వారిని పిలిచారు. రకరకాల పాములు పాకుతూ వచ్చాయి. నాగుపాములు పడగలెత్తి ఆడుతూ పరుగులుతీసాయి. పాములన్నీ ఒక్క క్షణంలో తోకల మీద నిలబడి నేలమీద వాలిపోతూ ప్రదర్శన చేసాయి. గిలకల పాములు తోకలు పైకొత్తి గలగల శబ్దంచేస్తూ మైదానం చుట్టూ తిరిగాయి.

చివరగా పెంపుడు జంతువులు, పెంపుడు పక్షులు మనుషుల గురించి దృశ్యఖండికలు ప్రదర్శించాయి.

భర్తలు చనిపోయిన భార్యలు, తల్లిదండ్రులను పోగొట్టుకొన్న బిడ్డలు, అనాధలై ఎలా కష్టాలు పడతారో ప్రదర్శించిచూపారు. కొంత మంది మనుషులు మరి కొంతమందిని వేటాడి పట్టుకొని బానిసలుగా అమ్మడం, కాళ్లకు సంకెళ్లు వేసి వారి చేత పనిచేయించుకోవడం- చూపించారు.

దేవుళ్లపేరుతో జరిగే హింసను, మోసాలను ప్రదర్శించారు. చివరగా 'మానవ విషాద గీతాన్ని' ఆలపించారు. ఇవన్నీ చూసి మానవులు ఇంత కష్టాలు పడుతున్నారా అని ఆశ్చర్యపోయారు. ఎంతో బాధ పడ్డారు. ఇంత తెలివిగలవాళ్లకు ఇన్ని కష్టాలు ఏమిటో అని ఆలోచనలో పడ్డారు.

ముగింపు సందర్భంలో చివరగా తేనె పిట్టలన్నీ పైకిలేచి మైదానం చుట్టూ ఆకాశంలో పైన ఒకే చోట కొద్దిసేపు కదలకుండా నిలబడ్డాయి. తేనె టీగలు ఝుమ్మంటూ లేచి రకరకాల ఆకారాలు దాలుస్తూ చివరిలో 'శుభం' అనే అక్షరాలుగా మారి సభకు ముగింపు పలికాయి.

తరువాయి భాగంలో : పరీక్షలు మార్కులు

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

పాలేకర్, చింతల- ఆదివాసీ వ్యవసాయ వారసత్వం

పాలేకర్ 'ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ నాచురల్ ఫార్మింగ్'-2 (2007) లో ఉదాహరణలు చాలావరకు మహారాష్ట్రలోవి. అడవి నుంచి, ఋషుల నుంచి తెలుసుకున్నట్లు, సమర్థించుకుంటూ ఉదహరించే విదేశీ పరిశోధనలు- చింతల వెంకటరెడ్డి మట్టిద్రావణం మన ఆదివాసీలకు తెలిసిన పద్ధతులే.

ఈ పుస్తకంలో(పుట 266)ఆయన చెదపుట్టలు, నీరు, జీవజాలం సంబంధాలు- 'జీలకర్రంత జీవుడికి దేవుడంత గొద్దె, గాజుకంబాలిల్లు, ఘనగోపురాలు అని వర్ణించే తూర్పు గిరిజనులకు తెలిసినవే. ఊరిబయట చెదపుట్టకు మొక్కి 'పాండవదేశం పాటపూజారులు' కొండదొరలు 'నందిపదం' పాడుతుంటే, నందిపండుగ మొదలుపెడతారు. చెదపుట్ట వ్యవసాయ దశకు పునాది అయిన ఇల్లు కట్టుకోవటానికి స్ఫూర్తి నిచ్చింది. నంది-ఎద్దు శ్రమశక్తి సమకూర్చింది.


ఎక్కువగా వర్షంకురిసే ఉత్తరాంధ్ర, ముఖ్యంగా విశాఖమన్యంలో పొలాలు ఊటెక్కి ఉంటాయి.'ఊటనేలల్లో ఊడుపులు ఉద్ధరించినట్లు' అని దిగువన సామెత. ఇటువంటి ఊటపొలాలలో ఎండ్రకాయలు తొలుచుకు పోతుంటాయి. విశాఖ గిరిజనులు ఆ పొలాలను 'ఎండ్రిక నీళ్ళు' అంటారు. 'పొలాలు లోతుగా దున్నటం కర్రనాగలి వల్ల ఏమౌతుంది? ఆధునికమైన ఇనుప నాగళ్ళను, మేత చాలక బక్కచిక్కిన గుర్రాలు ఇనుప నాగళ్ళనేం లాగగలవు! నేలపైపొరలలో సున్నం బహుతక్కువగా ఉంటుంది. ఉన్నదంతా నీటిలో కరిగిపోయి పీల్చి వేయబడి ఉంటుందక్కడ. నేలను తేలికరకం నాగళ్ళతో గోకుతారు గాని దున్నరు' రష్యన్ పుస్తకం అనువాదం 'మానవులు మహీధరములు'(1960)లో ఈ పరిశీలనను 'కొండకోనలలో తెలుగు గిరిజనులు'(పుట 231)లో ఉదహరించాను.


విశాఖలో 'చాయపసుపు' పాలేకర్ దృష్టికి రాలేదు(పుట 365). ఆయన ఋతువులు, కార్తెలు విస్తారంగా ప్రస్తావించారు. అవెప్పుడో మరిచిపోయారు అంటారు స్వచ్ఛంద సంస్థలలో శాస్త్రవేత్తలు. విశాఖమన్యంలో ఇటీవల పర్యటనకు ముందు, నేను అరకులోయలో మాడగడ గ్రామం వెళ్ళాను. గుస్తాఫ్ పుస్తకంలో ఋతువులు, పండుగలు నేను తెలుగులో చదువుతుంటే గిరిజన రైతులు ఒడియాలో చెప్పారు(అరకులోయలో ఆదివాసీ అంతరంగం).

కేరళ కొండలలో దుంపల రకాల సేకరణ, సాగు గుర్తింపు; ఛత్తీస్‌ఘడ్‌లో అడవివంగకు వంగడాలను అంటుగట్టి దిగుబడి పెంచటం; గిరిజన ప్రాంతాలకు పాలేకర్ పద్ధతులను విస్తరింప చేసేటపుడు, గులిసాగు పద్ధతి ఒకటే కాక, గతంలో పేర్కొన్న నాగరత్నంనాయుడు, cycad, archid సాగు వంటివి కూడా గిరిజనుల దృష్టికి తెచ్చి, వారి పద్ధతులలో మర్మమేమిటో తెలుసుకుంటే బాగుండేది.

వంగడం, దిగుబడి, రాబడి, పనిముట్ల పంపిణి మీద దృష్టి పెరిగింది అని గమనించిన రాబర్ట్ చాంబర్స్ 'Farmers first' బృందం, 2007లో సమావేశమై 87 నుండి వస్తున్న మార్పుల పోకడలను చర్చిస్తూ, బీద రైతుల పరిస్థితి మరింత దిగజారి పోవటానికి కారణం, అతని శక్తి యుక్తులపట్ల (Cognitive knowledge) ఆసక్తి/నమ్మకం సన్నగిల్లటంగా పేర్కొంటూ, ఈ పరిస్థితులు అతన్ని ఒక పావుగా మార్చాయని అభిప్రాయపడ్డారు. (Farmers first 20 years revisited). ఇదే మాట పాలేకర్ అనుయాయులు వల్లించారు..

'వంద సంవత్సరాల క్రితం...రైతులు వ్యవసాయానికి సంబంధించిన ఏదీ, పట్టణాలు, నగరాలకు వచ్చి కొనుగోలు





చేయాల్సిన పని ఉండేదికాదు. తమదగ్గర ఉన్న దేశవాళి విత్తనాలనే తిరిగి పొలాల్లో వేసుకునేవారు. దేశీ ఆవుపేడను ఎరువుగా వాడేవారు. పట్టణాలకు వారు ఉత్పాదకాలు కొనుగోలు చేయటానికి కాకుండా, కేవలం తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోటానికి మాత్రమే వస్తుండేవారు. అయితే రైతును ఏదో విధంగా మార్కెట్‌కు ఆకర్షించి వారితో మార్కెట్‌లో రకరకాల ఉత్పాదకాలను కొనిపించేలా చేయటానికి జరిగిన ప్రయత్నాలు సఫలమయ్యాయి... ఈ దోపిడీ వ్యవస్థ దృష్టి ముందు విత్తనాలపై పడింది. సంకరజాతి విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, డబ్బుపోసి కొనుగోలు చేయకతప్పని పరిస్థితి ఏర్పడిందన్న మాట. మన వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఈ చక్రవ్యూహంలోకి ప్రవేశించటం ఎలాగో రైతుకు చెప్పారేకాని, అందులోంచి బయటపడే మార్గాన్ని చెప్పలేకపోయారు... ఆ మార్గమే 'పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ పద్ధతి' అంటూ పాలేకర్ పుస్తక అనువాదం 'పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం చేయటం ఎలా'లో (2013) పంతంగి రాంబాబు మక్కికి మక్కీ మూలంలో ఉండే మహారాష్ట్ర ఉదాహరణలే(పుట 20,46,) ఏకరువు పెట్టారు. 'రైతు నేస్తం'లో (2017) 'కొడిస మొక్క ఆకులను ఆదివాసీ రైతులు పూర్వకాలం నుండీ పంటల సస్యరక్షణలో ఉపయోగిస్తున్నారు(పుట 114) అన్న ఒక్క విషయం మాత్రం పేర్కొన్నారు..

ఇప్పటికీ ఈ పెట్టుబడి లేని(!) ప్రచారకులు తెలుగురాష్ట్రాలలో వాడుకలలోని పదసంపద, పండుగలను గుర్తుచేసే ప్రయత్నమేదీ చేయలేదు. అందుకు వందేళ్లుగా ఈ జ్ఞానం సేకరించేందుకు జరిగిన కృషి, వస్తున్న మార్పులు తెలుసుకోవాలి. ఆ ప్రయత్నం జరగనంత వరకు ఇదొక చిట్కా వైద్యంగా ఉంటుంది. ఏ ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, ఈ చదరంగంలోకి దింపారో, వాళ్ళే జనాన్ని ముంచుతారు.

అటు ప్రభుత్వం ఇటు ఐ.టి కంపెనీలు డిజిటల్ మంత్రం జపిస్తున్నాయి. ఆధార లింకేజీ అంటూ పరిగెత్తిస్తున్నాయి. రెండు నెలలలో కోవిడ్ వాక్సినేషన్ పూర్తి చేయిస్తాం అన్న ఐ.టి కంపెనీలు, రెండు సంవత్సరాలలో ఆధార్ లింకేజీలు పూర్తి చేయిస్తాం అని ముందుకు రావటం లేదు. ప్రభుత్వం, సంస్థలు వన సంరక్షణ సమితులు, విలేజ్ డెవలప్ ఏజెన్సీలు, ఇందిరాక్రాంతి పథకాలు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీలు .. ఇలా ఒకటి తరువాత ..ఇలా కొత్త తురుపుముక్కలు విసురుతున్నాయి. నమిలే పనిలేకుండా, గొంతులో గొట్టంపెట్టి అభివృద్ధి మందు పోస్తున్నాయి.

పద్యం- ఆటవెలదులు

అమ్మభాషలో చదువు

తెలుగు మాట మరిచి తెంగ్లీషులో నేర్వ
తెలుగు జాతి పరిమళాలు వాడు
జాతి సంస్కృతి కళ రీతి తప్పును సుమా!
మనిషితనము చచ్చు మార్గ మౌను

తల్లి తెలుగుభాష ఉల్లమై పెనవేయు
పాలు తాపినట్లు పలకరించు
జాను తెనుగు సొగసు జాతి కిరీటమే
మనిషితనముపెంచు మార్గ మగును

ఆంగ్ల మాధ్యమాన నలరెడి చదువులు
బట్టిబాట నడిచి గిట్టి పోవు
చిట్టిపొట్టి తెలుగె చిరునామ నిలబెట్టు
తెలుగు తనము వెలిగి తేజ మబ్బు

తెలుగు మాధ్యమాన తీరైన చదువులో
మనసు యరలు తెరచి మనును తెలివి
బాటవేయు తెలివి భావాల మెరుపుకు
విషయ మంత మెదడు విత్త మౌను

ఆంగ్ల మాధ్యమాన నాటాడు బోధన
మనసు చురుకుదనము మాడ్చి వేయు
విన్న విషయమునకు విద్యుత్తు ఉండదు
బుద్ధిగొలుసు తెంపు సద్దియె అది

తల్లి చంకనెక్కి యల్లిన మాటలు
బుద్ధి చీకటులను శుద్ధిచేయు
విషయ గ్రహణశక్తి విరబూయు పువ్వౌను
సృజన శక్తు లన్ని చెలగి యాడు

భాషలందున నొక భాషగా యింగ్లీషు
నేర్చుకొనిన కొంత నేర్పు పెరుగు
తెలుగు నేర్వకుండ తెంగ్లీషు నేర్చితే
గుండెపాట జాలు యెండిపోవు

మాతృభాషలోన మన విద్య సాగితే
మూర్తిమత్వ కాంతి కర్త వీవు
సహజ సుందరముగ సాగును విద్వత్తు
ఆంగ్లభాష కూడ అబ్బురపడు

ఆంగ్ల మాధ్యమమ్ము అరువు తెచ్చిన చీర
తెలుగు మాధ్యమమ్ము వెలుగు చీర
మాతృభాష వలనె మన నడతలు వెల్గు
సహజసిద్ధ ప్రతిభ జాలు వారు


తెలుగు 'మీడియమ్మె' వెలిగించు మనిషిని
మనసు శాస్త్రమిదియె మనకు నేర్పె
ఆంగ్ల 'మీడియాన' నగు బానిసత్వము
సహజ సిద్ధ పథము సాగదు వీను

అమ్మ ఒడి బడి చదువంటె అభ్యుదయము
అది మరిచిపోతె నబ్బు తమము
పరుల భాషలోన పఠనమ్ము మానేసి
అమ్మభాష మాధ్యమందు చదువు

వల్లభాపురం జనార్దన్
94401 63687

కథ

జె. యు. బి. వి. ప్రసాద్
jubv@yahoo.com



"ఏమోనండీ! అవేమీ నాకు తెలవవు. వీళ్ళని వొద్దంటే, నేను కూడా రాను ఈసారి" అంటూ భాస్కరం, గోడ దగ్గిర నించున్న పిల్లల్తో, "ఒరే, మీరెవరూ కూడా వెళ్ళొద్దు! మనం ఖోఖో ఆడుకుందాం, పదండి!" అన్నాడు కోపంగా.

ఏ కులము నీదంటే....

ఇది, యాభై యేళ్ళ కిందటి కథ! పరిస్థితులు ఈ నాటికీ ఏమీ మారలేదు గానీ, భావాలలో మాత్రం కొన్ని మార్పులు చోటు చేసుకొంటున్నాయి.

ఆ బడిలో ఐదో తరగతి. అది వీధిబడి. ఆ తరగతి ఉపాధ్యాయుడు చాలా 'గంభీరంగా' వుంటాడు. పిల్లలకి లెక్కల పరీక్షలు పెట్టి, వాళ్ళ చేతుల మీద పేము బెత్తంతో బరువు బరువు దెబ్బలు గంభీరంగా కొడతాడు. తప్పుకో గంభీరం దెబ్బ!

"నీకెన్ని తప్పులొచ్చాయిరా?" అనడిగాడు భాస్కరం, వాసుని ఇంకా దెబ్బలకు ముందే.

వాసు, తన నోట్సు పుస్తకం భాస్కరానికి చూపించాడు. వాడికి మూడు తప్పులొచ్చాయి. వాడి కన్నా తనకి ఒక దెబ్బ తక్కువ తగులుతుందని సంతోషించాడు భాస్కరం.

రెండు దెబ్బలు తినివచ్చి, "వాసూ! నీకో మాట చెబుతా్నా.

ఎవరికీ చెప్పొద్దురా, ఒట్టెయ్యి" అనడిగాడు భాస్కరం.

"ఏంట్రా? చెప్పు, చెప్పు! సరస్వత్తోడు. ఎవరికీ చెప్పను" అని వొట్టేశాడు వాసు.

"మరే! మన మేష్టారు, క్రౌన్ సినిమా టాకీస్‌లో నేలటికెట్లు అమ్ముతారు. తెలుసా?" అన్నాడు భాస్కరం గుసగుసలతో.

"అవునా? నీకెలా తెలుసూ?"

"నిన్న మా అన్నయ్యతో సినిమాకి వెళ్తే, అక్కడ చూశాను."

ఆ వీధిబడి ఉపాధ్యాయుడికి, ఆ బడి జీతంతో, రెక్కాడినా డొక్కాడదు. సాయంత్రాలు ఇంకేదో పని చేసుకోక పోతే, కుటుంబాన్ని పోషించు కోలేదు. ఆ విషయాలు చిన్న పిల్లలకేం అర్థం అవుతాయి, మేష్టారు కొడతాడని తప్ప?

*   *   *

ఆ వూళ్ళో కొన్ని కుటుంబాల్లో ఆడవాళ్ళు, నందికేశునినోము, మొత్తం తొమ్మిది సార్లు నోచుకుంటారు. నందికేశునినోము నాడు, తొమ్మిది రకాల తిళ్ళు చాలా ఎక్కువగా తయారుచేసి, దేవుడికి నైవేద్యం పెడతారు. చలిమిడీ, చిమ్మిలీ, పరమాన్నం, అప్పాలూ, గారెలూ, శనగలూ, అట్లూ, పులగం, వుండాళ్ళూ, – ఇలా కమ్మట తిళ్ళ రకాలు తొమ్మిది. ఇంచుమించు వంద మందికిపైగా సరిపోయేటట్టు, ఒకరోజు ఒక పదార్థాన్ని తయారుచేస్తారు. పొద్దున్నే చీకట్లో తయారుచేసిన ఆ ఒక ప్రసాదం, చీకటి పడేలోపల ఆ కులం వాళ్ళే తినెయ్యాలి. ఏమన్నా మిగిలిపోయినా, బయట పారేసినా, ఆ నోము చెల్లనట్టే లెక్క. ఈ ఆచారం రెండు కులాలలో అధికం.

ఒకరింట్లో, ఆ రోజు చలిమిడి నోము!

"మన ఇంట్లో వాళ్ళూ, చుట్టాలూ, మన కులపోళ్ళూ బాగా తినేసినా, ఇంకా చలిమిడి చాలా మిగిలిపోయిందర్రా! సాయంకాలంలోగా ఇదంతా అయిపోవాలి! ఎలాగర్రా?" అని వాపోయిందొక నోము పెద్దావిడ.

అలా కాకపోతే, ఆ పునిస్త్రీకి పుణ్యంరాదు మరి! ఆ కష్టం ఆ ఇంటికి అంతకు ముందు రోజుల్లోనూ వుండి, ఒక దారి దొరికింది.

ఎవరికీ ఒక పట్టాన ఆలోచన తట్టనప్పుడు, ఆఖరికి ఆ ఇంటాయనకి ఆ చక్కని ఆలోచన బుర్రలో మెరిసింది, ఆ పక్కన దూరంగా వున్న బడిపిల్లల అరుపులు వినపడి. "మనం, మన చుట్టు పక్కల వుండే బళ్ళకు వెళ్ళి, 'మా కులం పిల్లల్ని మా ఇంటికి నోము తిండి తినడానికి పంపండి!' అని అడిగితే, ఆ బడి వాళ్ళు తప్పకుండా మన కులం పిల్లల్నే పంపుతారు. ఆ బడి వాళ్ళకి కూడా పుణ్యం వస్తుంది కదా, నోముకి సాయంచేశారని?" అని తన ఆలోచన ఆడవాళ్ళకి చెప్పాడు. వాళ్ళందరూ వొప్పుకున్నారు. ఆ సలహాని, అప్పట్నించీ, ఆ ఇంట్లో వాళ్ళే కాకుండా, అన్ని నోముల్లో, అన్ని ఇళ్ళ వాళ్ళూ, నడుపుకుంటూ వొస్తున్నారు, ఆ వూళ్ళో.

నోము కులం కాని ఉపాధ్యాయులకి పుణ్యంమీద పెద్ద ఆశ లేదు గానీ, 'ఏమో! సాయం చెయ్యకపోతే, పాపం ఎక్కడ వచ్చేస్తుందో' అన్న భయంకొద్దీ, ఆ బడులవాళ్ళు, పిల్లల్ని లెక్కల్లోంచి కూడా లేపేసి, నోము వాళ్ళింటికి పంపిస్తూనే వుంటారు. అదొక నోము తతంగం.

*   *   *

ఆ రోజు, నోము వారింటి నించి ఒక సున్నం బొట్టు మొగాయన ఆ బడికి వచ్చాడు. మొదట, ప్రధాన ఉపాధ్యాయుడితో మాట్లాడాక, ఒక్కో తరగతికీ వెళ్ళి, ఆ తరగతి ఉపాధ్యాయుడికి నెమ్మదిగా విషయం చెప్పడం చేసి ముగించాడు. అదంతా, ఆ ఉపాధ్యాయుడికి తెలిసిందే.

ఆ తరగతిలో ఆ కులం పేరు అరిచి, "ఆ కులం పిల్లలెవరో చేతులెత్తండర్రా" అని కూడా అరిచాడు ఆ ఉపాధ్యాయుడు.

కొందరు పిల్లలు లబ లబమంటూ చేతు లెత్తేశారు ఎందుకో తెలిసే. ఆడ పిల్లలు కూడా మరీ తొందరగా లేచారు. నాలుగో ఎక్కం సరిగా రాకపోయినా, దానర్థం తెలియకపోయినా, ఎవరి కులం పేరు వాళ్ళకి మాత్రం పిల్లలందరికీ బాగాతెలుసు. ఆ రోజుల్లోనే కాదు. ఈ రోజుల్లో మాత్రం ఏం మారింది?

"చేతులెత్తిన వాళ్ళంతా ఈ పక్కన, గోడ దగ్గిర నించోండర్రా" అని మళ్ళీ అరిచాడు, ఆ ఉపాధ్యాయుడు.

'హోలో' మంటూ గోడ దగ్గిరికి చేరారా పిల్లలు.

"ఫలానా వాళ్ళింట్లో, చలిమిడి నోము వుందంట ఇవాళ. వెళ్ళి, అస్సలు పారెయ్యకుండా, చక్కగా తినిరండి" అని ఉపాధ్యాయుడి కేకలు!

విప్పారిన మొహాలతో, ఆ పిల్లలు, పుస్తకాల సంచులు వదిలేసి, ఆ ఇంటాయన వెంటబడి, పరుగులతో బైల్దేరారు. ఆ కులం పిల్లలు కాని పిల్లల మొహాలు, ఎంత చిన్నబోయాయో! ఆ చిన్నబోయి, ముకుళించిన మొహాలకు అలవాటు పడ్డ ఉపాధ్యాయులూ, నోము నోచే ఇంటాయన్లూ, ఆ మొహాల్ని ఇలాచూసి అలా వదిలేశారు. అలా, వెంటబడ్డ పిల్లల్ని పోగేసుకుని, బయటకు నడిచాడా చలిమిడి నోము బొట్లాయన.

ఆ పది మంది పిల్లల్లో భాస్కరం కూడా వున్నాడు. వాసు మాత్రం లేడు! వాసు, భాస్కరం వేపు ఏదోగా చూశాడు. బడిలోనించి కదల్లేక పోయిన పిల్లందరూ అలాగే ఎలాగెలాగో చూశారు, చలిమిడి నవ్వులతో పోతోన్న తోటి పిల్లల్ని!

*   *   *

ఘనమైన కులం పిల్లలంతా నోము వారింటికి చేరాక, అక్కడి పునిస్త్రీ ఆడవాళ్ళు, ఆ పిల్లలని కాస్త పరీక్షలతో చూశారు మొదట.

"ఒరేయ్! నువ్వు నిజంగా మా కులం పిల్లాడివేనా? తిండి కోసం అబద్ధం చెబుతున్నావా? మీ ఇంటి పేరేమిటి?" అని అడిగింది ఒకావిడ, తనకి అనుమానం వచ్చిన ఒక పిల్లాడి మొహం చూసి.

ఆ పిల్లాడు బిక్క చచ్చిపోయి, తన ఇంటి పేరు చెప్పగలిగాడు. అటెనక, గోత్రం పేరు కూడా, వంశం పేరు కూడా, ఎప్పుడూ ఇంట్లో మాటల్నే చెప్పుకుని, తన కులాన్ని రుజువు చేసుకున్నాడు!

భాస్కరానికి ఒక సమస్య వుంది. వీడు కాస్త నల్లగా వుంటాడు. చలిమిడి ఆవిడ, "ఏమిట్రా, ఇలా నల్లగా వున్నావు? మా కులం వాడివేనా?" అని అనుమానంగా భాస్కరాన్ని అడిగిందొక పచ్చటి పెద్దావిడ.

"మేమూ మీ కులమే మామ్మా! మా ఇంటి పేరు ఇదీ! మా గోత్రం అదీ! మా పెంకుటిల్లు, దేవాలయం వీధిలో వుంటుంది మామ్మా!" అని ఒప్పజెప్పాడు భాస్కరం, ఐదో యేటి నించీ వింటూ కంఠస్తం పట్టిన పాఠాన్ని.

"ఓరి పిడుగా! మరి నల్లగా వున్నావేంరా?" అనడిగింది ఆ పక్కనే వున్న ఓ బోసి నవ్వుల ముసలమ్మ. అంత వయసు దాకా చలిమిడి నోముకి పెద్దమ్మ, ఆవిడ!

"మా నాన్నగారు నల్లగా వుంటారండీ! అందుకని నేను కూడా

నల్లగా వున్నానని మా అమ్మ అంటుందండీ! కోపం వచ్చినప్పుడు, 'నువ్వు నా కొడుకువు కావు' అని తిడుతుందండీ" అన్నాడు వీడు అన్నీ చెప్పాలని!

చలిమిడి ఆడంగులందరూ నవ్వారు.

పిల్లల్ని నేల మీదే కూర్చోబెట్టి, ఆకులేసి కొబ్బరి కాయలంతంత చలిమిడి ముద్దలు పెట్టారు.

"కొంచెం కూడా పారెయ్యకుండా తినాలర్రా. జేబులో వేసుకోకండి సుమా!" అంటూ పహరా కాస్తూ తిరిగారు, నోముల పేరంటాళ్ళు!

"మాకు జేబులు లేవండీ" అని ఆడ పిల్లలు కిసుక్కున నవ్వారు, అప్పటికి నవ్వటానికి నోళ్ళు విప్పి!

ఆ ఇంట్లో నించి అంత మంది పిల్లలూ, పెద్ద వాళ్ళూ, ఏవో ఎంగిలాకులు బయట పారేస్తూండడం చూసిన బిక్షగాళ్ళు, ఆ ఇంటి దగ్గిరికి గబగబా చేరి ఎంత అడుక్కున్నా, "నోము పోతుంది" అంటూ, రవ్వంత చలిమిడి కూడా ఆ బిక్షగాళ్ళకి పెట్టలేదు ఆ ఇంటివారు.

బడి పిల్లలు తినలేక పోతున్నారు! మళ్ళీ పెడుతోంటే, "వొద్దొద్దు!" అని అరుస్తున్నారు.

"తినండి, తినండి" అని ఇంటి వాళ్ళ కేకలు.

ఆ రోజు సాయంత్రానికి గానీ, ఆ పిల్లల్ని వదల్లేదు, ఆ నోము వాళ్ళు. భాస్కరం, తినలేని కొంత చలిమిడిని లాగూ జేబులోకి కూరాడు. ఆ ఇంటి పిల్ల, దాన్ని కనిపెట్టి అరిచేసింది. భాస్కరం వీపు మీద చాటంత దెబ్బ! చలిమిడిని జేబులోంచి లాగించేసి, వాడి తోటే మింగించారు! భాస్కరం ఏడుస్తూ ఇంటి కొచ్చాడు కడుపు నొప్పితో! నలుగురు పిల్లలు మూడు రోజులు బడికి డుమ్మా కొట్టారు, మంచాలెక్కి!

* * *

వాసూ వాళ్ళ డాబా ఇల్లు, భాస్కరం వాళ్ళ పెంకుటిల్లుకి దగ్గిరే. వాసూ వాళ్ళ నాన్న, బేంకులో పని చేస్తాడు.

వాసు ఎప్పుడు భాస్కరం దగ్గిరికి వచ్చినా, ముందర గది లోనే ఆటలూ, గుణకారాల లెక్కలూ. ఆ గది దాటి లోపలికి కాలు పెట్టడానికి వాసుకి అనుమతి ఉండదు. భాస్కరం అమ్మ ఒప్పుకోదు. ఎందుకంటే, వాసూ వాళ్ళకి మడి వుండదంటుంది, అంటు తక్కువంటుంది. వాళ్ళు భోజనాలు బల్ల మీద చేస్తారంటుంది!

విచిత్రం ఏమంటే, భాస్కరాన్ని, వాసూ వాళ్ళమ్మ ముందర గదిలోకి కూడా అప్పుడప్పుడు రానివ్వదు. భాస్కరం వస్తే, ఇద్దర్నీ బైట వరండాలోనే ఆడుకోవాలంటుంది. భాస్కరం వాళ్ళ నాన్నకి బేంకు ఉద్యోగం లేదు, ఏవేవో పూజలు చేస్తూ తిరిగినా, డబ్బేం సంపాదించడు.

"వాళ్ళ ఇంట్లో, మన ఇంట్లో లాగ ఏ ఖరీదైన వస్తువులూ ఉండవు కదా? మడి తప్ప, ఏం వుంది వాళ్ళింట్లో? వాళ్ళు నిన్ను లోపలికి రానివ్వక పోతే యేం? అసలు, నువ్వే అక్కడికి పోవొద్దు!" అంటుంది వాసూ అమ్మ.

* * *

భాస్కరానికి పరమాన్నం అంటే చాలా ఇష్టం. పరమాన్నం పెడతానంటే, చెవి కోసేసుకోడానికి సిద్ధం అయిపోతాడు. అంత ఇష్టం!

ఎప్పుడూ, "అమ్మా, పరమాన్నం చెయ్యి, పరమాన్నం చెయ్యి" అని తల్లిని కాల్చుకు తింటూంటాడు.

ఆవిడ, వీడి పోరు పడలేక, ఒక గిన్నెలో ఇన్ని పాలు పోసి, అందులో గరిటెడు అన్నం పడేసి, రెండు చెంచాల పంచదార కలిపేసి, "ఇదిగో తిను!" అని ఇస్తుంది.

దాన్నే చాలా ప్రీతితో తిని, "బెల్లం పరమాన్నం అయితే, ఇంకా బాగుంటుంది" అని గునుస్తాడు.

ఆ తల్లి యేడాది కొకసారి మాత్రమే బెల్లం పరమాన్నం చేస్తుంది. అది, వాడి తాత ఆబ్దికం రోజున. అందువల్ల, యేడాదిలో ఆ రోజు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తూ వుంటాడు వీడు.

వాసే కాకుండా, భాస్కరానికి ఇంకో నేస్తం వున్నాడు ఆ తరగతిలోనే. వాడి పేరు, రాఘవ రెడ్డి. 'రెడ్డీ' అనే పిలుస్తారు వాడిని.

భాస్కరం నోముల తిళ్ళ కోసం వెళ్ళినప్పుడల్లా, రెడ్డి చాలా బాధ పడేవాడు తనని పిలవ లేదని. వాడు భాస్కరంతో చెప్పుకున్నాడు ఒక సారి తన ఆవేదన! "అదేంట్రా, ఎప్పుడూ నిన్నే పిలుస్తారు? నన్ను కూడా పిలిచే వాళ్ళు ఎవళ్ళూ రారేం?" అన్నాడు.

వాసు కూడా, "అవునూ, మమ్మల్ని పిలవరేం?" అన్నాడు.

వాళ్ళ మీద భాస్కరానికి జాలి వేసినా, ఏం జవాబు చెప్పాలో తెలియలేదు, వూరుకున్నాడు. "ఈ సారెప్పుడైనా అందరం వెళ్దాం" అనెయ్యాలనిపించింది గానీ, అనలేకపోయాడు.

రెడ్డి ఒకసారి, "మా అమ్మ, బెల్లం పరమాన్నం చేసిందిరా. బెల్లంతో. చాలా బాగుంది" అని వాడి గొప్పలు వాడు చెప్పుకున్నాడు.

భాస్కరానికి నోరూరింది. "బెల్లం పరమాన్నం నాకెంతో ఇష్టంరా రెడ్డీ! నాక్కూడా కొంచెం పెట్టిస్తావా మీ ఇంటి కొస్తే?" అని అడిగాడు రెడ్డిని.

"సరే! ఇంటర్వెల్లు టైంలో మా ఇంటికి పరిగెట్టుకుని వెళ్ళి, పరమాన్నం తినొద్దాం" అని ఒప్పుకున్నాడు రెడ్డి.

ఆ పూటంతా ఒకటే సంబరం భాస్కరానికి, బెల్లం పరమాన్నం తినబోతున్నందుకు. ఇంటర్వెల్ బెల్లు కొట్టగానే, ఇద్దరూ ఒకటే పరుగు, రెడ్డీ వాళ్ళింటికి. వాసు కూడా వాళ్ళతో వచ్చేస్తోంటే, రెడ్డి వూరుకున్నాడు. పైగా, "ఆ, రా! రా!" అన్నాడు.

పరుగులతో ఇల్లు చేరిన పిల్లల్ని చూసి, ''ఏంటర్రా, పరిగెత్తుకుంటూ వచ్చారు?'' అని ఆశ్చర్యంగా అడిగింది రెడ్డీ వాళ్ళమ్మ.

భాస్కరం, వాసూ, ఆ ఇంటి గదుల్లో తిరుగుతున్న కోళ్ళని ఆశ్చర్యంగా చూశారు. వాళ్ళంతకు ముందు ఎవరిళ్ళల్లోనూ కోళ్ళు గదుల్లో తిరగడం చూడలేదు, వాకిళ్ళలో తిరగడం తప్ప!

''ఇంటర్వెల్లు కదా? తొందరగా వెళ్ళిపోవాలి. అందుకే పరిగెత్తుకుంటూ వచ్చాం. మా ముగ్గురికీ పరమాన్నం పెట్టమ్మా" అన్నాడు రెడ్డి ఉత్సాహంగా.

వాళ్ళమ్మ నవ్వుతూ, ఓ బీరువా తలుపుతీసి, అందులోంచి ఒక గిన్నె తీసింది. దాని మీద మూత పక్కనపెట్టి, ఒక గరిటెతో, రెడ్డి చేతిలో ఒక గరిటెడు ముద్ద పెట్టింది. తర్వాత వాసు చేతిలో కూడా అలాగే పెట్టింది. ఇంకో గరిటెడు ముద్ద తీసి, భాస్కరం వేపు చూసింది. అది చలిమిడి అంత గట్టిగా వుంది.

భాస్కరానికి ఒకటే ఆశ్చర్యం. రెడ్డి అమ్మ, పళ్ళెంలో పెడుతుందనుకున్నాడు! అదీ గాక, అంత గట్టిగా వున్న పరమాన్నాన్ని

వాడెప్పుడూ చూడలేదు. గరిటిజారు పరమాన్నాలే వాడికి తెలుసు. అదీగాక, పరమాన్నం గిన్నె బీరువాలో పెడతారా? అలా ఉండడం వాడికి, అన్నింటి కన్నా ఆశ్చర్యం! "వీళ్ళకి అంటు లేదా?" అని తెగ విస్మయపడ్డాడు.

అసంకల్పిత ప్రతీకారచర్య లాగా, తన చేతిని చాపేశాడు. పరమాన్నం ముద్ద చేతిలోపడింది. ముగ్గురూ, పరమాన్నాన్ని కొరుక్కుంటూ తిన్నారు. తియ్యగానేవుంది ఆ పరమాన్నం ముద్ద.

ముద్దలు తినేసి, చేతులు కడిగేసుకుని, మళ్ళీ పరిగెత్తుకుంటూ, స్కూలుకు వచ్చేశారు.

ఆ సాయంత్రం ఆ విషయం భాస్కరం, వాళ్ళమ్మకి చెప్పాడు.

" ఎవరిళ్లల్లో పడితే వారిళ్లల్లో పరమాన్నం తినొచ్చావా, అంట్లవెధవా!" అని వాళ్ళమ్మ తిట్టింది.

* * *

ప్రతీ రోజు సాయంకాలం, బడి అయిపోయాక, కొందరు పిల్లలు కలిసి బడి పక్కన వున్న గ్రౌండులో ఆటలు ఆడతారు. ముఖ్యంగా ఖోఖో ఆట. భాస్కరం బాగా ఆడతాడని, మిగిలిన పిల్లలు, వాడిని ఆటల్లో నాయకుడిగా పెట్టుకున్నారు తమ జట్టుకు. వాడు చెప్పిన మాట వింటారు జట్టులో పిల్లలు. ఆ విధంగా వాడికి కొంచెం పలుకుబడి ఎక్కువే మిగిలిన పిల్లల్లో.

* * *

ఇంకో రోజున, బడికి ఒకాయన వచ్చి, ఉపాధ్యాయుడితో ఏదో చెప్పాడు. ఆ మగాయన్ని చూసి, ఆయన నోము ఆయనే అని, భాస్కరం పోల్చేశాడు. కిందటి నెల్లో, ఆ మనిషే వచ్చి, పిల్లల్ని చలిమిడి నోముకు తీసుకువెళ్ళిన సంగతి గుర్తొచ్చి, "ఈ రోజేం నోమూ?" అని తెలుసుకోవాలని వాడికి ఒకటే తహ తహ. నెల్నాళ్ళ కిందటి కడుపు నొప్పి మర్చే పోయాడు. "నోమా? బాగా తినొచ్చు!" ఇదీ వాడి ఆలోచన.

ఉపాధ్యాయుడు, ఎప్పట్లాగానే, "ఇదుగో, ఆ కులం పిల్లలంతా చేతులెత్తండ్రా" అన్నాడు.

భాస్కరం తెల్లబోయాడు. ఈసారి 'ఇంకేదో కులం' అన్నారే! ఇదేం కులం? ఎవరి కులం?

ఆ తర్వాత, ఎప్పట్లాగానే, "మీరంతా ఈ గోడ దగ్గిరికి వచ్చి నిలబడండ్రా" అని కూడా అన్నాడు ఉపాధ్యాయుడు.

ఈసారి, వాసు చకచకా లేచాడు!

మురుసుకుంటూ, విప్పారిన మొహాలతో కొందరు పిల్లలు, గోడ దగ్గిరికి చేరారు. రెడ్డి వదనం మాత్రం ముకుళించుకు పోయింది. భాస్కరానికి మతే పోయింది.

"అక్కడ వాళ్ళింట్లో, ఇవాళ పరమాన్నం నోమంట! వెళ్ళి తినిరండి" అని ఉపాధ్యాయుడు అరిచి మరీ చెప్పాడు.

'పరమాన్నం' అని వినగానే, భాస్కరం మొహం కళకళలాడి, లేచి గోడ దగ్గిరికి పరిగెత్తాడు. రెడ్డిని చూస్తే జాలేసింది. అయినా, తనే పరిగెత్తాడు.

తన పక్కకి వచ్చి నిల్చున్న భాస్కరం చెవిలో వాసు, "మీరు మా కులం కాదు కదరా?" అని గుసగసలాడాడు.

"ఆ సంగతి ఎవరికీ చెప్పకురా" అని వాసు చెవి కొరికాడు భాస్కరం బతిమాలుతూ.

రెడ్డి వీళ్ళని కాస్త వింతగా చూశాడు గానీ, ఏమీ అనలేదు. వాసు, "అలాగే" అన్నట్టు తలూపాడు.

ఈ నోము వాళ్ళింట్లో భాస్కరం నల్లరంగు పనికొచ్చింది. ఎవ్వరూ ఏమీ అనలేదు. వాసూ వాళ్ళ కులం నోము దగ్గిర, భాస్కరాన్ని ఎవరూ ఏమీ అడ్డగించ లేదు. పని సజావుగానే జరిగింది ఈ నల్లవాడికి.

కడుపు నిండా పరమాన్నం తిని, వాసూ, భాస్కరం, బడికి చేరారు. ఆ రుచులన్నీ రెడ్డికి చెప్పుకున్నారు. రెడ్డి, ఒక పక్క కుములుతూనే విన్నాడా కబుర్లన్నీ.

"ఈసారి నన్ను కూడా తీసికెళ్ళండ్రా!" అన్నాడు రెడ్డి అప్పుడు.

"అలా కుదరదురా! మా కులం వాళ్ళు రానియ్యరు" అన్నాడు వాసు నవ్వుతూ.

"భాస్కరం! నువ్వు గట్టిగా అడగొచ్చు కదరా? ఆటల్లో మమ్మల్నందర్నీ అదిలిస్తావుగా? వాళ్ళకి చెప్పలేవా?" అని ఆక్రోశించాడు రెడ్డి.

భాస్కరానికి చాలా బాధవేసింది. వాళ్ళని అడగాలని ఉత్సాహం అనిపించింది, రెడ్డి మాటలకు.

* * *

ఆ రోజు ఒక నిలువుబొట్ల ఆయనెవరో వచ్చి ఉపాధ్యాయుడితో మాట్లాడ్డం చూశారు పిల్లలందరూ. ఇదేదో నోము విషయమే అని, పిల్లలందరూ అనుకున్నారు. భాస్కరం ఆలోచనల్లో పడిపోయాడు. ఆ వచ్చిన మనిషిని అంతకు ముందెప్పుడూ చూడలేదు. ఆత్రంగా ఉపాధ్యాయుడివేపే చూస్తున్నాడు వీడు.

ఆ మగమనిషి చెప్పిన మాటలన్నీ విని, తల పంకించి, "ఇదిగో, ఆ కులం పిల్లలంతా చెయ్యెత్తండ్రా!" అన్నాడు ఉపాధ్యాయుడు.

గబుక్కున అలవాటు చొప్పున చెయ్యెత్తి, అంతలోనే, చెయ్యి దించేశాడు భాస్కరం. తను ఆ కులంవాడే. అయినా, చెయ్యి దించాడు. గోడకి చేరిన పిల్లలు, భాస్కరం రాలేదని చూస్తున్నారు. ఎవరికీ ఏమీ అర్థంకాలేదు. అలా ఎప్పుడూ జరగలేదు.

"ఫలానా వాళ్ళింట్లో పరమాన్నం నోము. వెళ్ళి తినిరండి" అన్నాడు ఉపాధ్యాయుడు.

భాస్కరం కదల్లేదు. ఆ ఉపాధ్యాయుడినైతే ఏ నోముకూ పిలిచిన వారు ఎవరూ ఉండరు.

'పరమాన్నం నోమా?' – ఒక్క సారిగా వులిక్కిపడ్డ భాస్కరం, వెంటనే చెయ్యెత్తబోయి దింపేశాడు. వాసూ, రెడ్డిలను కూడా పిలవలేదని వాడు ఆ పూట వెళ్ళలేదు ఆ నోముకు.

ఆ మధ్యాహ్నం, పొద్దున్న వచ్చిన మగమనిషే, బడికి మళ్ళీ వచ్చాడు. మళ్ళీ ఉపాధ్యాయుడితో గుసగుసలాడాడు. ఆడి "మళ్ళీ వస్తా! పిల్లలు ఇంకాకావాలి" అని ఇంకో తరగతివేపు వెళ్ళాడు.

"పొద్దున్న వెళ్ళిన పిల్లలంతా వచ్చి, ఈ గోడ దగ్గిర నిల్చోండ్రా!" అని ఉపాధ్యాయుడు నవ్వుతూ అరిచాడు.

అర్థం కాకుండానే, పిల్లలు అటు పరుగులతో వెళ్ళారు. భాస్కరాన్ని కూడా గోడ దగ్గిరికి వెళ్ళమని, ఉపాధ్యాయుడు సైగ చేశాడు. భాస్కరం కూడా నడిచాడు ఆ గోడ దగ్గిరికి.

"నోము వాళ్ళింట్లో పరమాన్నం ఇంకా చెల్లలేదు. పొద్దున వచ్చిన పిల్లలు కూడా మళ్ళీ తినొచ్చని నోముపూజవాళ్ళు చెప్పారంట. వెళ్ళి

తినిరండి" అని చెప్పాడు ఉపాధ్యాయుడు మళ్ళీ.

ఆ రోజు ఉపాధ్యాయుడు చాలా సంతోషంగా వున్నాడు. కొన్ని నెలలుగా బకాయివున్న జీతాలు వచ్చాయి. పిల్లలని ప్రేమగా చూశాడు ఆ రోజు. ఎవర్నీ కొట్టలేదు. తప్పులొచ్చినా తిట్టలేదు కూడా. పైపెచ్చు నవ్వుతూ కథలు కూడా చెప్పాడు.

పిల్లలంతా పొంగిపోయారు, ఉపాధ్యాయుడి దయకి. కొంత మంది పిల్లలు, ఆయన కుర్చీ చుట్టూ మూగారు కబుర్లు చెప్పటానికి.

"మేష్టారూ! మీరు కూడా పొద్దున్న పరమాన్నం నోముకి వస్తే ఎంతో కమ్మగా తినొచ్చండీ!" అన్నాడు భాస్కరం మాటల్లో.

"మేం, నీ కులంకాదు, వాసు కులంకాదులే. మమ్మల్నెవరూ నోము తిండికి పిలవరుగా" అన్నాడా ఉపాధ్యాయుడు కొంచెం ఏదోగా.

"మా నాన్నకి కోపం వచ్చినప్పుడు, 'కులం తక్కువ వెధవా' అని తిడతాడు నన్ను. కులం తక్కువంటే ఎవరండీ మేష్టారూ?" అనడిగాడు భాస్కరం భయపడుతూ.

"మీ నాన్ననే అడుగు, ఏం చెపుతాడో!" అన్నాడు ఉపాధ్యాయుడు ఆ ఏదోగానే.

"మా నాన్న ఏమీ చెప్పడండీ" అన్నాడు భాస్కరం గట్టిగా.

"ఏమిటో! ఏం నోములో! పిల్లలందరికీ సమానంగా పెట్టొద్దని నోము దేవుడే అంటాడేమో! ఎవరికి తెలుసు?'' అన్నాడు ఉపాధ్యాయుడు కోపంగా.

ఆ మాటలు ఆ పిల్లలకు అర్థమే కాలేదు. భాస్కరానికేదో అర్థమైనట్టే అయింది.

నోము పిలుపాయన, ఈ కొత్తాయన, మిగిలిన తరగతుల వెంట తిరిగొచ్చాడు, ఇంకా కొందరు పిల్లల్తో.

ఈసారి భాస్కరం కాస్త ధైర్యంగా ఆ నోమాయనతో, "నాతో పాటు ఇదుగో, ఈ రెడ్డీ, వాసూ, డేవిడ్ కూడా వస్తారండీ! పాపం, వీళ్ళెపుడూ తినలేదు. ఇప్పుడు వీళ్ళు కూడా తింటారు. వీళ్ళకి కూడా ఆకలి వేస్తోందండీ!" అన్నాడు గబగబా.

ఆ మూడు నిలువుబొట్లాయన, "తప్పు! అలా అస్సలు రాకూడదు. ఎవళ్ళ కులం వాళ్ళది. కులాల్ని కలిపెయ్యకూడదు!" అన్నాడు విసురుగా.

"పరమాన్నం చాలా వుంటే, ఎందుకు తినకూడదు?" అన్నాడు భాస్కరం.

"తప్పురా! వాళ్ళొద్దు. నువ్వు బైల్దేరు!" అని అరిచాడాయన.

"ఏమోనండీ! అవేమీ నాకు తెలవవు. వీళ్ళని వొద్దంటే, నేను కూడా రాను ఈసారి" అంటూ భాస్కరం, గోడ దగ్గిర నించున్న పిల్లల్తో, "ఒరే, మీరెవరూ కూడా వెళ్ళొద్దు! మనం ఖోఖో ఆడుకుందాం, పదండి!" అన్నాడు కోపంగా.

పిల్లలందరూ ఆటస్థలం వేపు పరిగెత్తారు.

ఉపాధ్యాయుడు నవ్వు మొహంతో, "మీరు గుండెగుడు పరమాన్నం గేదెలకు పొయ్యండీ!" అనేశాడు.

నోములాయన వెనకవున్న పిల్లలు కూడా, "రండిరా" అంటూ ఆటస్థలం వేపు పరిగెత్తారు.

నోమాయన నీరసంగా వెనక్కి తిరిగి ఆటస్థలంవేపు వెళ్ళాడు, పిల్లలు దొరక్క. భాస్కరాన్ని పట్టుకున్నాడు.

"వేరే కులాల వాళ్ళు రాకూడదురా! నోము పాడయి పోతుంది. నువ్వు రావచ్చు. నువ్వు కొందర్ని తీసుకురా! లేకపోతే నీ మీద దేవుడికి కోపం వస్తుంది!" అని బతిమాలాడా నోమాయన, భాస్కరాన్ని.

"కోపం వస్తే రానియ్! ఏమో! నోము పాడయితే మాకేం?" అంటూ పిల్లలందరికీ సైగలు చేస్తే, అందరూ కెవ్వున, "మీ నోము పాడయితే మాకేం? మాకేం? మేం రాం! మేం రాం! పో! పో!" అంటూ అరిచేశారు.

ఆ పిల్లలు ఆటల్లో పడ్డారు. నోమాయన మొహం ముడుచుకుంటూ వెనక్కితిరిగాడు.

* * *

కాలం అనే బండి, వేగంగా నడుస్తూనే వుంది. భాస్కరం, వీధి బడిలో చదువులు పూర్తి చేసి, పెద్ద చదువులు కూడా పూర్తి చేసి, ఇంజనీర్‌గా అమెరికాలో వుద్యోగం చేస్తూనే వున్నాడు.

ఒక శుక్రవారం రోజు సాయంత్రం, ఎవరో వీధి గుమ్మం తలుపు బాదారు. కాలింగ్ బెల్ పనిచేయడం లేదు పాపం, ఆ రోజు.

'ఎవరబ్బా ఈ సమయంలో?' అనుకుంటూ తలుపు తీశాడు.

ఎదురుగా పసుపుపచ్చ పట్టుచీరలో ఒకావిడ! చేతిలో ఏదో పెద్ద ప్లాస్టిక్ బేగ్! మెడలో అరడజను బంగారం గొలుసులు! చెరో చేతికీ, బంగారం గాజులూ, మట్టి గాజులూ కూడా. ఒక చేతికి, పసుపు దారం, ఆకులతో కట్టిన 'తవరం'. మొహం నిండా పెద్ద పెద్ద రెండు బొట్లు. మెడ మీద గంధపు పూతలు. చెవులకు జానెడేసి లోలాకులు. వడ్డాణం ఒక్కటే తక్కువ! ఇంచుమించు గుడిలోంచి పారిపోయి వచ్చిన అమ్మవారి చెల్లెలిలాగా వుంది!

"ఎవరు కావాలండీ?" అని ఆశ్చర్యంగా అడిగాడు భాస్కరం.

"వరలక్ష్మి గారు వున్నారాండీ?" అని చాలా మర్యాదగా అడిగింది.

"వున్నారు, రండి. కూర్చోండి" అని మర్యాదచేసి, లోపలికి వెళ్ళి, తన భార్యని వెంటబెట్టుకుని వచ్చాడు.

"ఎవరండీ మీరు? ఏం కావాలి?" అని వరలక్ష్మి కూడా ఆశ్చర్యపోతూ అడిగింది.

"మేమున్న కాంప్లెక్సులో వున్న మీ చుట్టాలావిడ, మీ పేరూ, మీ అడ్రసూ ఇచ్చారండీ. నేనివాళ శ్రావణ శుక్రవారం నోము నోచుకున్నానండీ! మన కులం వాళ్ళకి వాయినం ఇద్దామని, చాలా దూరం నించి వచ్చానండీ! మన కులం వాళ్ళే దొరకడం లేదండీ, వాయినాలు ఇవ్వడానికి. చూస్తూ చూస్తూ నోము ఎలాపాడు చేసుకుంటానూ?" అంటూ వివరంగా చెప్పిందా అమ్మవారి చెల్లెలు.

"మీరేం అడిగారో, మా చుట్టాలావిడ ఏం చెప్పిందో! నేనలా ఈ కులం, ఆ కులం అని వాయినాలు తీసుకోనండీ! నాకు చాలా అయిష్టం, కులాల పద్ధతులు పాటిస్తున్నారంటే. అమెరికా వస్తూ, మీ కులాన్ని కూడా వెంటబెట్టుకుని తెచ్చుకున్నారన్న మాట! మీకు తగ్గవాళ్ళని చూసుకోండి!" అంది వరలక్ష్మి నిర్మొహమాటంగా.

వరలక్ష్మి వేపు భాస్కరం ఆనందంగా చూస్తోంటే, అమ్మవారి చెల్లెలు, మొహం చిన్నబుచ్చుకుని, రయ్యిన కారెక్కి జోరుగా వెళ్ళిపోయింది.


అ

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

అడుగుజాడలు ఆనవాళ్లు-18
నా రాజాపేట - రఘునాథపురం యాత్ర



నేను ప్రసిద్ధ శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ కేంద్రమైన కొలనుపాకలో సోమనాథాలయాన్ని పునరుద్ధరిస్తున్నపుడు, అక్కడ ఉపాధ్యాయుడుగా పనిచేసి, అనేకమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన విరువింటి గోపాలకృష్ణగారు అడపాదడపా నా దగ్గరికొచ్చేవారు. వచ్చినపుడల్లా ఆయన నాతో కొలనుపాక చరిత్ర, ఆలయాలు, మఠాలు, శాసనాలు, శిల్పాల గురించే ముచ్చటించేవారు. ఆయన కొలనుపాక దేవాలయాలు - శాసనాలపై ఒక చక్కటి పుస్తకాన్ని కూడా రాశారు. నన్ను, కొలనుపాక వీధులన్నీ తిప్పి, శాసనాలు, శిల్పాలను చూపించేవారు. వీరనారాయణస్వామి దేవాలయాన్నీ, మరెక్కడా లేనటువంటి కొలనుపాకలోనే ఉన్నటువంటి అష్టాదశ కులాల దేవాలయాలు, అష్టాదశ మఠాలను చూపించి, కొలనుపాక సమగ్ర చరిత్రను తెలియజేశారు. అంతేకాదు, ఆయన శిష్యుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్, రామోజు హరగోపాల్‌గారు కూడా, కొలనుపాకలోని శాసనాలు శిల్పాలపై పరిశోధనలు చేశారు. ఆలేరు పరిసరాల్లో చారిత్రక ప్రదేశాలపై 'ఆలేరు కంపణం' అనే పుస్తకాన్ని రాశారు. గోపాలక్రిష్ణగారు, హరగోపాల్‌గారూ ఇద్దరూ









నన్ను, రాజాపేటకోటను, రాజప్రసాదాన్ని, రఘునాథపురంలోని ఇనుపయుగపు సమాధుల్ని చూడాలని సూచించారు. 2001వ సం॥ నుంచి అనేకసార్లు, ఆ రెండు ఊళ్లూ చూద్దామనుకొన్నానేగానీ, ఇప్పటికిగాని కుదరలేదు.

గత ఫిబ్రవరి మొదటివారంలో శనివారంనాడు ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్, దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక సంపాదకులు ఎం. వేదకుమార్ గారి నుంచి ఫోన్. వెళ్లి రావడానికి ఏర్పాట్లు నేను చేస్తాను. ఏదైనా చారిత్రక ప్రదేశం గానీ, వారసత్వ కట్టడంగానీ చూచివద్దాం అని ఆయన అన్నారో లేదో, నా మదిలో రాజాపేట, రఘునాథపురం మెదిలాయి. ఆదివారం ఉదయం 6.00 గంటలకు బయలుదేరి వెళ్దామనుకొని యాదాద్రి మీదుగా, రాజాపేటకు ప్రయాణం కట్టాం. రాజాపేటలో ఒక కోట, రాజప్రాసాదం, ఒక దిగుడుబావి, అద్దాల మేడ(రంగమహల్) ఉన్నాయని విన్నాను. రాజాపేటకోట రక్షిత కట్టడమైనా ప్రైవేటు వారి అధీనంలో ఉంది. చూడటం ఎలా అనుకొనేలోపు, హరగోపాల్‌గారికి ఫోన్ చేశాను. ఆయన తన శిష్యుడు, విలేకరీ అయిన హిమ్మత్‌సింగ్‌తో మాట్లాడి, నాకు ఆయన కాంటాక్టు నంబర్ ఇచ్చాడు.

మేం రాజాపేట చేరుకొనేసరికి హిమ్మత్‌సింగ్, రాజాపేట కోట దగ్గరుండి, కోట గుమ్మం ద్వారా, ఒక 200 సం॥ల చింతచెట్టును దాటి, మరో ద్వారం చేరుకొన్నాం. ఎత్తైన కోటగోడకు మధ్యలో 'రాజవీధి' ఉట్టిపడేట్లున్న కొయ్య తలుపుల పనితనం మమ్మల్ని కట్టిపడేశాయి. అందులోంచి లోనికెళ్లి, మెట్లెక్కి కోటగోడపైకి ఎక్కాం. ఆశ్చర్యం. గోడపైన 80 అడుగుల విశాలం గల నడక ద్వారంపైన ఒక చక్కటి మేడ. మేడ శిథిలమైందిగానీ, బాల్కనీ, గోడలపైనున్న అందమైన సున్నపు అలంకరణలు, కుతుబ్‌షాహీల చివరికాలపు, మరియు రాజస్థానీ శైలికి అద్దంపడుతూ మమ్మల్ని ఆకర్షించాయి. వేదకుమార్‌గారు ఒక్కసారిగా స్థాణువైపోయారు. ఎంత నైపుణ్యం, ఎంత సృజనాత్మకత అంటూ ఆయన ఆ ప్రాంతపు అణువణువూ ఫోటోలు తీసుకొన్నారు. మళ్లీ మెట్లు దిగాం. హిమ్మత్‌సింగ్ మమ్మల్ని కొంతదూరంలో నున్న రంగమహల్‌కు తీసుకెళ్లాడు. పొదల్లోంచి, పెరిగిన గడ్డిలోంచి, ఆదుర్దాగా పోతున్న మాకు రాజాంతఃపుర స్త్రీలు జలకాలాడే స్నానవాటిక, అందులో ఒక ఫౌంటెన్ కనిపించాయి.

స్నానవాటిక ఎదురుగా ఒకప్పటి రాచకార్యాలకు సాక్షీభూతంగా నిలిచిన ఒక చక్కటి భవనం. నునుపైన సున్నం దట్టించిన గోడలు,





ఆహ్లాదం కలిగించే ఆర్చీలు, ఏనుగుపాదాల్ని తలపించే స్థంభాలు, సంప్రదాయ ఇంటి నిర్మాణంలో భాగమైన కొయ్యదూలాలు, దంతెలు, మందపాటి మద్రాస్ కప్పు, నాజూకైన మెట్ల వరుస, దూలాల కింద, గోడలపైన చక్కటి నీలంరంగు రేఖాచిత్రాలు, సందుదొరికిన చోటల్లా సున్నపు డిజైన్లు అన్నీ కలిపి రాజాకోటలో నివశించిన అనేక తరాల వరాల అనుభవాల జ్ఞాపకాల దొంతర్లను వెల్లడిస్తున్నాయి. పై అంతస్తుకెళ్లి చూశాం. పడమరవైపు భాగమంతా పడిపోయింది. స్థంభాలు వొరిగిపోయాయి. కప్పు కూలిపోయింది. రంగులు వెలవెలబోయాయి. సున్నపు డిజైన్లు రూపు కోల్పోయాయి. కళ్లముందు శిథిలాలు, కాళ్ల కింద చరిత్ర శకలాలు!

ఆరాతీస్తే, క్రీ.శ. 1775 రాయన్న అనే రాజు, అక్కడొక కోటను కట్టడం చేత ఆ ఊరికి రాజాపేట అనే పేరొచ్చిందనీ, రాజాపేట నిజాం పాలనలో ఒక సంస్థానమనీ, రాయన్న తరువాత, వెంకటనారాయణ రావు, ఆయన భార్య జానకమ్మ, అక్కడ ఆలయాలు, చెరువులు నిర్మించారనీ, ఆయన కుమారుడు జస్వంతరావు ఇక్కడ నివసించి, చక్కటి పాలన నందించారనీ, ఇండో యూరోపియన్ శైలిలో రాజభవనానికి ఆయన సొబగులద్దారని ఠాకూర్ హిమ్మత్‌సింగ్, రాజకుటుంబ కేళీవిలాసాలను కళ్లారా చూచిన చింతచెట్టుకింద మాకు వివరిస్తుంటే, మేము రెండుమూడు తరాల తెరల వెనక్కు వెళ్లి, ఊహాలోకాల్లో విహరించి, ఎదురుగా ఉన్న ఒక బంగ్లాలో రాజకుటుంబీకుల వర్ణ చిత్రాలను చూచి, రఘునాథపురం బయలుదేరాం.

పోతూ పోతూ కుర్రారంలోని త్రికూట శివాలయం, దాని అద్భుత పనితనం, శిథిలమైనా పదిలంగానే ఉన్న నందిమండపాలను చూచి, ఒక వైపు కాకతీయుల కళాకౌశల్యాన్ని మెచ్చుకుంటూ, మరోవైపు ఆలయ దుస్థితికి నొచ్చుకొంటూ రేణికుంట చేరాం.

రేణికుంటకు రాగానే అక్కడి బురుజును చూచి, విరివింటి గోపాలకృష్ణగారు రాసిన కుర్రారం రామిరెడ్డి, రేణికుంట రామిరెడ్డి పుస్తకం గుర్తొచ్చింది. పంచాయితీ ఆఫీసు ఎదురుగా నిర్మాణంలో ఉన్న కొత్త దేవాలయం ప్రాంగణంలోని ఒక గదిలో బంధించిన దేవతా విగ్రహాల్ని చూచి, దేవుళ్లను బంధించే శక్తి, మనుషులకే



ఉందని తెలుసుకొన్నాను. నేనూ, వేదకుమార్ గారూ కలిసి, పక్కనే ఉన్న విలువెత్తు గణేశుని బొమ్మను, దానిపైన రుద్దిన రంగుల్ని చూచి బాధపడటం కన్నా ఏమీ చేయలేకపోయాం. పోగైన జనానికి విగ్రహాల చరిత్రను చెప్పి రంగులు వేయొద్దని ప్రాధేయపడ్డాం.


ఒక అరగంట ప్రయాణం తరువాత రఘునాథపురం రామస్వామిగుట్టను చేరుకొని, గుట్టమీద, కిందా ఉన్న ఇనుపయుగపు సమాధుల్ని చూశాం. క్రీ.పూ. 1000 సం॥ల నాటి సమాధులు, మధ్యలో శవపేటిక, పైన పెద్ద కప్పులరాయి, చుట్టూ గుండ్రంగా బండరాళ్లతో నాటి కట్టడ కౌశలాన్ని తెలియజేస్తున్నాయి. అంతకుముందు 100కి పైగా ఉండేవని, ఇపుడు పాతికకు పరిమితమైనాయని, అపుడే అక్కణ్ణించి మట్టి తీసికెళ్లటానికి ట్రాక్టర్‌తో వచ్చిన రైతుకు వాటి చారిత్రక ప్రాధాన్యతను వివరించి కాపాడుకోవాలని చేతులెత్తి నమస్కరించాం. బరువెక్కిన గుండెలతో తిరుగుప్రయాణం కట్టాం. మా రెండు కళ్లలో రాజాపేట, రఘునాథపురం జ్ఞాపకాల వెలుగులు ఆవరించాయి. అ

డాక్టర్ షేక్ మహబూబ్ బాషా
డాక్టర్ మొహమ్మద్ కరీం

వలసాంధ్రలో స్త్రీల పత్రికలు: సతీహితబోధిని (1883 - 1905)

18,19 శతాబ్దాలనాటి వలస భారతదేశంలో సంఘ సంస్కరణోద్యమం ముమ్మరంగా సాగింది. సంస్కరణోద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయడానికి సంఘసంస్కర్తలు వివిధ భారతీయ భాషల్లో పత్రికల్ని ప్రారంభించారు. సంఘసంస్కరణోద్యమానికి స్త్రీల సమస్యలు ప్రధాన కేంద్ర బిందువుగా వుండేవి. అందుకే స్త్రీలలో సంఘసంస్కరణ సందేశాన్ని ప్రచారం చేయడానికి ప్రత్యేకంగా స్త్రీలకోసం పత్రికలు యేర్పాటు చేయబడ్డాయి. గుజరాతీ, బెంగాలీ, ఉర్దూ, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ మొదలైన భారతీయ భాషల్లో అనేక స్త్రీల పత్రికలు ప్రచురితమయ్యాయి. ఇంతవరకూ లభిస్తున్న చారిత్రకాధారాల ప్రకారం గుజరాతీలో 1850ల్లో వెలువడడం ప్రారంభమై ఒక శతాబ్దంపాటు కొనసాగిన "స్త్రీబోధ్" వలస భారతదేశంలో వెలువడ్డ స్త్రీల పత్రికలన్నింటిలోకీ తొలిపత్రిక

ఈ చారిత్రక నేపథ్యంలో– సంఘ సంస్కరణోద్యమంలో భాగంగా – తెలుగులోకూడా అనేక స్త్రీల పత్రికలు వెలువడనారంభించాయి. వలసపాలన ముగిసేనాటికి సుమారు 20కి పైగా స్త్రీల పత్రికలు వెలువడ్డాయి. కొన్ని పురుషుల సంపాదకత్వంలో వెలువడితే అనేకం స్త్రీల సంపాదకత్వంలో వెలువడ్డాయి. 'సతీహితబోధిని', 'తెలుగు జనానా', 'గృహలక్ష్మి' మొదలైనవి పురుషుల సంపాదకత్వంలో వెలువడ్డ స్త్రీల పత్రికలు. 'హిందూ సుందరి', 'సావిత్రి', 'వివేకవతి', 'అనసూయ', 'ఆంధ్రలక్ష్మి', 'ఆంధ్ర మహిళ' మొదలైనవి స్త్రీల సంపాదకత్వంలో వెలువడిన స్త్రీల పత్రికలు. స్త్రీల పత్రికలు మహిళల్లో సంఘసంస్కరణోద్యమ వ్యాప్తికి ఇతోధికంగా తోడ్పడమే కాకుండా వలసాంధ్రలో మహిళోద్యమం రూపుదిద్దుకోవడానికి కూడా దోహదపడ్డాయి. తొలినాటి స్త్రీల పత్రికల్లో పరిమితమైన అంశాలనే – అంటే స్త్రీ విద్య, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలు, గృహ సంస్కరణ మొదలైన అంశాలను మాత్రమే చర్చించేవారు. కాలక్రమేణా స్త్రీలలో కలిగిన జండర్ చైతన్యానికి అద్దంపడుతూ స్త్రీల పత్రికల్లో మహిళా హక్కులు సంబంధించిన అంశాలు విరివిగా ప్రచురించబడ్డాయి. స్త్రీ–పురుష సమానత్వం, పురుష దురహంకార నిరసన, స్త్రీలకు దక్కాల్సిన పౌర, చట్టపరమైన సమాన హక్కులు (ఆస్తి హక్కు, చట్టసభల్లో సమాన ప్రాతినిథ్యం, విడాకుల హక్కు మొదలైనవి), కుటుంబ సంబంధాల ప్రజాస్వామీకరణ, సమానత్వం ప్రాతిపదికన సామాజిక సంబంధాలు, జండర్ న్యాయం మొదలైన ప్రజాస్వామిక విషయాలన్నీ 'గృహలక్ష్మి', 'ఆంధ్ర మహిళ' లాంటి స్త్రీల పత్రికల్లో చర్చించబడేవి. మరో ముఖ్యమైన విషయమేమిటంటే 20వ శతాబ్ది ప్రారంభంనుండీ వలసాంధ్రలో అనేక మహిళా సంఘాలు యేర్పడ్డాయి. వివిధ ప్రాంతాల్లో యేర్పడ్డ స్వతంత్ర మహిళా సంఘాలే కాకుండా యావదాంధ్ర స్త్రీలనూ ఒకే గొడుగు క్రిందికి తెచ్చిన 'ఆంధ్ర మహిళామహాసభ' (ప్రారంభం 1910 సం?), ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ రాష్ట్ర శాఖ అయిన "ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ" (ప్రారంభం 1927 సంII) మొదలైన రాష్ట్రస్థాయి మహిళా సంఘాలు కూడా యేర్పడ్డాయి. ఈ సంఘాల సమావేశ వివరాలనూ, అక్కడ స్త్రీలు చేసిన ప్రసంగాల పూర్తి పాఠాలనూ స్త్రీల పత్రికలు అత్యంత శ్రద్ధతో ప్రచురించేవి. అనేక మంది మహిళోద్యమ నాయకురాళ్ళు, కార్యకర్తల ఛాయాచిత్రాలను కూడా ప్రచురించిన స్త్రీల పత్రికలు మహిళల దృష్టికోణంతో మహిళోద్యమ చరిత్రను నిర్మించడానికి అత్యంత అమూల్యమైన ఆకరాలుగా, ప్రాథమికాధారాలుగా తోడ్పడుతున్నాయి. ఈ విధంగా వలసాంధ్రలోని మహిళోద్యమానికి స్త్రీల పత్రికలు వెన్నెముకగా వుండేవని చెప్పడం ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు!


SATHI HITHA BODHINI.
AN ILLUSTRATED MONTHLY MAGAZINE FOR THE USE OF FEMALES

Vol III] RAJAHMUNDRY October 1888 [No. 5

RAJAHMUNDRY
PRINTED AT THE VIVEKAVARDHANI PRESS
1888

'సతీహితబోధిని' తెలుగులో వెలువడ్డ మొట్టమొదటి స్త్రీల పత్రిక. ఇది ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం సంపాదకత్వంలో ఏప్రిల్ 1883 నుండి సంస్కరణోద్యమానికి ప్రధాన కేంద్రమైన రాజమండ్రి నుండి వెలువడనారంభించింది. 1905 వరకు కొనసాగిన 'సతీహితబోధిని' 1886 – '88 మధ్య కొంతకాలం ఆగిపోయి 1888లో పునరుద్ధరించబడింది. సెప్టెంబరు 1904లో

ఒక సంవత్సరంపాటు యింకో స్త్రీల పత్రిక అయిన 'తెలుగు జనానా'లో కలిసిపోయింది. తర్వాత ఆగిపోయింది. 'సతీహితబోధిని' ముఖపత్రంపై "స్త్రీల నిమిత్తము మాసమునకొకసారి ప్రకటింపబడును" అని తెలుగులోనూ, "ఏన్ ఇలస్ట్రేటెడ్ మంత్లీ మేగజైన్ ఫర్ ద యూజ్ ఆఫ్ ఫీమేల్స్" అని ఇంగ్లీషులోనూ ప్రకటించబడేది. తపాలా ఖర్చుతో కలుపుకొని సంవత్సర చందా, రెండు రూపాయలు' అర్థ సంవత్సరానికి ఒక రూపాయి, విడి ప్రతి వెల నాలుగు అణాలు. ప్రారంభంలో ప్రతి సంచికలోనూ 15 పుటలుండేవి, 1888ల్లో వీటి సంఖ్య 20 నుండి 24 పుటలకు పెరిగింది. 'సతీహిత బోధిని'లోని విశేషాంశమేమంటే ఇందులో అనేక పటాలుండేవి. పత్రిక 'వివేకవర్ధని ముద్రాక్షరశాల'లో ముద్రితమయ్యేది. 'సతీహితబోధిని'కి ఎంత సర్క్యులేషన్ వుండేదో సరిగ్గా తెలియదు. స్త్రీలలో సంఘసంస్కరణోద్యమ భావాలను వ్యాపింపజేయడానికి వీరేశలింగం 'సతీహితబోధిని'ని చాలా బలంగా వుపయోగించారు. పత్రికను ప్రారంభించడానికి గల కారణాన్ని తన "స్వీయ చరిత్రము"లో ఈ క్రింది విధంగా స్పష్టం చేశారు వీరేశలింగం:

"నాకు స్త్రీవిద్య యందును, స్త్రీలయభివృద్ధియందును విశేషాభిమానము. స్త్రీల దురవస్థకు బలుమాఱు పరితపించి వారి దుస్థితిని దొలగింప బ్రయత్నింప వలయుననియు, స్త్రీలను ప్రస్తుత స్థితిలోనే యుంచి తాము పైకిలేచుట పురుషులకెన్నడును సాధ్యము కాదనియు, తాము బాగుపడవలెనన్నచో వారిని గూడ విద్యావివేకాదులయందు మంచి స్థితిలోనికి దెచ్చి వారితో గలిసి యున్నత పదవికి లేవవలయుననియు, తాము మాత్రమే వృద్ధినొంది వారిని నిజమైన మైత్రి కనర్హమైన దాస్యమునందే యుంచదలచిన పక్షమున దెలియకయే, దినదినక్రమమున దామున్నత పదము నారోహించువచ్చుటకు మాఱుగా నొక్కొక్క మెట్టు దిగుచు వచ్చి కడపట వారితో గూడ నడుగంటుట యనివార్యమనియు, నేను దలంచుచుండెడువాడను. వారు చదువుటకు తెలుగులో మంచి పుస్తకములు లేకుండుట దలపోసి యాలోపమును నాచేతనైనంతవఱకు తొలగింపవలెనని 1883వ సంవత్సరమునందు స్త్రీల కొఱకు 'సతీహితబోధిని' యను పేరితో తెలుగుననొక మాసపత్రికను బ్రకటించుటకారంభించితిని." (రెండవ భాగము, పు. 203–204)

పత్రిక పేరుకు తగ్గట్లే అది స్త్రీలకు ఉపయోగకరమని తలచిన వివిధ విషయాలను "బోధించుటకు" ఉద్దేశింపబడిరది. దైనందిన జీవితంలో స్త్రీలు ఏమి చేయాలి, ఏవి చేయకూడదు మొదలైన విషయాలను చర్చించేది. 'సతీహితబోధిని' స్త్రీల విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. స్త్రీ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ మొట్టమొదటి సంచికలోనే ఈ క్రింది విధంగా రాశారు:

"తల్లి చదువెరుంగని మూఢురాలైన పక్షమున చదువు నిమిత్తము

స్త్రీలను విద్యావంతులను చేసి వారిని సంస్కరించి ఆధునీకరించడం 'సతీహిత బోధిని' ప్రధాన ఉద్దేశం. అంతేకాని స్త్రీలను స్వంత వ్యక్తిత్వమున్న స్వతంత్ర వ్యక్తులుగా తీర్చిదిద్దడం కాదు. వలసపాలనా కాలంలో పురుషులకేర్పడిన అవసరాలూ, ఆకాంక్షలకనుగుణంగా స్త్రీలను మలచడం – ఉత్తమ గృహిణులుగానూ, మంచి తల్లులుగానూ, భార్యలుగానూ, తమ భర్తలకు అన్ని విషయాల్లోనూ సహాయ సహకారాలందించే జ్ఞానవంతులైన సహచరులుగానూ స్త్రీలను తయారుచేయడం వీరేశలింగం ఉద్దేశం. ఆయన ఉద్దేశానికనుగుణంగానే 'సతీహిత బోధిని' పనిచేసింది.

తండ్రి కూకలు వేసినప్పుడును, శిక్షించినప్పుడును తల్లి కల్పించుకొని యడ్డము వచ్చి కొమాళ్ళ చదువుగూడ చెడగొట్టి వాండ్రను ఎందుకుంబనికిరానివారిగా జేయును. తల్లి విద్యావతి అయ్యేనేని బిడ్డల చదువును తాను స్వయముగా కనుగొని ఇంటివద్ద పాఠములు చెప్పి చదివించి విద్యాబుద్ధులయందు ప్రవీణులుగా దిద్దును. పూర్వ కాలమునందొక రాజు గ్రామ పాఠశాలను పరీక్షించుటకై వెళ్ళి యందులో ఒక చిన్నవాడు తానడిగిన ప్రశ్నలన్నింటికిని మంచి సమాధానములు చెప్పుటచేత ఆశ్చర్యపడి, ఉపాధ్యాయులను పిలిచి ఈ పిల్లవాడింత తెలివితో చదువుటకితని విద్య విషయమున నీవెక్కువ శ్రద్ధపుచ్చుకొనుచున్నావా అని అడిగెను. ఆ ఉపాధ్యాయుడు తానందఱికంటెను ప్రత్యేకంగా ఈ బాలుని విషయమయి ఎక్కువ శ్రద్ధ పుచ్చుకొనలేదనీ, అతని తల్లి చదివినదగుటచేత ఇంటివద్ద ఆమె శిక్షణ చేతనే ఈ చిన్నవాడు తన తోడి వారందరికంటె వయస్సున చిన్నవాడయినను విద్యయందు వారందరింకంటెను తెలివిగలవాడయ్యెననియు రాజుతో చెప్పెను. ఆ మాటలకు రాజు మిక్కిలి సంతోషించి పిల్లవానికి మంచి బహుమానమిచ్చుటయేకాక కొడుకు చదువు విషయమయి ఎంతో శ్రద్ధ పుచ్చుకొన్నందుకుకయి తల్లికి కూడ స్వర్ణమయమయిన రత్నాభరణమును బహుమతిగానంపెను."

ఒక వ్యాసానికి "చదువెఱుగని స్త్రీలు తమ బిడ్డలకు శత్రువులు" అనే ఆకర్షణీయమైన శీర్షిక వుండింది. ఈ శీర్షిక ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే తర్వాత కాలంలో పలుమంది ఈ శీర్షికతోనే స్త్రీ విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ వ్యాసాలు రాశారు. ఉదాహరణకు స్త్రీల పత్రిక అయిన 'వివేకవతి' ఆగష్టు 1913 నాటి సంచికలో కత్తిరశెట్టి కేశవమ్మ ఈ శీర్షికతో ఒక వ్యాసాన్ని ప్రచురించారు (పు. 333–'35). (ఇది ఈమె శ్రీకాకుళం మహిళా సంఘంలో యిచ్చిన ప్రసంగ పాఠం. స్త్రీవిద్యను బలంగా కాంక్షించిన కేశవమ్మ బాలికలకు విద్య నేర్పించని తల్లిదండ్రులను శిక్షించడానికి ఒక చట్టం ఉండాలని కోరారు.) విద్య ద్వారా స్త్రీలు గృహకార్య నిర్వహణలో ప్రవీణులౌతారని వీరేశలింగం బలంగా విశ్వసించారు. ఆయన ప్రకారం, "ఇంట

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేడు..

నడచు గృహకృత్యములనెల్ల జక్కబెట్టవలసిన భారము స్త్రీలది గాని పురుషులది కాదు. ... వారు చదివినవారైయున్న యెడల, ఆ కార్యముల నెంత బాగుగాను, జాగ్రత్తతోను, వారు నిర్వహింతురు? ఇప్పటి మన ముగుదల కట్టి సామర్థ్యము లేకపోవుటచేతనే కదా యింటి బరువంతయు బురుషులమీదనే పడి, పగలెల్ల వెలుపల గొలువు చేసివచ్చి బడలియుండియు, ఆ వెనుక నింటిపనినిగూడ దామే విసువుతో జూచుకోవలసిన వారుగా నున్నారు? ఒకప్పుడు భర్త విదేశగామియగుటయు సంభవించును. అప్పుడు గృహకృత్యములయందలి రహస్యములను భార్య భర్త కెన్నిటినైన దెలుపవలసి యుండును. ఇల్లాండ్రు చదువులేని వారైరేని, ఆ గోప్య విషయములనెల్ల బ్రియులకు దెలిపి యవసరోచితములగు ప్రత్యుత్తరములం బొందజాలక కార్యభంగమునకైన నోరిచికొని యూరకుండవలసినవారేకదా!"

విద్యతోపాటు 'సతీహిత బోధిని' స్త్రీలు పతివ్రతా ధర్మాన్ని పాటించాల్సిన అవసరాన్ని విశేషంగా ప్రచారం చేసింది. 1883 జూన్ సంచికలో పతివ్రతా ధర్మాన్ని గూర్చి రాస్తూ స్త్రీలు తమను తామే రక్షించుకోవాలనీ, పురుషులు వారికి రక్షణ కల్పించాలనుకోవడం సబబు కాదనీ ఈ క్రింది విధంగా హితబోధ చేశారు:

"పురుషులు స్త్రీల పాతివ్రత్యమును రక్షించుటకయి పూర్వకాలము నుండియు సర్వ ప్రయత్నములును చేయుచున్నారు. అయినను ఈ పాతివ్రత్యము విద్యా ప్రభావమువలన గలిగిన వివేకము చేత నిలువవలసినదే కాని పురుషులు చేయు నిర్బంధములచేత నిలుచునది కాదు. ... పురుషులు స్త్రీలను గదులలోపెట్టి, తాళము వేసి, కావలియుంచి, నిరోధించుట వలన పాతివ్రత్యమును రక్షింపజాలరనియు, స్త్రీలకు విద్యా వివేకాదులు కలిగించి వారియాత్మలను వారు కాపాడుకొనునట్లు చేసిననే పాతివ్రత్య రక్షణము కలుగుననియు (స్మృతికారుడు) స్పష్టముగా కనబరచియున్నాడు. ... పురుషులవలని భీతియు నిర్బంధములను పనిలేక మనంతట మనమే రూపమున మన్మథులైనను పరపురుషులను తృణప్రాయముగా చూచి మన మానమును కాపాడుకొనవలయును ... ఎప్పుడైన దుర్బుద్ధి పుట్టవచ్చును గనుక సాధ్యమయినంతవరకు గుణవంతురాండ్రను తోడుగా వుంచుకొనుచు మన మనస్సునకు దుర్మార్గపు చింతల కవకాశము లేకుండ (చేసుకొనవలెను)".

విద్య స్త్రీలను పతివ్రతలుగా మారుస్తుందని భావించారు వీరేశలింగం. ఆయన మాటల్లో: "స్త్రీలు తాము గ్రంథములందు జదివిన పూర్వపు బుణ్యసతుల చరితములను మదిని నిలిపి వారివలె బ్రవర్తింప నుత్సాహము కలవారయి, పతివ్రతలగుదురు."

'సతీహిత బోధిని'లో స్త్రీవిద్య, పాతివ్రత్యం పైననే కాకుండా యింకా అనేక యితర అంశాలపై కూడా విరివిగా రచనలు ప్రచురితమయ్యాయి. 'సుగుణదుర్గుణములు', 'భూతదయ', 'జీవకారుణ్యము', 'పరోపకారము', 'సహనమును ధైర్యమును', 'గర్వము', 'గృహిణీ ధర్మము', 'బాల శిక్షణము', 'బిడ్డల నాలోచించుట', 'మిత వ్యయము', 'ధనము', 'ఆభరణములు', 'అమిత వ్యయము', 'దేహారోగ్యము', 'తగువులమారితనము', 'కొండెములు చెప్పుట', 'అత్తగారి కోడండ్రికము', 'హిందూ సుందరుల ప్రస్తుత స్థితి', 'శకునములు', 'జ్యోతిశ్శాస్త్రము', 'సూక్ష్మవస్తు దర్శక యంత్రము', 'అగ్ని పర్వతములు', 'పాములు', 'శ్రీ విక్టోరియా మహారాణిగారు' మొదలైన అంశాలపై వ్యాసాలూ, పద్యాలూ, గీతాలూ ప్రచురితమయ్యాయి. ఇలాంటి రచనల్ని ప్రచురించడం ద్వారా స్త్రీలలో సుగుణరాశుల్ని పెంపొందించి వారిని ఉత్తమ గృహిణులుగానూ, మంచి భార్యలుగానూ, తల్లులుగానూ, తమ భర్తలకు విజ్ఞానులైన సహచరిణులుగానూ మార్చడానికి 'సతీహిత బోధిని' తన శాయశక్తులా ప్రయత్నించింది. ఈ రచనల్లో అధికశాతం వీరేశలింగం ద్వారా రచించబడ్డాయి. ఆయన స్త్రీల అవసరాన్ని దృష్టిలో వుంచుకొని చాలా సులభమైన శైలిలో విషయాల్ని వివరించడానికి ప్రత్నించారు. చాలా సందర్భాల్లో సులభంగా అర్థం అవడం కోసం విషయాన్ని నీతి కథల రూపంలో ప్రకటించారు.


స్త్రీలను విద్యావంతులను చేసి వారిని సంస్కరించి ఆధునీకరించడం 'సతీహిత బోధిని' ప్రధాన ఉద్దేశం. అంతేకాని స్త్రీలను స్వంత వ్యక్తిత్వమున్న స్వతంత్ర వ్యక్తులుగా తీర్చిదిద్దడం కాదు. వలసపాలనా కాలంలో పురుషులకేర్పడిన అవసరాలూ, ఆకాంక్షలకనుగుణంగా స్త్రీలను మలచడం - ఉత్తమ గృహిణులుగానూ, మంచి తల్లులుగానూ, భార్యలుగానూ, తమ భర్తలకు అన్ని విషయాల్లోనూ సహాయ సహకారాలందించే జ్ఞానవంతులైన సహచరులుగానూ స్త్రీలను తయారుచేయడం వీరేశలింగం ఉద్దేశం. ఆయన ఉద్దేశానికనుగుణంగానే 'సతీహిత బోధిని' పనిచేసింది. అయినప్పటికీ 19వ శతాబ్ది చివర్లో స్త్రీలకోసం ఒక పత్రికను యేర్పాటు చేయడమన్నది దానంతటకదే ఒక అభ్యుదయకరమైన విషయం. తొలి స్త్రీల పత్రిక అయిన 'సతీహిత బోధిని' తర్వాత కాలంలో అనేక స్త్రీల పత్రికలు వెలువడడానికీ, 20వ శతాబ్ది ప్రథమార్థంలో స్త్రీలే స్త్రీల పత్రికలకు సంపాదకులుగా పనిచేయడానికి ముందుకురావడానికీ చక్కటి బాటవేసి దారిచూపిన దీపశిఖ.

డాక్టర్ షేక్ మహబూబ్ బాషా
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ 9160579705
డాక్టర్ మొహమ్మద్ కరీం
రిసర్చ్ అసిస్టెంట్, ఐ.క్యూ.ఏ.సీ., 9440445098
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (హైదరాబాద్)

అమ్మనుడిలో విద్యాబోధనతోనే ఆర్థిక ప్రగతి-
ప్రజల భాషలో పాలనతోనే ప్రజాస్వామ్య సుస్థిరత

పుస్తక సమీక్ష

నిక్ ని తెలుగువారికి చేరువ చేసిన ఉమాదేవి రచన



రచన: సమ్మెట ఉమాదేవి
వెల: 250/-
ప్రతులకు: సమ్మెట ఉమాదేవి,
ఇంటి నెం.3-2-353,
రెండవ అంతస్తు,
స్వామి వివేకానంద వీధి,
ఆర్.పి. రోడ్డు, సికింద్రాబాదు,
తెలంగాణ -500 003
సెల్:9849406722

వేమన శతకంలోని "సాధనమున పనులు సమకూరు ధరలోన.." పద్యపాదం చదివితే 'అంత సులభమా?' అని పెదవి విరిచేవారికి, నిక్ జీవితం ఒక చక్కని ఉదాహరణ.

"శారీరక అవయవాలు కాదు, మానసిక శక్తులను కూడగట్టుకోండి" అంటూ తన ప్రేరణోపన్యాసాలతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది అభిమానులను సంపాదించుకున్న మూడడుగుల మూడు అంగుళాల నికోలస్ జేమ్స్ వుయిచిచ్ (నిక్) పుట్టుకతో విభిన్న ప్రతిభావంతుడు. రెండు కాళ్ళు, రెండు చేతులు కూడా లేకుండా జన్మించి కష్టాల మెట్లపై నుంచి, ఆకాశం అంచులు తాకుతున్న అవిరళ కృషీవలుడు నిక్.

నిక్ సాహస జీవితం గురించి ప్రపంచ భాషలన్నీ తమ భాషల్లో రచనలు చేస్తుంటే, తెలుగులో ఆయనకు సంబంధించిన పుస్తకాలు అంతగా లేవనే కొరతను రచయిత్రి సమ్మెట ఉమాదేవి తీర్చారు. ఎంతో ప్రయాస కోర్చి అనేక సంఘటనలను, రంగు రంగుల ఛాయా చిత్రాలతో గుది గుచ్చి తెలుగు పాఠకులకు అందించడంలో ఆమె కృతకృత్యులయ్యారు.

'నిక్ అంటే ప్రేరణ' (నికోలస్ జేమ్స్ వుయిచిచ్ విజయగాథ) అనే ఇలాంటి స్ఫూర్తిమంతమైన పుస్తకాలు తెలుగు భాషలో కచ్చితంగా రావాలి. ప్రతి చిన్న విషయానికి తమని తాము బలి చేసుకోవడానికి వెనుకాడని యువత, ఒంటరితనంతో నలిగే పిల్లలు, ఆదరణకు నోచుకోని స్త్రీలు, ఓడిపోతామన్న భావనలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు తప్పక చదివి ప్రేరణ పొందాల్సిన పుస్తకం ఇది.

టెట్రా ఫోకో మెలియా సిండ్రోం అనే అత్యంత అరుదైన వ్యాధి వలన అవకరంతో పుట్టిన వ్యక్తి నిక్ , ఎదిగే క్రమంలో తనని తాను తీర్చి దిద్దుకున్న వైనాన్ని ఉమాదేవి రచన కళ్లకు కట్టింది. ఎంతో ఆశతో ఎదురుచూసిన తొలి సంతానం, కనీస అవసరాలైన అవయవాలు లేకుండా పుట్టడంతో తండ్రి బోరిస్, తల్లి దుష్క లు తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాంటి చిన్నారిని పెంచడానికి వారు పడ్డ కష్టం హృదయం ద్రవించేలా ఉమాదేవి అక్షరీకరించారు. నిక్ ని సాధారణ పాఠశాలలో చేర్చడానికి తల్లి దుష్క చేసిన న్యాయ పోరాటం ఆలోచింపజేస్తుంది.

అవసరమైన అవయవాలు లేక, తోటి వారు చేసే గేలి భరించలేక, తన పని తాను చేసుకోలేక, ఇతరులపై ఆధారపడటం ఇష్టం లేక, ఆత్మన్యూనతకు లోనై బాత్ టబ్‌లో పడి బలవన్మరణానికి నిక్ ప్రయత్నించిన ఘటనను ఎంతో హృద్యంగా అక్షరబద్ధం చేశారు రచయిత్రి. వరుసగా బాల్యం, విద్య, యవ్వనం, ఉపన్యాసకుడిగా ఎదగడం, సంఘసేవ, వివాహం, సంతానం, నిక్ రచనలు, నిక్ పై వచ్చిన రచనలు వంటి అనేక విషయాలను, నిక్ ఆయా సమయాల్లో ఎదుర్కొన్న అవమానాలను, అనుభవాలను రచయిత్రి మలచిన తీరు శ్లాఘనీయం.

అవకరంతో పుట్టిన నిక్ స్కేటర్ పై పడుకుని ముందుకు సాగుతూ, వీల్ చైర్ లోకి ఎక్కడం వంటి వాటి మొదలు, ఈత, సర్ఫింగ్ నేర్వడం వంటి వివరాలతో నిక్‌లో ధైర్యశాలిని ఆవిష్కరించి, అందుకు స్ఫూర్తిదాయకమైన బేతని హేమిల్టన్ వంటి వారి వివరాలు కూడా చక్కగా అందించారు ఉమాదేవి. కేవలం నాలుగే నాలుగు అవయవాలు- తొడకు అంటి పెట్టుకుని అదనపు అవయవంలా ఉన్న పాదం, తల, మెడ , నుదురుల సహకారంతో, నిక్ అంచలంచలుగా ఎదిగిన క్రమాన్ని చక్కగా వివరించారు. తల్లి దుష్క న్యాయపోరాటంతో, సీటు సంపాదించిన స్కూల్ లోనే పాఠశాల కెప్టెన్‌గా నిక్ ఎదిగిన తీరు పిల్లలను కచ్చితంగా ఆకర్షిస్తుంది, వారిని చైతన్యవంతం చేస్తుంది.

" కొంత మంది యువకులు రాబోవు యుగం దూతలు..పావన నవజీవన బృందావన నిర్మాతలు" అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లు నేటి తరం యువకులకి భిన్నమైన వాడు నిక్. యువకుడుగానే ప్రేరణోపన్యాసాలనిస్తూ, 'లివ్స్ విఠౌట్ లింబ్స్' వంటి అనేక స్వచ్ఛంద సంస్థలను స్థాపించి, అవయవ లేమితో పుట్టిన వారికి బ్రతుకు పాఠం చెప్పడం గొప్ప విషయం. అలాంటి ఆదర్శ సంఘటనలను ఒక్కొక్కటిగా రచయిత్రి వివరించిన తీరు అభినందనీయం. ప్రపంచంలో అత్యంత ఆదరణ పొందిన ప్రేరణోపన్యాసకుడిగా ఎదిగిన నిక్‌లోని ప్రసంగీకుని లక్షణాలను గుర్తించిన ఉపాధ్యాయుడు గురించి రాశారు, కానీ వారి పేరు ప్రస్తావించి ఉంటే బావుండేది.

19 ఏళ్ళ వయసులో తన సంపాదనలో 20,000 డాలర్ల ను దక్షిణాఫ్రికాలోని అనాథలకు విరాళం ఇవ్వడం ఎందరో నిరుద్యోగులకు ప్రేరణ. ఆ విషయం గురించి నిక్ చెప్పినప్పుడు ఆ క్షణంలో అతని తల్లిదండ్రుల భావోద్వేగాన్ని పాఠకుల ముందుంచడంలో రచయిత్రి తన రచనా పటిమను చూపారు. ఆ సంఘటన చదువుతుంటే, "పుత్రోత్సాహము తండ్రికి// పుత్రుడు జనియించినపుడె కలుగదు, జనులా// పుత్రుని గని పొగడంగ// పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ !" అన్న బద్దెన పద్యం చదువరుల మనసులో మెదిలి తీరుతుంది.

నిక్ అమెరికా ప్రవాసం, అనంతరం అనేక స్వచ్ఛంద సంస్థల స్థాపన, వాటి పనితీరు, నిక్ చైనా యాత్ర, 'కానే మియాహరా'తో

నిక్ ప్రేమాయణం, పెళ్ళి, సంతానం దేనికదే ప్రత్యేకం. తండ్రి, గురువు, స్నేహితుడు, మార్గదర్శకుడిగా నిక్ చెప్పే బోరిస్ గురించి, బోరిస్ తో నిక్ ఇంటర్వ్యూ చేసిన ఘట్టం గురించి చక్కని విశ్లేషణాత్మక వివరాలున్నాయి.

నిక్ లాంటి వారిని పెంచడం వెనుక తల్లిదండ్రుల వేదన ఎంత హృద్యంగా ఉంటుందో, ఎంత నమ్మకం, శక్తి కూడగట్టుకోవాలో నిక్ తండ్రి బోరిస్ రాసిన పుస్తకం 'రైజింగ్ ది పర్ఫెక్ట్లీ ఇంపర్ఫెక్ట్ చైల్డ్ ' గురించి, అందులో తొలిపలుకులు నిక్ రాయడం గురించి చదివితే పాఠకులు రోమాంచితమవుతారు. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రేరణోపన్యాసకుడైన నిక్ జీవితంతోపాటు, నిక్ లాంటి వారైన గాబే ఆడమ్స్, అమీ బ్రూక్స్ , ఇంగా పెట్రీ , జెస్నీ ఫర్ బ్రికర్ వంటి వారి గురించి కూడా ఈ పుస్తకంలో ఛాయాచిత్రాలతో కూడిన కథనాలను అందించడం ఈ పుస్తకానికి మంచి పేరు తెస్తుందనడంలో సందేహం లేదు.


ఇక అనేక దేశాలు పర్యటిస్తూ, మిలటరీ వారిని సైతం తన ఉపన్యాసాలతో చైతన్యపరుస్తూ ముందుకు వెళుతున్న నిక్ హవాయిలోని హోనోలులులో లాక్ డౌన్ సమయంలో మహిళా ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ప్రేక్షకులు లేని ఉపన్యాసం అబ్బురపరుస్తుంది. అన్నింటికీ మించి "మీకేమి ఇష్టం?" అంటే "కుటుంబంతో గడపడం" అని చెప్పే నిక్ జీవితంలో ఎన్నో ఘటనలను కళ్లకు కట్టిన సమ్మెట ఉమాదేవి రచనతో నిక్‌ని తెలుగు వారికి చేరువ చేశారని చెప్పవచ్చు.

ఈ పుస్తకంలో లోటును గమనిస్తే, చిన్నారులకు చేరువయ్యే విధంగా మరింత సరళంగా ఉంటే బావుండనిపించింది. ఇది చిన్నారుల కన్నా యువతకు ఎక్కువ ఉపయుక్తం కావచ్చు. ఇక అనేక చోట్ల నిక్ జీవితంలోని విశేషాలు వివరించేటప్పుడు, అవే విషయాలు పునరావృతం అయ్యాయి. అలా వాటి బదులు మరికొన్ని కొత్త విషయాలను అందిస్తే బావుండేది. మూడవ ప్రేరణోపన్యాసకుడు అన్నప్పుడు మొదటి ఇద్దరు ఎవరో తెలిపితే బావుండేది. ఇక అక్షర దోషాలు అక్కడక్కడా ఇబ్బంది పెట్టాయి. నిక్ తండ్రి పేరు మొదట్లోనే మూడు రకాలుగా బోరీస్, బోరిస్, బోరిస్లావ్ అని రాయడం వల్ల కొంచెం గందరగోళంగా అనిపిస్తుంది. తరువాతంతా బోరిస్ అనే కొనసాగడం వల్ల సమస్య ఉత్పన్నం కాలేదు. సాంత్వన, ఒంటరితనం వంటి పదాలలో దోషాలు కనిపించాయి. స్వాంతన అన్నా పెద్ద దోషం కాకపోవచ్చు కాని అర్థం ఉండదు. ఒంటరితనాన్ని 'వంటరితనం' అంటే అర్థం లేదు. కానీ 'వంటరి' అని వాడటం వల్ల అర్థం మారిపోతుంది. 'వంటరి' అంటే వంటవాడు (శబ్దరత్నాకరము)అని అర్థం వస్తుంది.

కథా రచయిత్రిగా, ఆదర్శ ఉపాధ్యాయినిగా సమ్మెట ఉమాదేవి ప్రాచుర్యం పొందారు కనుక, ప్రత్యేకంగా బాలల కోసం నిక్ జీవితంతో పూర్తి బొమ్మల పుస్తకం తెస్తే పిల్లలకు మరింత ఉపయుక్తంగా ఉండవచ్చు. భూగ్రహం పై నిక్ లాంటి వ్యక్తి బ్రతుకుపోరాటంలో విజయ పతాక ఎగురవేశాడన్న విషయం, ప్రాంతాలకతీతంగా ప్రతి మానవుడికీ తెలియాల్సిన అవసరం ఉంది.

కరణం కళ్యాణకృష్ణ కుమార్
-98484 28978

త్వరలో ద్వారబంధాల చంద్రయ్యదొర విగ్రహం





కొయ్యూరు మండలం ముంప గ్రామంలో లంబసింగిలో కట్టే 'మన్యం స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం'లో శ్రీ ద్వారబంధాల చంద్రయ్య దొర విగ్రహాన్ని నిర్మిస్తున్నట్లు 2022 ఫిబ్రవరిలో మ్యూజియం అధికారులు వెల్లడించారు. ఇటీవల జరిగిన ఒక సభలో ప్రముఖ సాహితీవేత్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సీనియర్ అధికారి శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు శ్రీ కోటిపల్లి సుబ్బారావు రచించిన – 'చరిత్ర విస్మరించిన స్వాతంత్ర్య యోధుడు ద్వారబంధాల చంద్రయ్యదొర' పుస్తకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. ఇంతకు ముందు జనవరి నెలలో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జిల్లా ఉద్యోగుల సంఘంవారి ఆధ్వర్యంలో కూడా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362





వివాహ సమయంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఛమన్‌లాల్, ప్రభాకర్‌జీ



సంతానంతో.....



చిరకాల స్నేహితుడు శ్రీ కానాతో (కుడివైపు వ్యక్తి)

గాంధీ, గోరాలే స్ఫూర్తి

ఆదర్శ దంపతులు

మనోరమ, అర్జునరావు

1917లో పుట్టిన రావూరి అర్జునరావు గారికిప్పుడు 105వ ఏడు. ఆయన 1917లో పుట్టారు. ఆరోగ్యంగా విజయవాడలో ఉన్నారు. ఆయన జీవిత భాగస్వామి మనోరమ 1928లో జన్మించారు. ఇద్దరికీ 1948 ఏప్రిల్‌లో గాంధీగారి చేతుల మీదుగా సేవాగ్రాం ఆశ్రమంలో పెళ్లి జరగవలసి ఉంది. కాని, గాంధీజీ జనవరి 30న హత్యగావించబడడంతో లబ్ధప్రతిష్ఠులైన గాంధేయ వాదులందరూ కలిసి 1948 మార్చి 13న సేవాగ్రాం ఆశ్రమంలో బాపుకుటికి ఎదురుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించే చోట వారివురికీ పెళ్లి చేశారు. వీరి వివాహానికి ప్రధాని నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, వినోబా, ఠక్కర్ బాబా, ఆర్య నాయకం, ప్రభాకర్‌జీ వంటి పెద్దలు విచ్చేశారు. గాంధీ ఆశ్రమంతో వారికున్న అనుబంధం సాటిలేనిది. గాంధీగారి సూచన ప్రకారమే, వారికి వివాహ పూర్వమే గాంధేయ ఆశయాలతో ఆదర్శ జీవనం గడపడంలో శిక్షణ ఇచ్చారు. గోరా గారి కుమార్తె అయినా, మనోరమ గారి పుట్టినిల్లుగా సేవాగ్రామం ఆశ్రమం ఆమెను ఆదరించింది. ఆమె మొదటి కాన్పును కూడా ఆశ్రమమే నిర్వహించిందంటే ఆమెకు ఆశ్రమంతో ఉన్న బంధం ఎంతటిదో మనకు అర్థమవుతుంది. నాటి నుండి నేటి వరకు ఎంతో ఆదర్శంగా గాంధేయమార్గంలో జీవిస్తూ వారి ఆదర్శ దాంపత్యం 75 ఏళ్ల రికార్డును నెలకొల్పింది. అన్ని విధాలా గాంధీ 'గారి ఆలోచనలకు, గోరా ఆచరణకు జరిగిన పట్టాభిషేకం వారి వివాహం' అని లోకం కీర్తించిందంటే అందులో అతిశయోక్తి ఏముంది!

వారి 75 ఏళ్ల వివాహ జీవిత సందర్భంగా గోరాగారి మరొక కుమార్తె డా।। మారు, అల్లుడు హరి సుబ్రమణ్యం గార్ల మాటల్ని మనం ఇక్కడ ప్రస్తావించుకోవడం సందర్భోచితంగా ఉంటుంది.

"నేటికీ ఎంతో అన్యోన్యంగా, పరస్పర అనురాగాప్యాయతలతో అర్జునరావు, మనోరమల దాంపత్యం మధురాతి మధురం. అస్పృశ్యతా నిర్మూలనకుగాను ఎన్నో కులాంతర వివాహాలను నిర్వహించారు. మూఢనమ్మకాల నిర్మూలనకుగాను తమ జీవితకాలాన్ని పణంగాపెట్టి గోరా-గాంధీల ఆదర్శాలకు జీవితాచరణకు శృతిచేసి వారి జీవన రాగాన్ని వేనోళ్ళ కీర్తించే విధంగా తమ జీవితాన్ని మలుచుకొని నేటికీ ఆదర్శ గాంధేయ దంపతులుగా మన మధ్య ఉన్న వీరి దాంపత్యం భావితరాల వారికి స్ఫూర్తిదాయకం కాగలదని ఆశిస్తున్నాం" వారికీ, వారి కుటుంబ సభ్యులకూ ఈ సంబర్భంగా మా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

-సంపాదకుడు, అమ్మనుడి

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
APRIL 2022 Vol :8, Issue 2

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244